# కథామంజరి

## పది కథల సమాహారం



ఏప్రిల్ 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి


**ఏప్రిల్ 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 4

# కథామంజరి
## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక సంక్రాంతి కథల పోటీలు - 2026

# విజేతలు

కథామంజరి సంక్రాంతి 2026 కథల పోటీలో బహుమతులు పొందిన రచయితలను గత సంచికలలో పరిచయం చేసినప్పుడు.. సకాలంలో వివరాలు అందని వారిని ఇప్పుడు పరిచయం చేస్తున్నాం!



**శ్రీ పి.వి.ఆర్. శివకుమార్** కథామంజరి, మార్చి 2026 సంచికలో ప్రచురింపబడిన ప్రోత్సాహక బహుమతి పొందిన కథ "లేమిని మించిన పాపం" రచయిత శ్రీ శివకుమార్ గారు 1951 లో పుట్టి, పెరిగింది విజయవాడలో! వృత్తి రీత్యా మెకానికల్ ఇంజనీర్. హెచ్. ఎం. టి. లో 30 ఏళ్ల సర్వీస్ తరవాత, ఏ.జి.ఎం. గా ఐచ్ఛిక పదవీవిరమణ. ఆ తరవాత ఒక ప్రైవేట్ కంపెనీలో చేరి, కొనసాగుతున్నారు. ప్రస్తుత నివాసం ముంబాయి. 1965లో మొదలైన రచనా ప్రస్థానం ఏ ప్రత్యేకతా, అలజడీ లేకుండా అరవైలో పడి అలవోకగా దాటిపోయింది. ఈ అరవై ఏళ్లలోనూ నాలుగు వందలకి పైగా రచనలు ఆయన పేరుకి జత పడ్డాయి. అచ్చు పడ్డాయి. ఇందులో అత్యధికంగా కథలూ, కాసిని నవలలూ, కొద్దిపాటి వ్యాసాలూ, వ్యాసార్థాలూ, విపులలో అర్ధ శతానికి పైగా అనువాద కథలూ, సితారలో సినిమా సమీక్షలూ... హైదరాబాద్ ఆకాశవాణిలో కథలు, నాటికలు, ప్రసంగాలతో పాటుగా వెదజల్లిన పూల జల్లులూ.. ఇలాగ అనేక రకాలు. రచయితకి అరవై నిండుతుండగా అయిదవ కథల సంపుటి, "అవ్యక్త రాగం" వెలువరించారు. ఇన్నాళ్లలో రాసిన మూడు వందల పైచిలుకు కథలతో పదుగురి నోళ్లలో రాతగాడిగా పేరు తెచ్చుకున్నారు. 51 కథలకి వివిధ పత్రికల పోటీలలో బహుమతులు వచ్చాయి. "అయితే, ఏ కొందరు పాఠకుల గుండెల్లోనైనా వీటిలో ఏ ఒక్క కథయినా కొన్నాళ్లపాటైనా చోటు చేసుకుని ఉంటే సంతోషమే" అని అంటారు ఇప్పటికీ! ఉత్తమ అభిరుచులతో నడుస్తున్న కథామంజరిలో బహుమతి పొందటం ఇది 'ముచ్చెం మూడో సారి'.



**శ్రీ తులసి బాలకృష్ణ** కథామంజరి, మార్చి 2026 సంచికలో ప్రచురింపబడిన ప్రోత్సాహక బహుమతి పొందిన కథ "నిరసన". రచయిత శ్రీ బాలకృష్ణ గారు మంచి పేరు పొందిన కథ, నవల, నాటక రచయిత. ఆయన రంగస్థల నటుడుగా, దర్శకుడుగా, నాటక రచయితగా ఎన్నో బహుమతులు అందుకున్నారు. అలాగే నాటక పోటీలకు గుణనిర్ణేతగా కూడా మంచి పేరు తెచ్చుకున్నారు. వీరికి రాష్ట్ర స్థాయి నాటిక పోటీల్లో నంది అవార్డు, గరుడ అవార్డు వచ్చాయి. ఓ జాతీయ బ్యాంకు మేనేజరుగా పదవి విరమణ చేశారు.



**శ్రీమతి వేలూరి ప్రమీలా శర్మ** కథామంజరి, మార్చి 2026 సంచికలో ప్రచురింపబడిన ప్రోత్సాహక బహుమతి పొందిన కథ "నెలగంట నవ్వింది" రచయిత్రి శ్రీమతి ప్రమీలా శర్మగారు వివిధ సాహితీ ప్రక్రియలైన కథ, కథానిక, నాటిక, ధారావాహికలతో పాటు పద్య రచన, గజల్ రచనలో కూడా ప్రవేశం ఉంది. చాలా పోటీలలో బహుమతులు పొందడంతో పాటు, పుస్తకాలుగా కూడా ముద్రించడం జరిగింది. ఇంతవరకూ 178 కథలు వివిధ పత్రికలు, మరియు ఆకాశవాణిలోనూ ప్రచురణ/ప్రసార యోగ్యతను పొందియున్నవి. 2004లోనే సాహితీ ప్రస్థానం మొదలైనప్పటికీ, 2020 నుంచీ విరివిగా పత్రికలకు కథలు వ్రాస్తున్నారు.



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు

# కథామంజరి శ్రావ్యసంచిక




## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | iii |
| కథా మార్గదర్శి | v |
| కథా పరిచయం | vii |
| వినదగునెవ్వరు చెప్పిన .. | x |


## కథలు


| | | |
|---|---|---|
| లవ్ అండ్ హేట్ | కర్లపాలెం హనుమంతరావు | 1 |
| అపాత్రదానం | ప్రశాంత్ వర్మ ఉప్పలపాటి... | 6 |
| ఎంతెంత దూరం .. | పి. రాజేంద్ర ప్రసాద్ | 12 |
| ప్రయోజనం | వి. రాజారామ్మోహనారావు | 17 |
| చెదరని చిత్తరువు | చాగంటి ప్రసాద్ ... | 21 |
| యువత కే! | పూడిపెద్ది శేషు శర్మ | 28 |
| అహంకారం | పైడిమర్రి రామకృష్ణ | 34 |
| సరైన ఎంపిక | వడ్డేపల్లి వెంకటేశ్... | 37 |
| చెమ్మ | డా. ఎ.యం. అయోధ్యారెడ్డి | 40 |
| డాక్టర్స్ డైలమా | వి. వి. బి. రామారావు | 49 |



# కథాకీయం

తెలుగు భాషని, తెలుగు కథని పదిలపరుస్తూనే... నాటి, నేటి కథలను రేపటి తరానికి అందించాలనే ఆలోచనతోనే కథామంజరి పురుడు పోసుకుని, ఈ రోజు ఆరేళ్లప్రాయం దాటబోతుంది. గడిచిన ఈ ఆరేళ్లలో భాషను, కథను కాపాడే బాధ్యతను మరింత విస్తృత పరిచి, ఓ ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్నాం!

సరే.. మా మాటను పక్కన పెడితే.. మన భాషని కాపాడుకోవాలనే ఉద్యమాలు అంతగా కనబడకపోయినా, ఈ మధ్య కాలంలో 'తెలుగు మహాసభలు' పేరిట అక్కడక్కడ భారీ ఎత్తునే నిర్వహించడం జరిగింది. భాషాపండితులను, సాహితీవేత్తలను పిలిచి సత్కారాలు చేసినట్లు కూడా పత్రికల్లో చూసాం! వీరి అందరి కంటే ముఖ్యంగా మంత్రులను, అధికారులను, రాజకీయ ప్రముఖలను, నాయకులను.. ఆహ్వానించి, వారికి పెద్ద పీటలు వేసారు. వారి వారి ఉపన్యాసాలకు ఎక్కువ సమయం కేటాయించి, ఆర్భాటాలు చేశారు. అందరూ తెలుగు భాష గొప్పది, రక్షించుకోవాలని నొక్కి వక్కాణించారే గాని, నేడు తెలుగుభాష పరిస్థితి ఏమిటో, భాషని నిలుపుకోవడానికి ఏం చెయ్యాలో.. వంటి అతి ముఖ్యమైన విషయం మీద చర్చలు జరిగిన దాఖలాలు లేవు. ఒకవేళ జరిగినా.. వాటికి ప్రాముఖ్యత ఇవ్వకుండా, ఓ మొక్కుబడిగా నిర్వహించారేమో కూడా! అసలు దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్టు ఉంది.

అప్పుడప్పుడు వార్తాపత్రికలలో.. ఈ సభల వార్తలు చూస్తుంటే సాము విడిచి లొట్టలు వేస్తున్న ధోరణి కనబడుతోంది. ప్రముఖ సాహితీవేత్తల సాహిత్య ఉపన్యాసాలు, ప్రాచీన సాహిత్యం మీద విశ్లేషకులు.. అంటూ ఏవేవో కార్యక్రమాలు నిర్వహించినట్లు, పెద్ద పెద్ద వార్తా విశేషాలు పత్రికల్లోనూ, సాంఘిక మాధ్యమాలలోనూ కనబడ్డాయి గానీ, రోజు రోజుకి.. ప్రాణవాయువు పడిపోతూ మృతభాషగా నిలువబోతున్న మన తెలుగుని ఎలా కాపాడుకోవాలనే చర్చ ఎక్కడా జరిగినట్లు కనబడలేదు. భాషని నిలుపుకోడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలమీద కూడా సదస్సులు నిర్వహించినట్లు కూడా లేదు. సభల చివర్లో అన్ని తీర్మానాలతో పాటు తెలుగుభాషని నిలుపుకోడానికి చర్యలు చేపట్టాలనీ.. 'గుంపులో గోవిందా' లా ఓ తీర్మానం చేసి చేతులు దులుపుకుంటున్నారు!

ఒకాయన 'ఇంట్లో అందరూ తెలుగులో మాట్లాడుకుంటే చాలు.. భాష నిలబడుతుందంటారు'. అలా ఇంట్లో మాట్లాడుకుంటే.. వేమన శతకం చదవడం వస్తుందా? పోనీ ఓ పద్యమో, పాటో ఆ పిల్లాడి చేత పాడిస్తే.. ఆ తెలుగుని ఇంగ్లీషులో వ్రాసుకుని ఆ పిల్లాడు పాడుతాడు. ఇంగ్లీషులో పెళ్ళి అని రాయడానికి 'pelli' అని రాయాలి. అది చూసి 'పెల్లి' అని చదువుతాడు. ఇంకొకాయన 'పిల్లలూ.. మీరు తెలుగు నేర్చుకుని తెలుగు పుస్తకాలు చదవండి' అని పిలుపునిస్తారు. నేర్చుకోడానికి ఏ స్కూల్లో తెలుగు ఉందసలు? స్కూలు వాళ్ళే.. 'సెకెండ్ లాంగ్వేజ్ తెలుగుకు బదులు సంస్కృతం లేదా హిందీ తీసుకోండి. స్కోరింగ్ బావుంటుందని' సలహా చెప్తారు. అయినా సరే తెలుగులో చదివిద్దామని, కొద్దిమంది తల్లితండ్రులు అనుకున్నా.. ప్రాథమిక స్థాయిలో కూడా తెలుగు కనబడదు. మన చుట్టు పక్కల ఉన్న రాష్ట్రాలు.. ఒరిస్సా, తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో కార్పొరేట్ స్కూళ్లలో కూడా ప్రాథమిక స్థాయిలో

ప్రాంతీయభాషని ఖచ్చితంగా చదవాలనే నిబంధన ఉంది. మన తెలుగు రాష్ట్రాలలో ఆ నిబంధన కరువైంది. తెలుగుభాష పిల్లలకి రాకపోవడానికి కారణం పిల్లలు, తల్లిదండ్రుల ఆలోచనలు కావు.. ఖచ్చితంగా ప్రభుత్వ విద్యావిధానమే! పరభాషా వ్యామోహం కలిగించింది కూడా ఈ విద్యావిధానమే! ఇది మార్చగల శక్తి ప్రభుత్వానికే ఉంది. మంత్రాలకి చింతకాయలు రాలనట్టే.. ఈ రోజుల్లో పిలుపులు, తీర్మానాలు, ఉద్యమాల వలన భాష నిలబడదు. రెండు మూడు తరాల వాళ్ళకి తెలుగు రాకుండా పోయింది, కనీసం ఇప్పుడైనా అ ఆ లు మొదలెడితే, ముందు తరాల వారికి భాషని అందించగలం.

చెద మందు వేళ్ళకి వేస్తే చెట్టు నిలుస్తుంది గానీ, 'మందు వేయాలి' అనే తీర్మానం వల్ల కాదు కదా.

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**డా. ఎ.యం. అయోధ్యారెడ్డి**

చిన్నప్పట్నుంచీ పుస్తకపఠనం అలవాటు పడితే.. పెద్ద చదువులు చదివి, మేధావిగా గుర్తింపబడి జీవితంలో ఎదగుతారని అంటారు. కాలేజీ రోజుల్నుంచి కథలు, కవితలు వ్రాసే అభిరుచి వస్తే, మంచి సాహితీవేత్తగా ఎదిగి.. పెద్ద పేరు, అవార్డులు తెచ్చుకుంటారని అంటారు. అలాగే జర్నలిజం మీద మక్కువ పెరిగితే.. పత్రిక రంగంలో పేరు తెచ్చుకుని, సమాజంలో ఎప్పటికప్పుడు కనబడే, మంచి చెడులను ప్రజలకి అందించగల ఓ శక్తిగా ఎదుగుతారనీ అంటారు. ఈ మూడు లక్షణాలు ఒకరిలోనే ఉంటే.. వారు సాహిత్యరంగంలోనూ, అటు పత్రికా రంగంలోనూ ఉన్నత స్థాయికి చేరిన ప్రముఖుల్లో ఒకరిగా గుర్తింపబడతారు. అలాంటి సాహితీవేత్తలలో ఒకరిగా గుర్తింపబడ్డరు.. తెలుగు పత్రికా సంపాదకులు, నవలా కథా రచయిత డా. ఎ.యం. అయోధ్యారెడ్డి గారు!

ముఖ్యంగా పుస్తకపఠనం వలన లభించే జ్ఞానసంపద, జర్నలిజం వలన వర్తమాన పరిస్థితులు, సమాజ పోకడలు, ప్రజల ఆలోచనలు, స్థితిగతులు.. ఇలా ఎన్నో విషయాల మీద అవగాహన.. కలుగుతాయి. ఈ రెండింటిని కలగలిపిన ఆలోచనలతో కథలు వ్రాస్తే.. అవి సహజత్వానికి దగ్గరగా ఉండడమే కాదు... పాఠకుల కళ్ళ ఎదుట ప్రత్యక్షంగా చిత్ర దర్శనం అవుతుంది. అలాంటి కథల సృష్టి కర్త శ్రీ అయోధ్యారెడ్డి గారని చెప్పాలి. పాఠకులను కట్టి పడేసే కథావస్తువు, సహజసిద్ధమైన శైలి, శిల్పం, కథనం.. తో నడిచే కథలను, నవలలను రచించారు.

వీరి ఐదు దశాబ్దాల సాహితీ ప్రస్థానంలో కేవలం వంద వరకు కథలు, రెండు నవలలు, సాహితీ వ్యాసాలు మాత్రమే వ్రాసారు. అంటే.. ఎంతో విలువైన కథలు, సమాజానికి అవసరమయే విషయాలను మాత్రమే అందించే బాధ్యతతో శ్రీ అయోధ్యారెడ్డి గారు రచనలు చేసారు. రాశి కంటే వాసిని నమ్మే వీరు, కాలేజీలో చదివే రోజుల్నుంచే రచనలు చేయడం ఆరంభించారు.

1974 సంవత్సరంలో వీరి తొలి కథ “మృత్యువులో వ్యత్యాసం” ‘గులాబి’ మాసపత్రికలో వచ్చింది. ఆ తర్వాత వీరి రచనలు దాదాపు అన్ని దిన, వార, మాస పత్రికలలో ప్రచురింపబడ్డాయి. మరో విశిష్టమైన విషయం ఏమిటంటే.. ఏభై దేశాలకు చెందిన ప్రసిద్ధి రచయితల ఉత్తమ కథలను, ఒక ఆఫ్రికన్ నవలను, వీరు తెలుగులోకి అనువదించారు. వీరి రచనలతో మూడు కథా సంపుటాలు, అనువాద కథలతో మరో రెండు సంపుటాలు, రెండు నవలలు, ‘సమకాలీన రాజకీయాలు తెలుగు సాహిత్యం’ అనే వ్యాస గ్రంథం.. ఇప్పటివరకు వెలువడ్డాయి.

శ్రీ అయోధ్యారెడ్డి గారు.. 1955 తెలంగాణ రాష్ట్రములోని సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. రాజకీయ శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చదివి, తర్వాత పిహెచ్.డి. చేసారు. జర్నలిజం పట్ల అభిరుచితో 1983 నుంచి ఆ రంగంలో పనిచేశారు. ‘ఉదయం’ దినపత్రికలో మొదలైన వీరి పాత్రికేయ ప్రస్థానం... మూడున్నర దశాబ్దాల కొనసాగి, ‘దక్కన్ క్రానికల్’ సంస్థలో న్యూస్ ఎడిటర్‌గా పదవి విరమణ చేసారు. సాహిత్య సభల్లో మంచి వక్తగా, వర్తమాన

## విశిష్ట అతిథి

రచయితలకు మెళుకువలు బోధించే మాష్టారుగా పేరు తెచ్చుకున్న శ్రీ అయోధ్యారెడ్డి గారి సాహిత్య ప్రస్థానంలో.. నాగిరెడ్డి చక్రపాణి అవార్డుతో పాటు పలు అవార్డులు, పురస్కారాలు, చాలా కథలకు బహుమతులు అందుకున్నారు.

మా అభ్యర్థనను మన్నించి ఈ సంచికకు విశిష్ఠ అతిథిగా విచ్చేసిన డా. ఎ.యం. అయోధ్యారెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, వారి కలం నుంచి మరిన్ని రచనలు రావాలనీ, రాగలవనీ ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

## కీ.శే. వి.వి.బి. రామారావు

పూర్వకాలంలో బ్రతుకు తెరువుకే కాదు, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కూడా చదువుకునేవారు. ఏదో ఎస్సెస్సెల్సీ చదివి ఉద్యోగం సంపాదించడంతో సరిపెట్టుకోకుండా, ఆ తర్వాత ఉద్యోగం చేసుకుంటూ ప్రైవేటుగా డిగ్రీలు, మాష్టర్ డిగ్రీలు, డాక్టరేట్‌లు చేసేవారు. కొందరు రెండు మూడు సబ్జెక్టులతో డిగ్రీలు, పిజీలు చేసేవారు. వీటికి తోడు సాహిత్యాభిలాష ఉంటే.. ఆ చదువులకు మరింత వన్నె తెచ్చేది. సార్థకత లభించేది. అలా సముపార్జన చేసిన విద్య, విజ్ఞానంతో రచనా వ్యాసంగం చేపట్టి, తెలుగు సాహిత్యాన్ని దశదిశలా వ్యాపింపచేసిన సాహితీవేత్తల్లో ప్రముఖంగా చెప్పుకోదగ్గ రచయిత కీ.శే. వి.వి.బి. రామారావు గారు. పూర్తి పేరు వాడపల్లి విజయభాస్కర రామారావు.

విజయనగరం మహారాజా కాలేజిలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేసిన రామారావుగారు.. డాక్టర్ కాబోయి లెక్చరర్ కాలేదు గానీ, ఆయన డాక్టర్ ఎందుకు చదవలేదో కూడా తెలియదు గానీ.. ఆయన చదువుల్లో డాక్టరేట్ సాధించారు. అంతేకాదు.. ఆయన కథల్లో ఎక్కువగా డాక్టర్లు కనబడతారు. కథనాల్లో వైద్యం కనబడుతుంది. వైద్యులు అంటే ఓ రకమైన మమకారం..రామారావుగారికి ఉందనిపిస్తుంది. ఆయన రచనల్లో ఆధ్యాత్మికత, సాంప్రదాయం కనబడతాయి, ఆధునికత కనబడుతుంది, తన చుట్టూ ఉన్న సమాజం ప్రతిబింబిస్తుంది. మొదటి వాక్యం చదవగానే పాఠకుల్ని ముందుకు నడిపించేయగల శైలి, అలవోకగా వచ్చే వాడుకభాషా పదసంపద..రామారావుగారి కథల్లో కనబడుతుంది. “సులోచనాలు, వెర్రివాళ్ళ స్వర్గం, వీలు, వాన, వర్జ్యం, మధురవాణి, ది లాస్ట్ కేస్...” ఇలా రాసుకుంటూ పోతే వందల్లో ఉన్న రామారావుగారి కథలన్నీ ఆణిముత్యాలే! తెలుగుసాహిత్యానికి, ఆంగ్లసాహిత్యానికి మధ్య వారధిలా పనిచేసిన రామారావుగారు.. ఆంగ్లసాహిత్యంలోని ఆణిముత్యాల్లాంటి కవితలు, కథలు, నవలను తెలుగులోకి.. తెలుగులోని కథలు, కవితలు, నవలలను ఆంగ్లంలోకి అనువాదం చేసారు. కథా సంపుటాలు, అనువాదాలు, నవలలు, వ్యాససంపుటులు.. ఇలా రామారావుగారి రచనలు అరవై, డెబ్బయ్ పైగా పుస్తకాలుగా వచ్చాయి. అస్సామీ, బెంగాలీ, గుజరాతీ వంటి భారతీయ భాషల్లో వచ్చిన పద్నాలుగు నవలను అనువదించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి ‘మాలపల్లి’, కొడవటిగంటి కుటుంబరావు గారి ‘చదువు’ నవలలను రామారావుగారు ఇంగ్లీషులోకి అనువదించారు. టిటిడి వారి కోసం గరుడ పురాణం వంటి పురాణ గ్రంథాల్నీ, విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షంలో సుందరకాండ, దేవీ భాగవతం.. వంటి గ్రంథాలను అనువదించారు! బ్రిటిష్ కౌన్సిల్ నిర్వహించిన కథల పోటీలో ప్రతిభా పురస్కారం అందుకున్న రామారావు గారికి వచ్చిన అవార్డులు, పురస్కారాలు లిస్టుగా రాస్తే రెండు పేజీలు వస్తాయి. ఎంతో ఎత్తుకు ఎదిగినా సరే, సౌమ్యంగా, తన దగ్గర ఎప్పుడో ఏభై సంవత్సరాల క్రిందట చదివిన విద్యార్థులను సైతం జీవితాంతం గుర్తుంచుకుని పలకరించేవారు. 1998 లో రిటైర్ అయిన తర్వాత తన పిల్లలతో పాటు ఇతర రాష్ట్రాలలో జీవనం సాగించినా, సాహిత్య ప్రక్రియలను వదలలేదు. నిరంతరం చేతిలో పుస్తకమూ, కలమూ ఉండేవి. మాట్లాడితే.. ఎన్నో విజ్ఞాన విషయాలను అలవోకగా ప్రస్తావించేవారు.

## కథా మార్గదర్శి

జనవరి ఒకటి 1938లో పార్వతీపురంలో జన్మించిన రామారావుగారు హైస్కూల్ విద్య వరకు అక్కడే చదివి, తర్వాత విజయనగరం మహారాజ కాలేజీలో బిఏ చదివి, అక్కడే తెలుగు ట్యూటర్‌గా చేరారు. తర్వాత ప్రైవేటుగా బిఏ (ఇంగ్లీషు), ఎమ్.ఏ. చేసి, పిహెచ్‌డి పట్టా కూడా ఆంధ్ర యూనివర్శిటీ నుంచి అందుకున్నారు. దేశవిదేశాల్లో ఎన్నో యూనివర్శిటీలకు, ఇనిస్టిట్యూట్‌లకు గెస్ట్ లెక్చరర్‌గా వెళ్ళేవారు. 'ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆథర్స్' కార్యవర్గ సభ్యుడిగా కూడా కొంతకాలం సేవలు అందించారు.

తెలుగుసాహిత్యంలో కథ, నవల, వ్యాసం, అనువాదం వంటి ప్రక్రియలలో, తరతరాలు నిలిచిపోయే తెలుగు సాహితీ సంపదను సృష్టించి, అందించిన డా. వాడపల్లి విజయభాస్కర రామారావు గారు.. ఇటీవలే.. ఫిబ్రవరి ఒకటో తేదిన నోయిడా (ఉత్తర ప్రదేశ్) లో కనుమూసారు. వారి దివ్య స్మృతికి అంజలి ఘటిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా పరిచయం

## శ్రీ మధు పెమ్మరాజు గారి కథ 'ఇనుప తెర'

మధు పెమ్మరాజు గారు రాసిన ఒక పదహారు కథలు ఈ మధ్యనే 'దోరేదార్' అనే కథా సంపుటంగా వెలువడ్డాయి. ఆయన కథలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డప్పుడు అప్పుడప్పుడూ చదువుతూనే ఉన్నాను. అయితే ఒక సంకలనంగా వెలువడినప్పుడు ఆ కథాహారం మధ్యలోని రచయిత అనే దారం గురించి కూడా మనకు తెలుస్తుంది. అందుకే నాకు సంకలనంగా వచ్చిన ఒకే రచయిత కథలు చదవడం ఇష్టం. ఒక రచయితగా మధు గారు గత పది పదిహేను సంవత్సరాల బట్టి రాస్తున్నారు. అయితే ఆయన రాసిన కథలు బహుశా ఇరవైకి దగ్గరలో ఉంటాయేమో, అంతే! ఆయన మాటల్లోనే, "రాసిన కొన్ని కథలు అంత సమయం పట్టలేదు, కొన్ని సంవత్సరాలు పట్టాయి". ఆయన కథలకు స్ఫూర్తినిచ్చే రెండు విషయాలు – "బోసిగా ఉన్న ఆకాశం కనిపిస్తే రంగుల బాల్యం, పక్క క్యూబులోని సహోద్యోగి కనిపించడం మానేస్తే దిగులు". ఆయన వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తూండడం ఒక కారణమవచ్చు! ఆయన అమెరికాలోని హ్యూస్టన్ సమీపంలోని కేటీ నగర నివాసి. తల్లావజ్ఝల పతంజలిశాస్త్రిగారు ఈ రచయిత గురించి రాస్తూ "సృజనకారుడైన కథకుడి దృక్పథం అతని కథల్లో కనిపిస్తుంది" అని అంటారు.

నాకు నచ్చిన కొన్ని కథల్లో ఒకటి 'ఇనుప తెర'. ఎన్నారై జీవితాలు దూరం నుంచి చూసినప్పుడు ఊహించుకునేంత అందమైనవి కావు. లాప్టాప్ పట్టుకుని తమ, తమ కుటుంబ ఇష్టా, అయిష్టాలతో ప్రమేయం లేకుండా ఊళ్ళు తిరుగుతూ, రాత్రింబవళ్ళు పని చేయాల్సి వస్తూ కూడా, ఉద్యోగాలు ఎప్పుడు వూడుతాయో, ఎప్పుడు తాత్కాలికంగానే అయిపోతాయో, ఎప్పుడు విసుగుతో తామే వదిలేయాల్సివస్తుందో తెలియని పరిస్థితి. వృత్తిలో తను చూసిన ప్రపంచాన్ని ఆధారంగా రచయిత రాసిన మంచి కథ ఈ 'ఇనుప తెర'. కథ ఉత్తమ పురుషలో నడుస్తుంది.

శశాంక్ తన కుటుంబంతో ఉండేది అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో. ఇప్పుడు ఉద్యోగానికి ఒప్పుకుంది కెనడాలోని సాస్కటూన్ అనే ఊళ్ళో. విమానంలో వెళ్ళినా ఒక పన్నెండు గంటల ప్రయాణం! మధ్యలో డెన్వర్‌లో విమానం మారాలి. ఈ ఉద్యోగంలో చేరడం భార్య రాధికకి అస్సలు ఇష్టం లేదు. అయినా తప్పనిసరై, ఒక ప్రాజెక్టు ఎంత కష్టమైనా చేయగలనని, ప్రాజెక్ట్ మేనేజరుగా తన క్రిందవాళ్ళ చేత పనిచేయించి కంపెనీ నిర్ణయించిన అతి తక్కువ సమయంలో ప్రాజెక్టు పూర్తి చేయగలననీ చెప్పి సంపాదించిన ఉద్యోగం! ఇంకో ఆఫర్ రాలేదు మరి!

ఇంటినుంచి తెల్లవారురుఝామున మూడున్నరకు లేచి బయల్దేరాడు శశాంక్. డెన్వర్ చేరాక తెలిసింది తన కనెక్టింగ్ ఫ్లైట్ అనుకోకుండా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఆలస్యమనిందని! ఎంత ఆలస్యమో తెలీదు. తరవాతి ఫ్లైట్ ఎప్పుడు ఉంటుందో తెలీదు. రాధీకి చెప్పాలని చూస్తే సెల్ఫోన్ చార్జి అయిపోయింది. పక్కనే ఉన్న మేరీ అనే ఆమెను చార్జర్ అడిగి

తీసుకుని, భార్యతో మాట్లాడతాడు. మాటల్లో మేరీ కూడా తన ప్రాజెక్ట్‌లోనే చేరుతోందని, అందుకే తను కూడా సాస్కటూన్ వెళ్తోందని తెలుస్తుంది. ఆమె తన దగ్గరే పని చేయబోతోంది.

మూడు నెలలు గడిచాయి. ప్రాజెక్ట్ అయిపోబోతోంది. గడచిన సమయమంతా 'కాన్ఫరెన్స్ రూం లైట్ల కింద దీపపు పురుగులా' గడిపాడు తన మాటల్లో. అనుకున్న దానికంటే పది రెట్లయింది పని. డిజైన్ ముగిసి వారం అయింది, ప్రోటోటైప్ సిస్టమ్ మేరీ పూర్తి చెయ్యాల్సి ఉంది. ఆమె నుంచి సమాచారం లేదు. ఫోన్ కాల్ ఎత్తదు. బాధ్యత తనది. డైరెక్టరు అర్జెంట్ మీటింగ్ పెట్టి మందలించాడు. అవసరమనుకుంటే మేరీని ఫైర్ చేసి, ఇంకెవరితోనైనా పని పూర్తి చేయించమని డైరెక్టర్ ఆదేశం. ఆయన మాటల్లో అలా పని చెయ్యని, చేయలేని వాళ్ళని "జస్ట్ త్రో దెం!". ఆయన మాటలు నచ్చడం లేదు. శశాంక్ సర్ది చెప్పాడు.. తను మేరీని కాంటాక్ట్ చేసి ఎలాగైనా చివరి డెలివరబుల్ చేయిస్తానని!

ఆరోజు ఆమె కెఫీటీరియాలో ఒక మూల కూర్చుని కనబడింది. ఆమె చెప్పే మాట వినకుండా వ్యంగ్యంగా వ్యక్తిగత సమస్యలందరికీ ఉంటాయనీ, ఆమె వల్ల పని ఆగిపోయిందని కంప్లైంట్లు వస్తున్నాయనీ, జాక్ కొత్త కన్సల్టెంటుని తెచ్చుకోమని చెప్తున్నా, తను మాత్రం ఆమెను కాపాడడానికి ప్రయత్నిస్తున్నానని చెప్తాడు. ఆమె డెలివరబుల్ ఇవ్వలేకపోవడానికి తను కారణం కాదని, డాటా బేస్ ఇష్యూలు ఉన్నాయని చెప్పినా వినడు.

తనెంత ఒత్తిడిలో ఉన్నాడో ఆమెకేం తెలుసు? ఆ వీకెండ్‌లో ఇంటికొచ్చినా, ఇంట్లో సేద తీర్చుకునే సమయం లేదు. కొడుకు వచ్చి కాసేపు తనతో ఆడమని అడిగితే గట్టిగా అరిచి విసుక్కున్నాడు. ఆ అబ్బాయి ఏడుస్తూ వాళ్ళ అమ్మ దగ్గరికెళ్ళిపోయాడు. ఆ ఏడుపు విని, తన చేసిన పని తెలిసొచ్చింది. ఈ ప్రాజెక్టు తన పర్సనాలిటీనే మార్చేస్తోంది. తన బాధ చెప్పుకున్నాడు భార్యకి. తను కొత్త కన్సల్టెంటుని తీసుకొచ్చి, పని చేయించే సమయం లేదిప్పుడు.

మేరీ ఆఫీసుకు రాలేదు. జాక్ ప్రతి గంటకి వచ్చి గుర్తుచేస్తున్నాడు. గో, నోగో నిర్ణయించే స్టీరింగ్ కమిటీ మీటింగు ఇంకో గంటలో ఉంది. "వుయ్ నీడ్ దట్ డామ్ డాక్యుమెంట్" అని చెప్పి మరీ వెళ్ళాడు. కోపంతో తను మేరీకి మెసేజ్ చెయ్యడం మొదలుపెట్టాడు. మెసేజ్ పూర్తి కాలేదు, అంతలో చాట్ మెసెంజర్‌లో మేరీ ప్రత్యక్షమైంది. గొంతు చించుకు అరవాలనిపించింది. అయినా సహనంతో పలకరించాడు. శశాంక్‌కి సారీ చెప్తూ, తనింక సాస్కటూన్ రాలేనని, అంతకు ముందు రాత్రి తన భర్త జాన్ హాస్పిటలైజ్ అయ్యాడని, ఆయన కాన్సర్ చివరి స్టేజెస్‌లో ఉన్నాడని! తన కళ్ళ ముందు చిక్కి శల్యమైన ఆమె భర్త, బాధని దిగమింగుకుని, పిల్లల్ని ఓదారుస్తున్న భార్య కనిపించారు శశాంక్‌కి. తనకి చివరి డెలివరబుల్ అయిన మైగ్రేషన్ స్కెడ్యూల్ అంతకు ముందు పంపలేకపోయిందని, ఇప్పుడే ఈమెయిలులో పంపిందని చెప్తుంది. పరిస్థితులు అనుకూలంగా లేక ఇన్సూరెన్సు కోసం తప్పని పరిస్థితుల్లో ఈ ప్రాజెక్ట్‌లో చేరానని, పిల్లలకి, రోజూ భర్తకి, ధైర్యం చెప్పాల్సి వస్తూ సక్రమంగా కమ్యూనికేట్ చెయ్యలేకపోయానని అంటుంది.

అవును, మేరీ ఎన్నోసార్లు ఏదో చెప్పడానికి ప్రయత్నించింది. తను అవకాశం ఇవ్వలేదు. తన దృష్టి అల్లా.. లక్ష్యం చేరుకోవడమే! వినడానికి సమయమేదీ? తను "తోటి మనిషిని అవసరపు అంచుల్లోంచి తప్ప రక్త, మాంసాలతో చూడనివ్వని వినియోగదారుల వ్యవస్థ, ఆ వ్యవస్థకి కేంద్ర బిందువుగా మారాను" అని చెప్పాలనుకున్నాడు. మేరీకి క్షమాపణ చెప్పుకున్నాడు.

## కథా పరిచయం

మైగ్రేషన్ డాక్యుమెంట్లన్నిటికీ ప్రింట్లు తీసి డైరెక్టరు ముందు పెట్టాడు. ఇది తన ఫైనల్ డెలివరబుల్ అని, "పీపుల్ ఆర్ మోర్ దేన్ రిసోర్సెస్" అని చెప్పి, జాక్ అంటున్న మాటల్ని పెడచెవిన పెట్టి శశాంక్ కదిలిపోయాడు.

కథలో చివరి మాటలు "ఇనుపతెర వెనుక దాగుడు మూతలు నాకు సరిపడవు, పనిని రాబట్టే యంత్రంలా కాదు.. మనిషిగా మిగలాలని ఉంది. అందుకే నడుస్తున్నాను. నా దారి నేనే సృష్టించుకుందుకు నడుస్తున్నాను..." శశాంక్ తను సృష్టించుకోబోయే స్వేచ్ఛా జీవితానికి ఒక అడుగు ముందుకు వేశాడు.

జీవితం, వ్యవస్థా అతన్ని గెలవనిస్తాయా? ఎవరికి తెలుసు? పుస్తకంలోని కొన్ని కథల చివర్లో ఈ లిబరేషన్ కనిపిస్తుంది. ఈ కథలోనూ, మిగతా అన్ని కథలలోనూ రచయిత ఎంచుకున్న కథ చెప్పే విధానంవల్ల ఆ కథలు మనసుకి హత్తుకుపోతాయి.

కథ మధ్యలో రచయిత మాటలు చూడండి. సాస్కటూన్ వెళ్లడానికి తెల్లవారుఝామున మూడున్నరకు లేస్తూ, "కలత నిద్రకి మ్రోతల (అలారం) అవసరం లేదు. రాత్రంతా నాలో నేను తగువు పడుతూనే ఉన్నాను, అస్థిరత్వపు నీడల వెనుక బలవంతపు నడకని ద్వేషిస్తూనే ఉన్నాను. నడుస్తూనే ఉన్నాను." అలాగే, "చీకటి గుహ అలవాటైన ప్రాణానికి వెలుతురు వింతగా, భయంగా ఉంటుంది." ఇంకో చోట మేరీ తన భర్త గురించి చెప్పినప్పుడు "అవి మాటలైతే మరో మారు అడిగేవాడిని కానీ అవి అక్షరాలు, స్పష్టమైన అక్షరాలు, ఎన్నిసార్లు చదివినా మారని అక్షరాలు."

ఇవి పాఠకుడి మనసుల్లో రచయిత వేసే ముద్రలు. కథ ఒకసారి చదివి, ఈ వాక్యాల కోసం మళ్ళీ మళ్ళీ వెనక్కి వెళ్ళి చదవాలనిపించే అక్షరాలవి!

ఈ కథతో పాటు ఎన్నో మంచి కథలున్న పుస్తకం, 'డోరేదార్'. దొరికితే తప్పక చదవండి.

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*



# వినదగునెవ్వరు చెప్పిన ..

స్విట్జర్లాండ్ మరియు ఇటలీ సరిహద్దుల్లో ఉన్న సూర్యుని చలువతో, బంగారు కొండలా మెరిసిపోతున్న మ్యాటర్ హార్న్ పర్వతాన్ని ముఖచిత్రంగా అలంకరించుకొని మార్చి 2026 కథామంజరి సంచిక వెలువడింది. ఆరు సమకాలీన కథలు, విశిష్ట అతిథిగా విచ్చేసిన జలంధర గారి నిర్మోహ దర్పణం, మాడపాటి వారి మురికి కాలువ – మనిషి మనసు కథలతో పాటు, మరో రెండు బాలల కథలు మొత్తం 10 కథలతో పాఠకుల చేతిలోకి డిజిటల్ బుక్‌గా వచ్చింది. వీటికి సాయి రాచకొండ చేసిన వివిబి రామారావుగారి 'ద లాస్ట్ కేస్ ' కథా పరిచయం అదనం!

పివిఆర్ శివకుమార్ గారి కథ 'లేమిని మించని పాపం'. ఒక మనిషి సంసారంలో దారిద్ర్యం చేసిన వికటాట్టహాసాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిన కథ. దారిలో వెళుతూ దశదిన కర్మ పోస్టర్ చూసి, చనిపోయిన వ్యక్తిని తన స్నేహితుడిగా చెప్పుకొని, వారి ఇంటికి వెళతాడు దిశాపతి. దశదిన కర్మల అనంతరం భోజనాల వడ్డింపు అయిన తర్వాత ఆ భోజనాన్ని అడిగి పొట్లం కట్టించుకుని ఇంటికి వెళతాడు. భార్య చేతికి ఆ సంచి ఇచ్చిన తర్వాత జరిగిన సంభాషణ పాఠకుల గుండెల్లో సూటిగా గుచ్చుకుంటుంది. చదివి తీరాల్సిన కథ.

తులసి బాలకృష్ణగారు రాసిన కథ 'నిరసన'. ఒక చిన్న అంశాన్ని సామాజిక సమస్యకు ముడి పెట్టి రాసిన కథ. ప్రాప్తకాలజ్ఞత కలిగినటువంటి కథాంశము.

భార్య సెన్సార్ మెంబర్‌గా ఉన్న బృందము ఒక సినిమాకు అనుమతి ఇస్తుంది. కానీ ఆ సినిమా అభ్యంతరకర దృశ్యాలతో ఉండడము, ఇబ్బందికరంగా ఉండడం భర్త మనసును బాధపెడుతుంది. దానికి అనుమతి ఇచ్చినందుకు భార్యకు నిరసన చెబుతూ, దానిని వారిద్దరి విడాకుల స్థాయికి తీసుకువెళతాడు భర్త. కథాంశం బాగున్నప్పటికీ.. ఇంకాస్త పకడ్బందీగా కథ అల్లుకోవాల్సింది అనిపిస్తుంది.

అంగర శ్రీనివాస రవిశేఖర్ గారి కథ ' ఇంతకీ....'. రెండు తరాల మహిళల ఆలోచనలలో ఉండే అంతరాన్ని రికార్డు చేసిన కథ. సంసారం కోసం తన కెరీర్ త్యాగం చేసిన తల్లిని కూతురు తప్పుపడుతుంది. అదే తప్పు తను చేయలేనంటుంది. అందుకు ప్రత్యుత్తరంగా తల్లి చెప్పిన మాటలు ఇప్పటి జెన్ జీ తరానికి చెందిన ప్రతి ఒక్కరికి శ్రవణ గ్రాహ్యమే.

తేజశ్రీ గారి 'బంగారు కిరీటం' వెంకటకృష్ణ రావు గారి 'జ్ఞానం పంచుకోవాలి' పిల్లల కథలు కూడా బాగున్నాయి. ఇవాళ రేపు పత్రికల్లో వస్తున్న పిల్లల కథలతో పోలిస్తే మంచి స్థాయి కలిగిన కథలు. ఇలా పిల్లల కథలపై ప్రత్యేక దృష్టి పెట్టిన సంపాదకులకు అభినందనలు.

'రాంబో'

ఈ మధ్య కాలంలో మీ కథల ప్రమాణాలు దిగజారిపోయినట్లుగా అనిపించి, మీ సంచిక చదవడం మానేసాను. క్లుప్తత, స్థానంలో ఊకదంపుడు సంభాషణలతో సాగదీసినట్లుగా ఉన్న కథలను చూసి, విరక్తి చెందాను. పెద్దిభొట్ల, మధురాంతకం, నా అభిమాన రచయితలు. కానీ ఈ మార్చి 2026 సంచికలో కథలన్నీ ఏకబిగిన చదివించాయి. హనుమంతరావుగారి కథా సంవిధానం బాగుంది. కథావస్తువు మురికి మనసులను, మురికి కాలువతో సామ్యం, నేటి సమాజపు తీరును చక్కగా ఆవిష్కరించారు. అలాగే లాస్ట్ కేసు కథ ఆనాటి వైద్యుల ఉన్నత విలువలను ప్రతిబింబించింది. శివకుమార్‌గారి "లేమిని మించని పాపం" మరొకటి లేదనిపించింది. కథను నడిపించిన తీరు బాగుంది. బాలకృష్ణగారి కథ నేడు అవసరమైన మార్పుని స్పష్టంగా తెలియజేసింది. జీ(వి)తం కథ నేటి కొంతమంది యువతుల అపరిపక్వతను వెలికిదీసింది. శ్రీమతి జలంధరగారి "నిర్మోహదర్పణం" కథ భాషలో, భావనలో నేటి పరిస్థితులలో ఇమడలేని రచయితలు కమ్ జర్నలిస్టుల మనోస్థితిని అద్భుతంగా ఆవిష్కరించి, పాత రోత కాదని నిరూపించారు. సూరంపూడి వారి చిత్రాలు పత్రికను మరింత అందంగా చేసాయి.

**వి. రామలింగేశ్వరరావు**

*కొందరు పాఠకులు ఆహ్లాదం కోసం కథలు చదువుతారు. కొందరు అలవాటుగా చదువుతారు. ఇంకొందరు.. చదివే కథల్లో అన్నీ అంశాలను కూలంకషంగా పరిశీలించి చదువుతారు. ఇలా రకరకాల పాఠకులు కథలు చదివినా.. చదివిన కథలో తప్పొప్పులు (అక్షరదోషాలు కావు) లేదా తమకి నచ్చినవి, నచ్చనవి విషయాల గురించి వారికి వారే ఆలోచనల్లో పడిపోతారు కానీ, బయటకు వ్యక్తీకరించరు. అయితే.. ఇలా వచ్చిన ఆలోచనలని అక్షర రూపంలో మాకు తెలియచేస్తే, మా ద్వారా ఇతర పాఠకులకు చేరుతుంది. అలాగే ఆయా రచయితలకు.. వారు రాసే కథల మీద వచ్చే అభిప్రాయాలతో..మంచి చెడులను గ్రహించి, తదనుగుణంగా భవిష్యతులో కథలు వ్రాయడానికి ఉపయోగపడతాయి. ఓ రకంగా.. అలాంటి విశ్లేషణలు రచయితలకి పాఠంలా పనిచేసి, మంచి రచనలు చేయడానికి దోహదపడతాయి. ఈ ఆలోచనతోనే.. ఈ శీర్షికని ఆరంభించాం! మేం కోరుకునేది ఒక్కటే.. కథల మీద.. మీ మీ అభిప్రాయాలను నిక్కచ్చిగా వ్రాసి, మాకు పంపండి. అటు రచయితకి.. ఇటు కథామంజరికి మంచి రచనలు అందించడానికి అవకాశం ఇచ్చినవారు అవుతారు.*

**సంపాదకుడు**

# లవ్ అండ్ హేట్

కర్లపాలెం హనుమంతరావు
✆ 8142283676

*బెడ్ మీద డీలాగా పడుకొని కనిపించాడు ఆ బాబు. సుమారు పన్నెండు పదమూడేళ్ళుంటాయేమో!*

*మేం గదిలోకి వెళ్ళినా ఎలాంటి రియాక్షనూ లేదు ఆ అబ్బాయిలో! చూపు ఒక చోట స్థిరంగా నిలవటం లేదు. పిల్లాడు పీలగా పాలిపోయి ఉన్నాడు. మెంటల్లీ డిజార్డర్డ్ అని తెలుస్తూనే ఉంది!*

*కాళ్ళూ చేతులూ చొప్ప కట్టెల్లా ఉన్న ఆ పిల్లవాడిని ఆదరంగా ఒళ్ళోకి తీసుకొని తల నిమురుతూ "వీడి ఖర్మకు తోడు తల్లి కూడా లేకుండా పోయింది" అన్నాడు మాష్టారు.*

ఐ హేట్ హర్!

యస్! పెళ్ళయిన ఏడాదికి నీళ్ళోసుకోబోతున్న కామేశ్వరి అంటే నాకు అసహ్యం. అందుకు కారణం... ఆమె రహస్యంగా తన బీరువాలో దాచుకొన్న లేఖల కట్ట.. వారం కిందట నా కంటపడ్డం! ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా ఏళ్ళ తరబడి సాగిన ధారావాహిక... గాఢ ప్రేమగాథకు అవి ప్రతిరూపం!

"పెళ్ళికి ముందే నీ పెళ్ళాం ఊళ్ళు పట్టుకు వూరేగిందని విన్నానురా! ఆ వాలకం అదీ చూస్తే నిజమే అనిపిస్తుంది! నిప్పు లేనిదే పొగ రాదు కదా!" అని అమ్మ అస్తమానం గునుస్తున్నది ఈమధ్య.

ఏ ఆధారం లేకుండా కోరి తెచ్చుకొన్న కోడలు మీద అంతలేసి అభాండాలు ఎందుకు వేస్తుంది?

కట్నానికి కక్కుర్తి పడి, తల్లి ఒత్తిడి మీద తలాడించి కామేశ్వరి మెడలో తాళి కట్టినవాడిని! నా వైపు నుంచీ కొంత తప్పున్న మాట నిజమే! కానీ చూస్తూ చూస్తూ పరాయివాడి ప్రేమలో తడిసిన భార్యను అభిమానం గల ఏ మగాడైనా ఎలా ఆదరిస్తాడు?

క్రమంగా కామేశ్వరికి విడాకులు ఇవ్వాలనే నిశ్చయానికి వచ్చేశాను. కాని ముఖం మీదే... ఆ ముక్క చెప్పేందుకు జంకుగా ఉంది. కామేశ్వరి నైజం నాకు బాగా తెలుసు. తను ఒళ్ళు మండి ఏ పోలీసు కంప్లయింటో ఇచ్చేస్తే... గృహహింస చట్టం కింద నాకూ, మంచాన పడి ఉన్న మా అమ్మకూ శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు. కోర్టూ, జైళ్ళ మాట అట్లా వుంచి, ముందు ఇంత బువ్వ పెట్టే ఉద్యోగానికి ఉద్వాసన అవుతుంది. ఆమె ఏ భరణానికో దావా వేసినా, నా బతుకు బస్టాండ్ కావటం ఖాయం. పరువుకు భయపడి కొంతా, విడాకుల పరిణామాలకు జంకి కొంతా... వెనక్కు తగ్గాల్సిన దుస్థితి వచ్చి పడింది.




పరిస్థితి ఎంత దుర్భరంగా ఉన్నా, సంసారం చెయ్యటానికి మాత్రం మనసు మొరాయించింది. ఆమెను చూడగానే ఒళ్ళు కంపరమేస్తుంది. ఈమధ్య మరీను! ఏదో వంకతో తనను పుట్టింటికి పంపిస్తేనే నాకు మనశ్శాంతి!

నా తలరాత బాగుండి, ఆ తంటాల నుంచి నన్ను తప్పిస్తూ, దేవుడే ఆమెని పుట్టింటికి పంపించే ఏర్పాటు చేసాడు.

కామేశ్వరి తండ్రి బాత్రూంలో కాలు జారి, తుంటి విరగడంతో పితృసేవకని ఈమెగారు పుట్టింటికి బైలుదేరింది. తొందరగా వచ్చేయమని నేను అడగలేదు, వచ్చేస్తానని తనూ అనలేదు.

ఎనిమిదో పదిలో ఉన్న ఆమె తండ్రి ఆరోగ్యం ఒకంతట కుదుట పడకపోగా, గుండెపోటుతో సరాసరి పైకెళ్ళిపోయాడు, ఈమె వెళ్ళిన రెండు వారాలకు! విధాయకంగా వెళ్ళి చూసి వెంటనే తిరిగొచ్చేసాను.

"తల్లిలేని కొంప. పెళ్ళికి ఎదిగిన ఇద్దరు చెల్లెళ్ళు! ఇంటి బాధ్యత అంతా నా నెత్తి మీదే ఉంది ప్రస్తుతం. కొద్ది రోజులు పడుతుంది రావటానికి" అంది కామేశ్వరి. నాకూ గొప్ప రిలీఫ్ అనిపించింది. నిజం చెప్పద్దూ, వెంటనే ఒప్పేసుకున్నా! ఈలోపు పర్మినెంట్‌గా విడిపోవటానికి సొల్యూషనేమన్నా వెతకాలని నా ఆలోచన!

మూడునెలల తర్వాత కామేశ్వరి మగబిడ్డని ప్రసవించిందని తెలిసింది. కాని చూడ్డానికి రమ్మని మాటవరసకైనా నాకు పిలుపు రాలేదు! పిల్చినా నేను వెళ్ళదలుచుకోలేదు.

రెండు నెలల తరువాత మా అమ్మ పోతే చూట్టానికి వచ్చిందీమె. ఒక్కర్తే! చంకలో బిడ్డలేదు!

పోతూ పోతూ నాతో అందామె, "మీకులాగే నాకూ ఇబ్బందిగా ఉందిక్కడ. ఇంతకాలం మీ అమ్మగారి కోసం ఉగ్గబట్టుకొనున్నా! నా ఇష్టం లేకుండా జరిగిందీ పెళ్ళి! మా పాల్ మాష్టారు చేసుకుందామనుకున్నారు నన్ను. క్రిస్టియనని పడనిచ్చారు కాదు ఇంట్లో! ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసారు. నా చెల్లెళ్ళను చూసి తలొంచుకుని తాళి కట్టించుకోవలసొచ్చింది. ఇప్పుడు మా పేరెంట్సూ లేరు, మీ అమ్మగారూ లేరు. మీరు విడిగా వెళ్ళిపోయినా నాకేమీ అభ్యంతరం లేదు. డివోర్స్ పేపర్స్ పంపిస్తే సంతకాలు చేసిస్తా!"

నా వరకు గొప్ప రిలీఫ్ అనిపించింది. ఆమె అన్నదాకా, నాకూ మరో పెళ్ళి ఆలోచన రానేలేదు ఆశ్చర్యంగా!

ఆ తరువాత కర్ణాకర్ణిగా తెలిసింది.. కామేశ్వరీ, ఆ పాల్ మాష్టారూ ఇప్పుడు కలిసే ఉంటున్నారని, కామేశ్వరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు ఆ పెద్దమనిషే పూనుకొని చేయించాడని!

నేనూ మరో పెళ్ళి చేసుకొని, ఆ లంపటంలో పడ్డాక, కామేశ్యరి నా ఆలోచనల్నించి పూర్తిగా కనుమరుగై పోయింది.

★★★

పదేళ్ళు గడిచాయి. తిరుపతి ట్రాన్స్ఫర్ అయింది నాకు.

మా అమ్మాయి లిఖిత స్కూలు అడ్మిషన్ కోసం పేరున్న జార్జి గ్రామర్ హైస్కూల్లో ట్రై చేస్తున్నా. స్కూలు చుట్టూ తిరగటమే కానీ, ప్రయోజనం కనిపించటంలా!

అడ్మిషన్లు క్లోజవుతున్నాయని తెలిసి, నేరుగా స్కూలు కరస్పాండెటునే కలవాలని వెళ్ళానీసారి! అక్కడా నాలాగే ఆశావహులు చాంతాడంత మంది తచ్చాడుతున్నారు కారిడార్లో!

ఇంతలో ఒకాయన, సుమారుగా నా ఈడే ఉండొచ్చు... నా దగ్గరికొచ్చి పలకరించాడు, చిరునవ్వుతో! నా పక్కనే ఉన్న లిఖితను చూసి "బేబీ అడ్మిషన్ కోసం వచ్చారా?" అనడిగాడు.

అంతకు ముందు ఆయన్ను ఎక్కడా చూసినట్లు గుర్తుకు రాలేదు. పరిచయంలేని వ్యక్తి. అయినా అలా కలుపుగోలుగా మాట్లాడేసరికి, కడుపులోని బాధనంతా వెళ్ళగక్కా. మధ్య మధ్య స్కూలు వాళ్ళను శాపనార్థాలు పెడుతూ!

ఆయన అక్కడే పని చేస్తున్నాట్ట! నేను చెప్పిందంతా ఓపిగ్గా విని, “రండి! మాట్లాడదాం” అంటూ నేరుగా కరస్పాండెంట్ ఛాంబర్‌లోకి తీసుకెళ్ళాడు.

వారం బట్టి తిరుగుతున్నా అవని పని, మూడే మూడు నిమిషాల్లో ఫటాఫట్ అయిపోయింది! అంతా ఆ పెద్దమనిషి మహిమ!

“మీకు థేంక్స్ ఎలా చెప్పాలో తెలీటంలేదు మాష్టారూ! ఒక్కసారి మా ఇంటికి రండి, మీ ఫ్యామిలీతో కలిసి!” అన్నాను ఆనందంగా.

“ష్యూర్! అయితే ముందు మీరు, మా ఇంటికి రావాలి” అన్నాడాయనా నవ్వుతూ.

ఆ ఆదివారం సాయంత్రం, ఆయనిచ్చిన అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాను.

ఇంట్లో ఒక్కడే ఉన్నట్లున్నాడు. నా రాకను గమనించి గదిలో నుంచి బైటికొచ్చాడు.

పనమ్మాయి కాఫీ తెచ్చిచ్చింది. కాఫీ తాగుతూ మాటల మధ్యలో “పిల్లలెంతమంది సార్?” అనడిగాను మాష్టార్ని.

ప్రశ్న ఒక్కటే కాని, అందులో చాలా సందేహాలకు సమాధానాలు దొరుకుతాయి. ‘మీ శ్రీమతిగారు కనిపించరేం?’ అని నేరుగా అడగటం మర్యాద కాదు గదా!

ఆయనకు విషయం అర్థం అయింది. “ఒక్కడే బాబు! చూపిస్తా రండి!” అంటూ పక్క గదిలోకి తీసుకెళ్ళాడు.

బెడ్ మీద డీలాగా పడుకొని కనిపించాడు ఆ బాబు. సుమారు పన్నెండు పదమూడేళ్ళుంటాయేమో!

మేం గదిలోకి వెళ్ళినా ఎలాంటి రియాక్షనూ లేదు ఆ అబ్బాయిలో! చూపు ఒక చోట స్థిరంగా నిలవటం లేదు. పిల్లాడు పీలగా పాలిపోయి ఉన్నాడు. మెంటల్లీ డిజార్డర్డ్ అని తెలుస్తూనే ఉంది!

కాళ్ళూచేతులూ చొప్పకట్టెల్లా ఉన్న ఆ పిల్లవాడిని ఆదరంగా ఒళ్ళోకి తీసుకొని తల నిమురుతూ “వీడి ఖర్మకు తోడు తల్లి కూడా లేకుండా పోయింది” అన్నాడు మాష్టారు.

ఆ గొంతులోని జీరే తెలుపుతుంది ఆయన ఎంతటి ఆవేదనని గుండెల్లో అదిమిపెట్టుకొని ఉన్నాడో...

ఎలా స్పందించాలో తెలీలేదు నాకా క్షణంలో... “సారీ మాష్టారూ!” అన్నాను.

“ఇట్సాల్ రైట్ శంకర్ గారూ!” చెదిరిన చిరునవ్వును తిరిగి పెదాల మీదకు తెచ్చుకుంటూ అన్నాడు ఆయన. “వీడి తల్లి ప్రెగ్నెంటుగా ఉన్న టైములో, మానసికంగా పడ్డ వేదనకు ఇదీ ఫలితం! కోవిడ్ కారణంగా ఆమె పైకి వెళ్ళిపోయింది. చేయని నేరానికి వీడు ఇక్కడ శిక్ష అనుభవిస్తున్నాడు, ఇలా!” అన్నాడు పక్కనే టేబుల్ మీద ఉన్న ఫోటో వంక చూపించి!

ఫోటోలో కామేశ్వరి! పక్కన ఈయన... అంటే, పాల్ మాష్టారు!!

షాక్‌లో ఉన్న నా వంక చూసి అన్నాడు "యస్ మిష్టర్ శంకర్! మీరు చూస్తున్నది నిజమే! మీరు కాదని, దూరం పెట్టిన తరువాతే కామేశ్వరి మిసెస్ జార్జ్ పాల్‌గా మారింది! అదీ నా బలవంతం మీద! తండ్రెవరు? అని సమాజం నిలదీస్తే, ధైర్యంగా సమాధానం ఇచ్చేందుకే నా ప్రపోజల్ ఓకే చేసింది. కాలేజీ రోజుల్లో మేం ఒకర్ని ఒకరు ఇష్టపడ్డ మాట నిజమే! కాని, మీరు అనుమానించినట్లు మా మధ్య ఏమీ జరగలేదు. అప్పట్లో మీరు చీదరించుకున్నది కామేశ్వరి కడుపులో ఉన్న ఈ బిడ్డనే! మీ బిడ్డను! పోతూ పోతూ తను వీడి బాధ్యత నాకు అప్పగించింది. నేనూ సంతోషంగా స్వీకరించా! బికాజ్ ఐ లవ్ హర్ ఫరెవర్!" అన్నాడు పాల్ మాష్టారు, బాబును మరింత గాఢంగా హృదయానికి హత్తుకొని!

ఆధారం లేని అనుమానంతో, కట్టుకున్న భార్యను చిత్రహింసలు పెట్టే నాలాంటి శాడిస్టులు అడుగడుగునా కనిపించే రోజుల్లో... ఈ మాష్టారులాంటి నిస్వార్థ ప్రేమికులు ఉండటం నిజంగా అబ్బురమే!

బాబును గురించి ఆలోచనలో పడ్డ నన్ను చూసి చిర్నవ్వుతో అన్నాడు పాల్ మాష్టారు, "డోంట్ వరీ మిష్టర్ శంకర్! వీడు ఇప్పటికీ నాబిడ్డే! కామేశ్వరి నాకిచ్చిన కానుకను వదులుకొనే ప్రశ్నే లేదు."

కంట్లో తిరిగే నీళ్ళు కనిపించకుండా, తలొంచుకుని కూర్చుండిపోయా, ఆ ప్రేమమూర్తి దగ్గరికొచ్చి అనునయంగా భుజాలు నిమిరే దాకా!

# అపాత్రదానం

## ప్రశాంత్ వర్మ ఉప్పలపాటి
✆ 8121534453

> *"రోడ్ల మీద, ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర చంటిబిడ్డలని ఎత్తుకుని వస్తారు. వాళ్ళంతా వయసుడిగిపోయిన వృద్ధులేనా? కొంచెం ఎదిగాక నడక నేర్చింది మొదలు, వీళ్ళతో శిక్షణ పొంది...*
>
> *ఆ చంటిబిడ్డలు కూడా ఇదే పనిలోకి వచ్చేస్తున్నారు!"*
>
> *ఇంతకుముందు ఎందుకు ఆలోచన చేయాలి అనుకున్నాను. నిజంగా ఆలోచించాల్సిన అవసరముందని ఇప్పుడు ఇతడి మాటలు వింటుంటే అనిపిస్తుంది.*

"బాబూ! ఓ పదిరూపాయిలు సాయం సెయ్యయ్యా!"

నేనెక్కాల్సిన ట్రైన్‌కి ఇంకా గంట సమయం ఉంది. రీల్స్ చూడటంలో లీనమైపోయున్న నాకు ఆ మాటలు సరిగ్గా వినబడలేదు. మరోసారి నేను కూర్చున్న ఇనుపకుర్చీపై తడుతూ అడిగేసరికి ఫోన్లో నుండి తల బయటపెట్టాను. ఎదురుగా ఓ నలభైయ్యేళ్ళ పెద్దమనిషి మాసిపోయిన గళ్ళలుంగీ, రంగు వెలిసిపోయిన చొక్కాతో కుడిచేతిని ముందుకు చాపి నిలబడున్నాడు. బట్టలు తప్పితే ముఖం, చేతులు, కాళ్ళు అంతా బానే ఉన్నాయి. రెండు రోజులుగా సరైన తిండి, నిద్ర లేనోడికిమల్లే ఉన్నాడు.

"బాబూ! తిని రెండు రోజులయ్యింది. పది రూపాయిలు..." రెండు చేతుల వేళ్ళతో సైగ చేసి చూపిస్తూ అంటున్నాడు.

కానీ, చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని ఉన్న నాకు సరిగా వినబడడంలేదు. చేతులు చాపి దీనంగా చూడటమే తప్ప, ఇంత కావాలని అడిగేవాళ్ళని ఎప్పుడూ చూడలేదు. ఒకవేళ అతడు అడగకపోయినా ఇచ్చేందుకు రూపాయి కాసులు లేవు. ఇస్తే పది లేదా పైనే ఇవ్వాల్సిందే.

"చిల్లరలేదయ్యా!" అనేసి, ఇప్పుడు ఇతడి గురించి ఆలోచన ఎందుకులే అనుకుంటూ, మళ్ళీ ఫోన్లో పడిపోయాను.

అతను దూరం పోలేదు. నా ముందే ఉన్న ఓ స్తంభానికి నీరసంతో కూలబడిపోయినట్టు జారబడి కూర్చున్నాడు.

'చూడ్డానికి బానే ఉన్నాడు. ఆరోగ్యసమస్యలు ఉన్నట్టు లేదు. మానసికంగా దెబ్బతిని రోడ్డున పడ్డాడా? లేక మోసపోయాడా? ఏంటో ప్రశాంతంగా వెళ్ళాల్సిన వేళ, ఇతను ఎదురుపడి మనసంతా పాడుచేసాడు. పది రూపాయిలిస్తే వెళ్ళిపోయేవాడేమో'

అనుకుంటూనే ఇవ్వడానికి లేచాను. అంతలోనే మరో ఆలోచన. ‘అంత ఆకలి మీద ఉన్నోడికి డబ్బులివ్వడం కన్నా, తినడానికి ఏదైనా ఇస్తే కాస్త ఓపికొస్తుంది కదా!’ అనుకుని చుట్టూ చూసాను. దూరంగా ఓ షాప్ కనబడితే వెళ్ళి నాలుగు అరటిపళ్ళు, బిస్కెట్ ప్యాకెట్, మంచినీళ్ళ సీసా తీసుకువచ్చాను.

ఆశగా నా చేతి వైపే చూస్తుంటే మనసు కరిగింది. నేరుగా అతడి దగ్గరకి వెళ్ళి “తీసుకోండి” అంటూ చేతిలో అరటిపళ్ళు, బిస్కెట్ ప్యాకెట్ పెట్టి, నీళ్ళ సీసా పక్కనే పెట్టి, వెళ్ళి నా చోటులో కూర్చున్నాను. నా చుట్టూ ఉన్న ఓ నలుగురు నా వైపు ప్రశంసగా చూడటం నా దృష్టిని దాటిపోలేదు. అప్పుడే ఓ రెండు కళ్ళు మాత్రం నా వైపు జాలిగానో, నవ్వుతూనో చూసినట్టు అనిపించి అర్థం కాక, కాస్త కంగారుపడ్డాను. నన్ను చూసి అయ్యుండదనుకుని సరిపెట్టుకుని, అలాగే ఒక వైపు రీల్స్ చూసుకుంటూ మరో వైపు అతడినే గమనిస్తున్నాను. రెండు అరటిపళ్ళు తిని, మిగతావి చొక్కాజేబులో ఉన్న చిన్న కవరులో పెట్టుకున్నాడు. ‘రాత్రికి తినడానికా! లేదంటే ఎవరైనా ఉండి, వాళ్ళ కోసం దాచాడా!’ అర్థం కాలేదు. ఇవ్వడంతో నా పనైపోయిందనుకుని ఊరుకున్నాను. అప్పటికి అరగంట గడిచింది. ఇంకొక్క అరగంట కాలక్షేపం చేద్దాం అనుకునే లోపు, రైలు ఆలస్యం కూడా ఇంకో అర్ధగంట పెరిగింది.



కూర్చున్న చోటు మారదామని అనుకుంటూ చుట్టూ వెతికాను. ఎక్కడా కూర్చునేందుకు అవకాశం లేకపోవడంతో అక్కడే కూర్చోక తప్పలేదు. ఫోన్ చూసుకుంటూనే మధ్య మధ్యలో అతడిని గమనిస్తూనే ఉన్నాను. ఏదో ఆలోచనల్లో నుండి తేరుకున్నట్టు లేచాడు. పంచె సర్దుకుని కవరు, మంచినీళ్ళ సీసా తీసుకుని, నా వైపు కృతజ్ఞతగా ఓ చూపు చూసాడు. ముందులేని ఉత్సాహం అతడిలో కనిపించింది. పోనీలే ఒకరి కడుపు నింపానన్న తృప్తి కలిగింది! నెమ్మదిగా ఫ్లాట్‌ఫారం మీద నడుస్తూ, ఎదురువచ్చే వాళ్ళ దగ్గరా, అక్కడే ఉన్నవాళ్ళ దగ్గరా... మళ్ళీ చేతిని చాపి అడుగుతున్నాడు.

ఒక్కక్షణం ఆశ్చర్యమనిపించింది. 'మళ్ళీ అదేపని దేనికీ!' అనుకున్నాను. కానీ ఆలోచిస్తే అర్థమైంది, నేనిచ్చింది ఓ వారానికో, నెలకో సరిపడేది కాదుగా. ఇవాళ ఉన్నట్టు, రేపు ఉండాలనేం లేదు. ఎవరైనా దయతలిస్తే రేపటికి, ఇంకాస్త ఎక్కువ వస్తే, మరో రెండురోజులకి వెతుక్కోనక్కర్లేదుగా... అనుకుని సరిపెట్టుకుని, అతడినే గమనిస్తున్నాను. కొందరిస్తున్నారు. ఇంకొందరు ఇవ్వట్లేదు, అతడు కనుమరుగైనా ఆలోచనలు అతడి చుట్టూనే తిరుగుతున్నాయి.

'మనిషి ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు. తినక వచ్చిన నీరసమే తప్ప శుభ్రంగా తింటే చురుగ్గా తిరగ్గలడని తెలుస్తోంది. మరి దేనికిలా నలుగురి దగ్గరా చేయిచాచి బ్రతకడం! పెద్దదో, చిన్నదో ఒక పని చేసుకుని, హాయిగా బ్రతకడానికి ఇబ్బందేంటో! మరీ ఏదో ఒక పని దొరకని పరిస్థితుల్లో లేదు సమాజం. కాకపోతే మనం సర్దుకుపోయి చేసుకోవాలి. లేదంటే, ఇంటా బయటా అవమానాలే! అందరికీ ఉన్నట్టే అతడికీ కుటుంబం ఉండాలిగా! తల్లి, తండ్రి, తోడబుట్టిన వాళ్ళు... ఎవరో ఒకరు ఉండాలి. పెళ్ళైతే భార్యాపిల్లలు ఉంటారు. అవ లేదా? వదిలేశారా!' నా ఆలోచనలు ఇలా సాగుతుంటే పక్కనే ఎవరో కూర్చున్నట్టనిపించి పక్కకి తిరిగాను. ఇందాక నన్నుచూసి నవ్విన కళ్ళ తాలూకా వ్యక్తి. ముందు కూర్చున్న వ్యక్తి లేవడంతో ఇతనొచ్చి కూర్చున్నట్టున్నాడు.

"మిమ్మల్ని బాగా ఇబ్బంది పెట్టినట్టున్నాడతను." అడిగాడు నవ్వుతూ.

"అదేంలేదు, అంతా బానే ఉన్నప్పుడు దేనికీ ఈ పని అనే ఆలోచిస్తున్నాను." మాములుగా అయితే సమాధానం ఇచ్చేవాడిని కాదు. అయితే ఇందాక ఎందుకు నవ్వాడో లేక జాలిగా చూసాడో అర్థం కాలేదు. అది తెలుసుకోవడానికే తప్పక మాట కలిపాను.

"... అని మీరూ, నేనూ అనుకుంటాం సర్! వాళ్ళకి ఇది కూడా ఒక రకమైన పనే! కాకపోతే శ్రమ తక్కువగా ఉండే పని అంతే..."

"శ్రమ తక్కువ కాదు, అసలు ఇందులో శ్రమే లేదుగా!" అతడి మాటలకి అడ్డుపడుతూ అడిగాను.

"భలేవారే, మానసిక శ్రమ, శారీరక శ్రమ రెండూ ఉన్నాయి. వాటిని మనం చూడలేం."

"మానసిక శ్రమా?" ఇదేంటి కొత్తగా, ఎప్పుడూ వినలేదు అనుకుంటూ అడిగాను.

"ఇదే పని మీరు చేయగలరా!" అడిగాడు.

"ఛ... ఛ... నేనెందుకు చేస్తాను. ఐనా ఎలా మనసు చంపేసుకుని, ధైర్యంగా ఒకరి ముందు చేయి చాపగలం! అప్పు చేయడం, తీర్చడం వేరు... ఈ అడుక్కోవడం వేరు..." చెబుతున్నాను కానీ, అప్పుడే నాకు అతడి మాటలకి అర్థం దొరికింది.

"ఏంటి? అర్థమైందా! ఇది కూడా ఒక వృత్తే. యాచకవృత్తి అనే పేరొకటి ఉందిగా! అందుకే ఇది కూడా వృత్తి అయ్యింది. అరవై నాలుగు కళల్లో ఉందో లేదో పైవాడికెరుక." నవ్వుతూ అన్నాడు.

"అతడి పరిస్థితి మనకి తెలీదు. బహుశా కుటుంబంలో బాధ్యతలు ఎక్కువై, చదువులేక, పని దొరక్క ఈ పని చేస్తున్నాడేమో! జాలి చూపకపోయినా పర్లేదు, నవ్వుకోకూడదు, నిందించకూడదు." అన్నాను.

"మీరన్నట్టు పరిస్థితుల ప్రభావమే అయ్యుంటుంది లెండి. ఐనా అంత కాని పరిస్థితులు ఏమున్నాయి? అతడేం దివ్యాంగుడు కాదు. వాళ్ళలో కొందరు ఏదో ఒక పని చేసుకుంటున్నారు. బయట ప్రపంచంలో చూస్తే, వాళ్ళు కూడా శ్రమిస్తూ కనిపిస్తారు. సత్తువ లేకపోయినా, పళ్ళు అమ్ముతూనో, బండి లాగుతూనో ఓపిక మేర కష్టపడతారు. ఇప్పుడు మీ సాయం పొందిన వ్యక్తి ఈ ఇద్దరి కంటే మెరుగైన స్థితిలోనే ఉన్నాడుగా, ప్రయత్నం చేస్తే అస్సలు పనే దొరకదంటారా!" అతడి మాటలు నాకు కొత్తగా అనిపించాయ్.

అసలు నాకు సంబంధం లేని అంశమిది! ఉంటే ఇవ్వడం, లేదంటే ఊరుకోవడం తప్ప.. ఈ విషయం గురించి ఎప్పుడూ ఆలోచన చేయలేదు. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"ఇప్పుడు అతడికి సాయం చేయడం తప్పంటారా!" అంతకంటే ఏమడగాలో కూడా తట్టలేదు.

"తప్పేకదా!" క్షణం ఆలస్యం కాలేదు అతడి బదులుకి.

ఆశ్చర్యపోయాన్నేను!

"అప్పుడు వాళ్ళకి గడిచేది ఎలా? ఆకలితో ఉన్నవాడికి కడుపు నింపడం తప్పని మొదటిసారి వింటున్నాను." ఆశ్చర్యంగా, కొంచెం అసహనంగా అన్నాను.

"అవసరమున్న చోట దానం, సాయం ఎప్పుడూ తప్పు కాదు. అలాగే అవసరం లేని చోట చేసే దానం, సాయం తప్పే కాదు... తప్పుని ప్రోత్సహించడం కూడా అవుతుంది."

అతడు నెమ్మదిగా చెప్పినా, నాకు గట్టిగానే వినిపించింది. ఒక్కక్షణం ఆలోచనలతో వెనక్కి వెళ్ళాను. ఎక్కడా నేనూ చేసిన దాంట్లో తప్పు కనిపించలేదు. అదే అడిగాను.

"మీరు గమనించండి. అవయవాలు సరిగ్గా లేకపోతే అలాంటివాళ్ళ భారం మోయలేక, అయినవాళ్ళే వదిలేస్తారు. వాళ్ళకి పని చేసుకుని బ్రతకాలని ఉన్నప్పటికీ, శరీరం సహకరించదు. వయసైపోయి, ఓపికలేక, ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్న పెద్దవాళ్ళు లేదా వృద్ధులని ఇంట్లోంచి గెంటేయడం, తీసుకొచ్చి వదిలేయడం చేస్తారు. దారిలేక వాళ్ళు చేయి చాస్తారు. వీళ్ళకి చేసే సాయానికి, దానానికి విలువుంటుంది. వీళ్ళల్లో కూడా కొందరు దానాన్ని ఆశించక, వీళ్ళైనంతవరకూ తోచిన పని చేయడానికే సిద్ధపడతారు. విచిత్రం ఏంటంటే, వాళ్ళ దగ్గర కొనే అవకాశం ఉన్నప్పటికీ, మనం కొన్నిటిని కొనలేం. అంటే పేపర్లు, ప్యాక్డ్ బిస్కెట్స్, పళ్ళు... ఇంకా ఇలాంటివి ఏవోకటి అమ్ముకుని జీవించేవాళ్ళ గురించి! వాళ్ళు అమ్మేవి మనం తినలేమనుకుంటే, కనీసం కొని వాటిని తినేవాళ్ళకి దానం చేయచ్చు!"

అతడు చెబుతుంటే ఆశ్చర్యపోయాను. దానం చేయడానికి ఇంత ఆలోచన చేసేవాళ్ళు ఎవరుంటారులే అనుకున్నాను.

"అయితే ఇంతకుముందు మీరు చేసేరుగా సాయం. అతడిని గమనించారా, ఆరోగ్యసమస్య ఉన్నవాడిలా ఉన్నాడా? ఒళ్ళొంచి పని చేయలేని స్థితిలో కనిపించాడా? ఇతడనే కాదు, రోడ్ల మీద, ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర చంటిబిడ్డలని ఎత్తుకుని వస్తారు. వాళ్ళంతా వయసుడిగిపోయిన వృద్ధులేనా? కొంచెం ఎదిగాక నడక నేర్చింది మొదలు, వీళ్ళతో శిక్షణ పొంది, ఆ చంటిబిడ్డలు కూడా ఇదే పనిలోకి వచ్చేస్తున్నారు!"

ఇంతకుముందు ఎందుకు ఆలోచన చేయాలి అనుకున్నాను. నిజంగా ఆలోచించాల్సిన అవసరముందని ఇప్పుడు ఇతడి మాటలు వింటుంటే అనిపిస్తుంది.

"కానీ పసిపిల్లలను చూడగానే ఎవరికైనా మనసు కరుగుతుంది కదా! సాయం చెయ్యకుండా ఉండలేం. పైగా ఎవరూ సహాయం చేయకపోతే పాపం కదా పిల్లలు!" అన్నాను.

"నిజమే... ఆ తల్లికి పోషించే స్థితి నిజంగా లేకపోతే, ఆ పిల్లలని చేరదీసి పోషించే సంస్థలు బోలెడున్నాయ్. వీళ్ళని అక్కడ ఉంచి, వాళ్ళు ఏదొక పని చేసుకుంటూ అప్పుడప్పుడు పిల్లలని చూసిపోవచ్చు. వాటి గురించి వాళ్ళకి ఎవరు చెబుతారు అనుకోకండి. వాళ్ళకి తెలుసు,,ఎక్కడెక్కడ ఉంటాయో! ఆ దరిదాపుల్లోకి పిల్లలని పంపరు, వీళ్ళు పోరు!"

"అదేంటి?" ఆశ్చర్యపోయాను.

"వాళ్ళే లేకపోతే వీళ్ళకెవడు డబ్బులిచ్చేది? పని చేయడానికా ఒళ్ళొంగదు కొందరికి..."

ఇవ్వాళ నాకు కొత్త విషయం తెలిసింది. ఇంత లోతుగా ఎప్పుడూ ఆలోచన చేయలేదు. ఈ ఆలోచన లేక సాయం చేశామని గొప్పగా ఆలోచిస్తున్నామే తప్ప, తెలియకుండా సోమరిపోతుల్లా, బద్ధకస్తుల్లా కొందరిని తయారుచేస్తున్నామని ఎప్పుడూ అనుకోలేదు. ఇకమీదట ఇలాంటి తప్పు జరగకూడదు.. అంటే ఒక నిర్ణయానికి రావాలి. మేము మాటల్లో ఉండగానే ట్రైన్ ఫ్లాట్‌ఫారం మీదకి వచ్చింది. అతడికి 'బాయ్' చెప్పి నా కోచ్‌లోకి ఎక్కాను. అతడూ వెనకే వచ్చి, నా ఎదురుగా కూర్చున్నాడు.

"మీరెక్కడి వరకూ?" అడిగాను.

"నా ఉద్యోగం ఇక్కడే, ఉండేది తాడేపల్లిగూడెం. రోజూ ఉదయం, సాయంత్రం ఈ ట్రైన్‌కే వచ్చిపోతుంటా, పాస్ ఉందిలెండి."

"మిమ్మల్ని ఒక్క విషయం అడగచ్చా!" అన్నాను. ఇప్పటికి సందేహం అలానే ఉండిపోయింది. అతడు చెప్పింది అంతా విన్నాకా ఇదే కారణమా, ఇంకేదైనానో తెలుసుకోవాలని కూడా అనిపించింది.

"అడగండి." అన్నాడాయన.

"ఆతడికి పళ్ళు, బిస్కెట్స్ ఇచ్చినప్పుడు మీ కళ్ళల్లో నవ్వు చూసాను. అంటే... నవ్వో, జాలో అర్థం కాలేదు. దేనికది? దండగ సాయమనా!"

"చెబుతాను, కాదు చూపిస్తాను. తరువాత మీరు ఫీలవ్వకూడదు మరి!" నవ్వుతూ అంటుంటే ఆశ్చర్యపోయాను.

'చూపిస్తాడా! ఏం చూపిస్తాడు?' అనుకుంటుండగానే ట్రైన్ కదిలింది. నెమ్మదిగా వెళ్తుంది. ఫ్లాట్‌ఫారం చివరికి చేరుకుంది మా బోగీ.

"అదిగో అటు చూడండి" అంటూ చివర డ్రైనేజీ పక్కన గట్టు మీద కూర్చున్న మనుషులని చూపించాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి అదిరిపడ్డాను. కూర్చున్న చోటుకి దగ్గరలో ఉన్న స్ట్రీట్‌లైట్ వెలుతురులో స్పష్టంగా వాళ్ళ ముఖాలు కనిపించాయ్.

ఇంతకు ముందు నేనెవరికైతే సాయం చేసానో అతడే, ఎదురుగా అతడి భార్య అయ్యుంటుంది. వాళ్ళకి కాస్త పక్కగా ఓ పదేళ్ళ పిల్లాడు. వాడి దగ్గర ఓ బిర్యాని పొట్లం. వీళ్లిద్దరికీ మధ్యలో ఓ బిర్యాని పొట్లం, పక్కనే సగం ఖాళీ అయిన మద్యం సీసా. ఇద్దరి చేతుల్లో మద్యం నిండిన గ్లాసులు!

"చాలా రోజులుగా అతడిని చూస్తున్నాను. మొదట్లో అతడికి సాయం చేసిన వాళ్ళలో... నేను కూడా ఒకడిని! తరువాత ఒకటి రెండు చోట్ల, ఇదే అనుభవం వేరే వాళ్ళతో ఎదురైంది. అప్పుడే బాగా ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చాను. అదే ఇంతకు ముందు మీతో మాట్లాడింది! పిల్లాడి గురించి చైల్డ్ రైట్స్ వాళ్ళకి సమాచారం ఇచ్చాను. వాళ్ళు తీసుకెళ్ళే ప్రయత్నం చేశారు. అయితే మా పిల్లోడి మీద మీ పెత్తనం ఏంటని బెదిరింపుకి దిగారు. పోలీసులను పెట్టి భయపెడితే, కొన్నిరోజులు స్కూల్‌కి పంపారు. మళ్ళీ మొదటికే వచ్చింది. ఈ సమస్యకి పరిష్కారం ఒక్కటే. అది ఇలాంటి వాళ్ళకి దానం అందకపోవడమే అని! నా ఆలోచన తప్పో ఒప్పో అన్నది దేవుడే నిర్ణయించాలి." చెప్పడం ఆపాడు.

"నాకైతే తప్పేం కనిపించడం లేదు. కాకపోతే ఎవరికి వారికి స్వయంగా అనుభవం కాకపోతే మాత్రం తప్పేముందిలే అని వదిలేస్తారు. ఇది ఇలానే కొనసాగుతుంది." అతడికి బదులిచ్చి, వేగంగా నన్ను దాటుకుని పోతున్న చెట్లని, పొలాలని చూడటంలో పడిపోయాను.

# ఎంతెంత దూరం...

**పి. రాజేంద్ర ప్రసాద్**

✆ 9492525607

*"ఏరా నా మాట యిన్నారా? ఎన్నిరోజులయ్యింది నేను సెప్పి?" అంటూ తిడతాడు. తిట్లు పడాల. ముసలోడిని సాగనంపడం కోసం కట్టెలూ, కంపా ఏరుకు రావాల. అందరూ తాగడానికి కల్లు పోయించాల. పదోనాడు ఏటను కొయ్యాల. ఊరంతటికీ బువ్వెట్టాల. ఇట్టా సాగుతున్నాయి ఆలోసనలు. సూర్యుడు నెమ్మదిగా కిందికి దిగుతున్నాడు. మనసులో బుగులౌతున్నది. తొందరగా ఊరు సేరుకోవాల. ముసలోడు ఎంత పని సేసినాడు?*

"ఏటైనాదేటైనాది?"

"ఏటీనేదు... ముసిలోడు జారిపోతున్నాడెహె..."

"చెస్! పొట్టోల్లిద్దరూ ఎనకాతలుండిపోనారు. జారిపోనాడంటే జారిపోడా మరి?" తుపుక్కున ఉమ్మేస్తూ అన్నాడు సిమ్మాచలం.

"ఏటి సెయ్యమంతవ్! దిగేటప్పుడు ఎనకుండమన్నవ్. ఎక్కేటప్పుడు మీరే ముందుకు రావాలగందా! నువ్వు రాడం ఒగ్గేసి మమ్మల్నంతవేటి?" కస్సుమన్నాడు ఎనకనుండి మంచం మోస్తున్న అప్పన్న.

"సర్లేయే! దేనికి తగూలు? ఇప్పటికైనా రమ్మను" అన్నాడు, ఎనకాతలున్న పొట్టిగా ఉన్న పైడితల్లి.

మంచాన్ని సమానంగా ఉన్న జాగాలో జాగ్రత్తగా దింపి, సిమ్మాచలం, ఎంకన్న ముందునుండి ఎనక్కీ, అప్పన్న, పైడితల్లి ఎనకనుంచి ముందుకీ మారిపోయారు. మళ్ళా మంచాన్ని ఎత్తుకున్నారు. నడక సాగింది. మంచం మీదున్నాడు నర్సిమ్ములు... సొయానా అప్పన్నకీ, పైడితల్లికీ తండ్రి, సిమ్మాచలానికీ, ఎంకన్నకీ పెత్తండ్రి. నర్సిమ్ములు పెండ్లాం ఏనాడో సచ్చిపోయింది. పదేళ్ళయింది గావును. ఈడింకా కట్టెనాగ బతికున్నాడు. ఇద్దరు కొడుకులూ కొండల్లోకి పోయి సీతాపలాలో, జాంకాయలో, ఎలక్కాయలో తీసుకొచ్చి సంతలో అమ్మితే... ఉప్పూ, పప్పూ వచ్చేటియ్యి. ఇంటెనక జాగాలో పంటేస్తే జొన్నలో, రాగులో పండేటియ్యి. బతుకు ఎల్లబారిపోతా ఉండేది. ముసలోడు ఇంతవరకూ ఏనాడూ జిర్రున సీదెరగడు.

అరవయ్యేళ్ల ఒయిసు దాటినాక, ఇదిగో ఈనాటికి ఈడికి రోగం వచ్చినాది. రోగమంటే మొదాల్ని మామూలు రోగమే. అట్టట్టా పెరిగిపోనాది. నెల్రోజులాయి ఒకటే జొరం! కట్టెనాటోడు, పుల్లనాగ అయిపోనాడు. ఒల్లంతా నొప్పులేమో మరి...

ఒకటే మూలుగు! మాట పడిపోయినట్టు ఏదీ సెప్పేవోడు కాదు. ఇద్దరు కొడుకులూ ఏటనక పోయినా, ఇద్దరు కోడళ్ళూ సక్కగానే సూసుకుంటా ఉన్నా కూడా ముసలోడికి ఏందో బాద! ముసిల్ది గ్యాపకం వొచ్చినాదో, మరి పైనించి దేవతలెవరైనా పిలుస్తా ఉన్నారో... ఎంతసేపూ ఆకాశానికేసి సూసీ సూసీ మూలగడం! అప్పన్నకూ, పైడితల్లికీ ఏటీ అంతు సిక్కనేదు.

"ఏటి సెయ్యాల? ఏటి సెయ్యాల?" ఎంచేపటికీ ఇదే ఆలోసన.



సివరికి అప్పల్నాయుడు సెప్పినాడు. "ఈడు ఈడనే ఉంటే బతకడం కస్టమొరే! ఆస్పత్రికి తీసుకుపోండి. కొంచెం ఒళ్ళు సులువవుద్ది." అంటూ సలహా ఇచ్చాడు. అప్పలనాయుడంటే ఆ ఏబై గడపలున్న ఊరిలో పెద్ద. ఒయిసులో గాని, అనుబవంలో గాని ఏబై కుటుంబాలలో, వందా నూటాబైమంది జనాల్లో అతగాడిదే మాట. ఆ మాట తీసీడానికి లేదు. అయినా ఇద్దరు కుర్రాల్లూ సానా ఓపిక పట్టేరు. నెలకి పైన కాపు కాయడం అయినాది. సస్తదేమో అని బెంగ పెట్టుకున్నాక, ఇక తప్పదని ఆ ఊరికి పన్నెండు మైళ్ళ దూరాన ఉన్న ఆస్పత్రికి తీసుకుపోతున్నారు. రోడ్డునాంటిది ఏదీ లేని ఆ కొండదారిలో రోగులకీ, నడవలేని ముసలోల్లకీ డోలీయే గతి! ఈ ముసలోడికి డోలీలో కూసుండే ఓపిక కూడా లేదాయె. అందుకే మంచం మీదనే మోసుకుపోతా ఉన్నారు.

ఎత్తులూ, పల్లాలూ, గోతులూ, గొప్పులూ, రాళ్ళూ, ముళ్ళూ అన్నీ అలవాటే ఆళ్ళకి. పొద్దు పొడవంగానే మొదలైంది ఆ పయానం. అయితే ఇప్పుడు ఒక్క మణిసి ఎల్లే దారిలోనే మంచంతో పాటు నలుగురు నడవాల! అటూ ఇటూ తుప్పలూ, తీగలూ, పుట్టలూ, ముళ్ళూ, కంపా.. అన్నిటినీ సరిచేసుకుంటూ నడవాల! పొద్దున్నంతా ఈదరగాలి తోసేసినాది. కొద్దిసేపయినాక నిమ్మళంగా ఎండెక్కడం మొదలయ్యింది. పది మైళ్లు నడిసేతలికి, సూరీడు నడినెత్తి మీనకెక్కేసినాడు. అప్పటికి కనిపించినాది రోడ్డు. ఆన్నించి ఇంకా మైలున్నది ఆస్పత్రి. రోడ్డెక్కినాక కొద్ది దూరం మట్టి మీద బాగానే ఉన్నది. ఇంకింత దూరం ఉందనగా తార్రోడ్డు మొదలయ్యింది. తారు కాలిన ఏడికి కాళ్ళు చర్రుమన్నాయి. నడినెత్తి మీంచి సెమటలు కారతా ఉన్నాయి.

"ఒక్క సిటం కూసుందారి." అన్నాడు ఎంకడు.

"అట్టాగే" అంటూ తలలూపారు మిగతా ముగ్గురూ. పెద్దగా పెరిగిన మర్రిమాను కింద మంచం దింపి ఒగురుస్తూ కూసున్నారు. మంచం మీది నర్సిమ్ములు గెట్టిగా మూలిగాడు.

"ఏందయ్యా? ఏం కావాల?"

నీల్లు కావాలన్నట్టు ముసలాడు సైగ చేశాడు. సొరకాయ బుర్ర వొంచి మెల్లంగ ముసలోడికి నీళ్ళు తాగిపించినారు. ఆల్లూ తలా కుసిన్ని నీలు తాగి నడక సాగించినారు. కాల్లు మండుతా ఉన్నయి. నెత్తి కాల్తా ఉంది. కళ్ళు తిరుగుతా ఉన్నయి. అయినా పండ్లు బిగబెట్టి నడుస్తా ఉన్నారు.

"ఒరేయ్! పైడితల్లీ! ఒచ్చేసినామొరే!" ఆనందంగా అరిసినట్టే అన్నాడు సిమ్మాచలం. నలుగురూ వగుర్సుకుంటా మంచం కిందకి దింపారు. ఎదురుగా బోర్డు కనపడింది "మండల ఆరోగ్య కేంద్రం" నలుగురూ ఊపిరి పీల్చుకున్నారు. సిమ్మాచలం వివరాలు కనుక్కోవడానికి లోపలికి వెళ్ళాడు

★★★

"ఈ పేషెంట్ తాలూకు ఎవరయ్యా?" కేకేశాడు లోపల్నించి వార్డు బాయ్.

ఒక్క ఉదుటున నలుగురూ నర్సిమ్ములు ఉన్న బెడ్డు దగ్గరికి ఉరికారు.

"ఏయ్! ఒక్కళ్ళే రండి. మిగతా వాళ్ళు బయటనే ఉండాల." హుకుం జారీ చేశాడు ఆ వ్యక్తి.

గతుక్కుమని సిమ్మాచలం ఒక్కడూ లోపట ఉండిపోయి, మిగతా వాళ్ళు బయటికి పోయారు.

డాక్టరు రోగిని పరీక్షించడం మొదలు పెట్టాడు. స్టెతస్కోపు గుండెపై పెట్టి పరీక్షిస్తున్న అతని ముఖం రంగులు మారుతోంది. అనుమానంగా, అసహనంగా ఒకటికి రెండుసార్లు చెక్ చేశాడు. సిమ్మాచలానికి వినీ వినబడకుండా వార్డుబాయ్‌కి ఏదో చెప్పి అక్కడ నుంచి వెళిపోయాడు.

"ఏంటయ్యా!" ఆదుర్దాగా అడిగాడు సిమ్మాచలం. విషయం చెప్పాడు వార్డ్‌బాయ్.

"ఓర్నాయనో! పెదనానా! పోయినావా! నేనేటి సేతునురో! మా కొంప ముంచినావు కదరా ముసలోడా!" రాగం ఎత్తుకున్నాడు సిమ్మాచలం. మిగతా ముగ్గురూ లోపలికి ఉరికొచ్చినారు.

"ఉష్..." నోటి మీద వేలుంచుకుని గసిరినట్టుగానే ఎవరికీ వినిపించకుండా గుసగుసగా అన్నడు వార్డ్‌బాయ్. "నోరు మూసుకొని శవాన్ని ఈడ్సించి తీసుకుపోండి. ఆడు గనక ముందే సచ్చి, మీరు ఆ శవాన్ని ఆ పైన ఇక్కడకి తీసుకొచ్చినట్టు బయటపడితే మీ మీన పోలీసు కేసవుతాది."

ఆ మాట ఇనగానే అందరికీ నిలువుగుడ్లు పడ్డాయి. నలుగురూ బెదిరిపోయారు. నిశ్శబ్దంగా నోళ్ళు నొక్కుకుని, ఒకరి కళ్ళ నీళ్ళు ఒకరు తుడుచుకుంటూ మంచం మీదికి ముసలోడిని చేర్చి తిరుగు ప్రయాణం పట్టారు.

తారురోడ్డు మీద ఎండ కాల్తా ఉంది. కాళ్ళంటుకు పోతా ఉన్నాయి. ఒగుర్చుకుంటూ, రొప్పుకుంటూ, రోజుకుంటూ, తిట్టుకుంటూ, తిమ్ముకుంటూ కాళ్ళబాధ తెలియకుండా పరుగులు పెట్టారు అందరూ. ఎట్టాగైతే తారురోడ్డు దాటి, మట్టిరోడ్డు కొచ్చాక, కాళ్ళు మట్టిలో పడ్డాక ఆయాసమూ, అలుపూ తీర్చుకుంటూ ప్రయాణం నెమ్మదిగా సాగింది. మట్టిరోడ్డూ అయిపోయింది. అడివి లోపల పడ్డారు. ప్రాణాలు చల్లబడ్డాయి. చెట్ల నీడన నెమ్మదిగా నడుస్తూ ఉన్నారు. కొండొచ్చింది. ఎక్కారు. బండొచ్చింది. అదీ దాటారు. ప్రయాణం సాగుతూనే ఉంది. వెళ్ళేటప్పుడు ఏదో ఆశ ఉండేది. ఇప్పుడు అంతా నిరాశ. ఇంటికి ఎప్పుడు పోవాల? ఏ యేలకి పోతాం? ఆడాళ్ళ ఏడుపులు తల్సుకుంటుంటే గుబులౌతున్నది. పొయ్యినాక అందరూ వస్తారు. ఇన్ని రోజులయ్యి ముసలోడిని ఎందుకు ఆస్పతాలుకి తీసుకుపోలేదని అడుగుతారు. ఏం చెప్పాల?

అందరికంటే ముందే అప్పలనాయుడొస్తాడు. "ఏరా నా మాట యిన్నారా? ఎన్నిరోజులయ్యింది నేను సెప్పి?" అంటూ తిడతాడు. తిట్లు పడాల. ముసలోడిని సాగనంపడం కోసం కట్టెలూ, కంపా ఏరుకు రావాల. అందరూ తాగడానికి కల్లు పోయించాల. పదోనాడు ఏటను కొయ్యాల. ఊరంతటికీ బువ్వెట్టాల. ఇట్టా సాగుతున్నాయి ఆలోసనలు. సూర్యుడు నెమ్మదిగా కిందికి దిగుతున్నాడు. మనసులో బుగులౌతున్నది. తొందరగా ఊరు సేరుకోవాల. ముసలోడు ఎంతపని సేసినాడు? అందరి మనసుల్లో ఆలోచనలు ముసురుకున్నాయి. జరిగినదీ, జరగబోయేదీ తలుచుకుని వాళ్ళకి గుండెల్లో గుబులెత్తి పోతున్నది.

మచ్చలకొండ దాటినారు. ఇక ఎర్రకొండ దాటాల. అదెక్కి దిగితే ఇక సగందూరం దాటినట్టే. గంట గంటకీ ముసలోడున్న మంచం బరువెక్కిపోతున్నది.

“ఒక సిటం కూసుందార్రా!” అన్నాడు పైడితల్లి.

తలలూపి ఒగురుస్తా మంచం కిందికి దింపినారు. చెట్టు నీడని కూసోని సొరకాయ బుర్ర తీసి, తలా కుసిన్నీ తాగి “దేవుడా” అనుకుంటూ తలకెత్తుకున్నారు.

“ఊఁ...” మంచం మీంచి గెట్టిగా మూలుగు ఇనిపించింది. నలుగురికీ పైప్రాణాలు పైనే పోయినాయి. గభాలున మంచం కిందికి దించినారు.

“ఒరేయ్! పైడితల్లిగా... ఆస్పత్రికి ఇంకా ఎంతదూరం ఉన్నాది?” మోచేతుల మీద కొంచెం పైకి లేచిన ముసలోడు అందరి ముఖాల్లోకి చూస్తూ ఆత్రంగా అడుగుతున్నాడు.

# ప్రయోజనం

**వి. రాజారామ్మోహనారావు**
✆ 9394738805

*"నీకు న్యాయంగా అనిపించిందా? మా వాళ్ళకి అది తప్ప ఇంకో ఆధారం లేదు. డెబ్బై ఏళ్ళ ఈ వయసులో వాళ్ళకేం సెక్యూరిటీ అక్కర్లేదు. మనకు రాసిచ్చేయాలి. అది న్యాయం!" అంది రోషంగా.*

*"అది కాదు పూజ... స్థలం రాయించుకుంటే, వాళ్ళని వదిలేస్తామా? అవసరమైతే మన దగ్గరే ఉంటారు!"*

*"వాళ్ళు మన దగ్గర బదులు... మనమే అవసరమైనపుడు వాళ్ళ దగ్గరకెళ్ళచ్చుగా?"*

ఇద్దరికీ ఒకే చోట ఉద్యోగం. నెలకాదు, రెండునెలలు కాదు, మూడేళ్ళుగా కలిసి ఉంటున్నారు. అలా ఉంటున్నారని ఇద్దరి ఇళ్ళవాళ్ళకీ తెలుసు. ఇద్దరికీ పెళ్ళయితే కాలేదు గానీ, బాహాటంగా అన్నిరకాలుగా భార్యాభర్తల్లాగే ఉంటున్నారు!

ఇద్దరూ కలిసే ఉంటున్నా, ఇద్దరి మనసులు ఒకలా లేవు. ఇవాళ కాకపోతే, రేపు పెళ్ళి అవుతుంది, జీవితాంతం కలిసే ఉంటాం అన్న నమ్మకం పూజకి! ఆమెకి వేరే సందేహం లేదు! కానీ రవి మనసు అలా లేదు. పూజే సర్వస్వం కాదతనికి! తల్లి, తండ్రి, వాళ్ళ ఆస్తీ కూడా ముఖ్యమే. ఏదేనా పేచీ వచ్చి, పెళ్ళికే ఆటంకం వస్తే, అప్పటి సంగతి అప్పుడు! అదీ అతని మనసు!

'తొందరగా పెళ్ళిచేసేసుకుంటే సరి' అన్న ఆలోచన పుట్టింది పూజలో! అదే రవితో చెప్పింది. అతనేం బదులు చెప్పలేదు. ఒకటికి రెండుసార్లు పూజ చెప్పినా, అతని ధోరణి మారలేదు. చివరికి పూజ... రవిని నిలదీయక తప్పలేదు!

"మనిద్దరివీ గొప్ప ఉద్యోగాలేం కావు. ఎవరం సరిగ్గా సెటిల్ అవలేదు. పెళ్ళంటే ఎలా? ప్రస్తుతం బాగానే ఉన్నాంగా!" అన్నాడు.

"ప్రస్తుతం బాగుంటం కాదు. ఎప్పటికీ బావుండాలి. పెళ్ళి చేసుకోటం వల్ల అదనంగా భారమేముంది? పిల్లల విషయంలో జాగ్రత్తగానే ఉన్నాంగా! అలాగే ఉంటాం!" అంది పట్టుగా పూజ.

ఇంకేమనాలో తోచనట్టు, "సరే చూద్దాంలే" అన్నాడు రవి. అంతే తప్ప సరైన సమాధానం చెప్పలేదు.

రానురాను పూజకి పట్టుదల పెరిగింది. తరచుగా పెళ్ళి ప్రస్తావనే తీసుకురావటం మొదలెట్టింది. ఇద్దరి మధ్య ఆ విషయం గొడవలకి కారణమైంది. తరచుగా గొడవ... సుఖం కరువైంది. ఏ ప్రసక్తితో సంభాషణ జరిగినా, చివరికి పెళ్ళి మీదకే రావటం... తీవ్రమైన తగువు!



ఇంట్లో చాలదన్నట్టు... ఆ గొడవ ఆఫీసుదాకా పాకింది. ఛాటింగ్‌లో ఇదే గొడవ. ఇద్దరి మనసులు చికాకుమయం!

గత మూడురోజులుగా మరీ ఎక్కువై, ఇద్దరూ కిందకి వచ్చి సెక్యూరిటీ దగ్గర కీచులాట ఆరంభించారు. సెక్యూరిటీ వాళ్ళు వీళ్ళద్దర్నీ గమనిస్తూనే ఉన్నారు.

ఆ రోజు బాగా విసుగ్గా వున్నాడు రవి. పూజ పోరు పడలేక, "అసలు నిన్ను ఎప్పటికీ పెళ్ళి చేసుకోను. నీ దిక్కున్న చోట చెప్పుకో" అని గట్టిగా అరిచాడు.

దిమ్మెరపోయింది పూజ. ఎప్పటకేనా పెళ్ళి జరుగుతుందనే తప్ప, అసలు 'చేసుకోను' అంటాడన్న ఊహ కూడా లేదు.

పెళ్ళి చేసుకోకపోతే ఎలా? అన్నేళ్ళ అనుబంధం, అనుభవం, శారీరక బంధం, తీపి అనుభవాలు, అదే జీవితం అనుకున్న గాఢభావన! ఇవన్నీ లేకుండా బతగ్గలదా? బతికినా ఆ బతుకులో ఏంటుంది? నీరసించి పోయిన దానిలా నెమ్మదిగా, "అయితే ఎప్పటికీ చేసుకోవా?" అనడిగింది.

"అదేగా చెపుతున్నది. ఇంక నీకూ నాకూ సంబంధం లేదు. నన్నింకా విసిగించి చంపకు!" అన్నాడు.

"అయితే, నీ కళ్ళెదురుగానే చచ్చిపోతాను. చూడు..." అంటూ బాణంలా రోడ్డు మీదకి పరిగెత్తింది.

చూస్తున్న సెక్యూరిటీ గార్డ్ వెనకే పరిగెత్తాడు. రవీ పరిగెత్తాడు.

రోడ్డుమీద విపరీతమైన ట్రాఫిక్! కుడివేపు రెండు, ఎడంవేపు ఒక కారు సడన్ బ్రేక్‌తో ఆగాయి కాబట్టి పూజ బతికింది. చావు అంచులకి వెళ్ళి వచ్చింది. అప్పటికే సెక్యూరిటీ అతను పూజను పట్టుకున్నాడు. వెనక్కి తీసుకొచ్చి కూచోపెట్టారు. షాక్‌లో ఉన్నదానిలా శూన్యంలోకి చూస్తున్నట్టు అయిపోయింది. ఎవరు పిలిచినా బదులు పలకటం లేదు.

సెక్యూరిటీ వాళ్ళు, వాళ్ళ ఆఫీసుకి ఫోన్ చేసారు. మేనేజర్, టీమ్ లీడర్, ఇద్దరు కొలీగ్స్ హడావిడిగా వచ్చారు.

చన్నీళ్ళతో ముఖం తుడిచి, కాసిని నీళ్ళు తాగించిన తర్వాత కొంచం కోలుకుంది పూజ. అటువంటి స్థితిలో పూజని ఒంటరిగా పి.జి.లో ఉంచటం ఇష్టంలేక, మరో కొలీగ్‌తో కలిసి, టీమ్ లీడరే పూజని తనింటికి తీసికెళ్ళింది.

రాత్రి పదకొండింటింటికి బాగా తేరుకుంది పూజ. బలవంతం చేస్తే కొంచెం తింది.

నెమ్మదిగా విషయం తెలుసుకున్న టీమ్ లీడర్, "ఏదో ఎమోషన్‌లో రవి అలా అనుంటాడు. మేం మాట్లాడతాం. నువ్వు తొందర పడకు" అని అన్నాక పూజకి కొంచం ధైర్యం వచ్చింది.

మర్నాడే టీమ్ లీడర్, మేనేజర్ రవితో మాట్లాడారు. చివాట్లు పెట్టారు. పిచ్చివేషాలు వేస్తే ఉద్యోగం పోతుందని హెచ్చరించారు.

ఇంట్లో సంప్రదించి, రెండురోజుల్లో చెపుతునన్నాడు రవి.

★★★

రెండురోజుల తర్వాత పూజని కలిసాడు రవి. ఇద్దరూ ప్రశాంతంగా మాట్లాడుకోటానికి వీలుగా ఉన్న చోటు చూసుకున్నారు.

"మా ఇంట్లో మాట్లాడాను. మన పెళ్ళికి ఒప్పుకున్నారు. పోతే చిన్న మెలిక పెట్టారు."

"ఏంటది?" అంది పూజ. స్నేహితుల సలహాల వల్ల రెండురోజుల క్రితం కన్నా చాలా నిబ్బరంగా ఉంది.

"నాలాగే, మన ఉద్యోగాల మీద వాళ్ళకీ నమ్మకం లేదు. మీకు సెక్యూరిటీ ఏమిటనడిగారు." అన్నాడు

"అంటే?" అంది ముఖం చిట్లించి పూజ.

"గచ్చిబౌలిలో మీ అమ్మానాన్నలకి స్థలం ఉంది కదా, అది మన పేరుమీద ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాక, పెళ్ళి అంటున్నారు"

"నీ ఉద్దేశమేంటి?" అనడిగింది అప్రసన్నంగా పూజ.

"వాళ్ళన్నది న్యాయంగానే ఉందనిపించింది!" అన్నాడు రవి.

పూజకి తట్టుకోలేని ఆవేశం వచ్చింది. "నీకు న్యాయంగా అనిపించిందా? మా వాళ్ళకి అది తప్ప ఇంకో ఆధారం లేదు. డెబ్బై ఏళ్ళ ఈ వయసులో వాళ్ళకేం సెక్యూరిటీ అక్కర్లేదు. మనకు రాసిచ్చేయాలి. అది న్యాయం!" అంది రోషంగా

"అది కాదు పూజా! స్థలం రాయించుకుంటే, వాళ్ళని వదిలేస్తామా? అవసరమైతే మన దగ్గరే ఉంటారు!"

"వాళ్ళు మన దగ్గర బదులు, మనమే అవసరమైనప్పుడు వాళ్ళ దగ్గరకెళ్ళచ్చుగా?" పూజ అన్నదానికి, రవికేం సమాధానం తట్టలేదు.

తిరిగి పూజే అంది. "ఇక్కడ స్థలం, సెక్యూరిటీ విషయాలు కావు. యాటిట్యూడ్. అది సవ్యంగా లేదు. నీకు మన పెళ్ళిలో ప్రేమ ముఖ్యం కాదు. నేను ముఖ్యం కాదు. స్వార్థం ముఖ్యం. అది స్పష్టంగా కనిపిస్తోంది. పరస్పరం నిజమైన ప్రేమ, ఒకరికి కొంచం కష్టం కలిగితే, విలవిలలాడే మరొకరి మనసు, జీవితమంతా కలిసి ఉండాలన్న ఆశల పునాది... అదీ పెళ్ళంటే! అంతేకానీ... ఇలాంటి పెళ్ళి కోసం కాదు నేను తహతహలాడింది. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోనక్ఖరలేదు. కాదు నిన్నే నేను చేసుకోను. నిజమైన ప్రేమని గుర్తించటం చాలా కష్టం. చాలా మంది అమ్మాయిలు పొరపడతారు నాలా! ఇంకా అదే పొరపాటుని కంటిన్యూ చెయ్యను. పెళ్ళంటే నీకో ప్రయోజనం. కానీ నాకు జీవితం! ఐయామ్ సారీ! ఓకే... బై!"

# చెదరని చిత్తరువు


## చాగంటి ప్రసాద్

✆ 9000206163


*"అప్పుడు ఏది ప్రేమో, ఏది ఆకర్షణో తేడా తెలిసే వయస్సు కాదు. నువ్వు అందంగా ఉన్నావు. నిన్ను కలవాలి, నీతో మాట్లాడాలి, నీతో తిరగాలి... ఇంతే తెలుసు! అందమైన అమ్మాయి ఇష్టపడుతోందని తెలియగానే, ఎవరెస్టు శిఖరం ఎక్కినంత సంబరంగా ఉంటుంది తప్ప, బాధ్యత అనగానే భయం వేస్తుంది. అందుకనే హఠాత్తుగా, 'పెళ్ళి చేసుకుందామా?' అని నువ్వు అడిగినప్పుడు కంగారొచ్చింది.*

ముంబై మెరైన్ డ్రైవ్‌లో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాలను చూస్తూ కూర్చున్నాను. మహానగరం వచ్చి పాతికేళ్ళు దాటింది. కాలప్రవాహపు వడిలో కొట్టుకుపోయాను. క్షణం తీరికలేని వ్యాపారంలో మునిగిపోయాను. ఇంతలో పక్కన రోడ్డుమీద వాహనాల మీద వెడుతూ "రామలల్లా కీ జై" అంటూ నినదిస్తున్న భక్తుల గొంతులు వినిపించాయి. మా ఊరిలో రామాలయం, ఉత్సవాలు, ఆమెతో గడిపిన క్షణాలు... అన్నీ గుర్తుకువచ్చాయి. వాటిని కలిపి గుదిగుచ్చి, భద్రంగా దాచుకుంటే అది ఒక అపురూప కావ్యమే అవుతుంది!

'ఆపాతమధురాలు' వెంటాడాయి.

★★★

"కొబ్బరివ్యాపారానికి గడ్డురోజులు వచ్చాయిరా! ఈ వ్యాపారాలు ఎప్పుడు, ఎలా ఉంటాయో చెప్పలేకపోతున్నాం" అరుగుమీద పడక్కుర్చీలో కూర్చున్న నాన్న, లంకపుగాకు చుట్టపొగ నెమ్మదిగా వదులుతూ బాధగా మాట్లాడుతున్నాడు.

"అవును బావా! మొన్నొచ్చిన తుఫాను మటుకు పదునైన గండ్రగొడ్డలి మాదిరిగా కొప్పరిసెట్లు తలలను తెగ్గోసేసింది! ఏం తుపాను... ఏం తుపాను! ఎంత నట్టం... ఎంత నట్టం! పుట్టి పొద్దెరిగిన దగ్గర నుంచి ఇంత పెద్ద రాకాసిలాంటి గాలివాన సూడలేదంటే నమ్ము!" భయాన్ని కళ్ళల్లో చూపించాడు మా నాన్న తోటి వ్యాపారస్థుడైన రామం.

అరుగుమీద కూర్చుని డిగ్రీ ఫైనల్ ఇయర్ పుస్తకాలు తిప్పుతూ, అప్పుడప్పుడు రోడ్డుకేసి చూస్తున్నాను. ఇంతలో పరికిణీ అంచులు పైకి పట్టుకుని, రోడ్డుమీద అక్కడక్కడ ఉన్న నీటిగుంటలు దాటుకుంటూ, నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెడుతున్న ఒక మెరుపుతీగలాంటి అమ్మాయి నా కంట్లో పడింది. ఆ అమ్మాయి నాకేసి అప్రయత్నంగా చూసి, తల దించేసుకుంది. కళ్ళు తిప్పుకోలేని అందం ఆమెది. మర్నాడు కాలేజీనుంచి వచ్చాక, ఠంచనుగా అరుగుమీద తిష్ఠ

వేసాను. మా నాన్న పనిమీద ఊరు వెళ్ళాడు. అమ్మ తమ్ముడికి, చెల్లికి అన్నాలు పెట్టే పనిలో ఉంది.

ఆరోజు అదే సమయానికి... ఆ అమ్మాయి మళ్ళీ వస్తుందేమోనన్న ఆశ నన్ను నిలబడనీయడం లేదు. అరుగుమీద పచార్లు చేస్తున్నాను. గంటలు గడిచాయి... ఆమె రాలేదు. సైకిలెక్కి, మా పేట అంతా గాలించడం మొదలుపెట్టాను.

భోగిపండగ వలన పిల్లలకు భోగిపళ్ళు పోయడానికి వెడుతున్న పేరంటాళ్ళ సందడి మొదలైంది. వీధి మధ్యలో బుల్లిబాబు, మిర్చిబజ్జీ బండిలో ఉన్న మూకుడులో వేగిస్తున్న మసాలావడల ఘుమ ఘుమలు, ముక్కుపుటాలను తాకుతున్నాయి. వాటికి టెంప్ట్ అవకుండా, సైకిల్ పెడల్ గట్టిగా తొక్కి, రామం మావయ్య ఇంటి ముందు ఆగాను.

నన్ను చూసిన మావయ్య, "ఏరా ఇలా వచ్చావు? నాన్న ఏదైనా చెప్పమన్నాడా?" అడిగాడు ఆరాగా.

"లేదు మామయ్య! జస్ట్ ఊరికే ఈ వీధిలో ఉన్న మా ఫ్రెండ్‌ని కలుద్దామని వచ్చాను" అంటూ, అక్కడ ఎక్కువసేపు ఉంటే, మరిన్ని ప్రశ్నలతో చంపేస్తాడనుకుని, సైకిల్ తీసుకుని బయలుదేరాను వెతుకులాటకు! ఆమె కనపడలేదు!

కొన్ని రోజులు భారంగా గడిచాయి.



పుస్తకం తెరిచానే గానీ, దృష్టి అక్కడ లేదు. ఇంతలో నాలో ఏదో ఉద్విగ్నత మొదలైంది. మనసంతా ఆక్రమించుకున్న ఆమె, నాకు దగ్గరవుతున్న అనుభూతి కలుగుతోంది. అప్రయత్నంగా తల తిప్పి చూసాను రోడ్డు వైపు. వానచినుకులు పూలరేకుల్లా రాలుతుండగా, దివినుండి భువికి దిగి వచ్చిన దేవకన్యలా నెమ్మదిగా నడుచుకుంటూ వెడుతూ... ఆ నిలువెత్తు అందం కనబడింది.

నా మధురమైన ఆలోచనల ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ, “సర్! కలకత్తా బ్రాంచి ఆఫీసు నుంచి ఫోన్... మీతో మాట్లాడాలిట” అన్నాడు నా పి.యే ఫోన్ పట్టుకుని!

‘కాసేపు ఆగు’ అన్నట్టుగా అతన్ని కళ్ళతో వారించాను. అర్థమైందని తల ఊపి, బ్రాంచి ఆఫీసు వాళ్ళకు సమాధానం చెప్పుకుంటున్నాడు.

మళ్ళీ ఆమె జ్ఞాపకాలు ముసురుకున్నాయి.

ఆ రోజు మళ్ళీ ఆమెను చూడగానే, అరుగు మీద నుంచి ఒక్క దూకు దూకి ఆమె దగ్గరకు వెళ్ళి, “ఏమండీ! ఈ ఊరికి కొత్తగా వచ్చారా? మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదూ” సమాధానం చెప్పకుండా వెళ్ళిపోతుందనే కంగారులో గబగబా అడిగేసాను.

“ఆ... ఆ... అవునండీ, కొత్తగా వచ్చాం. వాన ఎక్కువ అవుతోంది, తడిసిపోతా” కంగారుపడుతూ తన చేతిలో గొడుగు విప్పి పైన వేసుకుని, వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

వానలో తడుస్తూ ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాను. ఆ రోజు ఆ వానజల్లులో తడవడం ఎంతో బావున్నట్టు అనిపించింది. భక్తుడికి హఠాత్తుగా దేవతాదర్శనం అయితే తన అస్తిత్వాన్ని ఎలా మరిచిపోతాడో అలా వుంది నా పరిస్థితి! ట్రాన్స్‌లో ఉన్నట్టుగా నెమ్మదిగా నడుచుకుంటూ, ఇంటికి వచ్చి పడ్డాను.

చూసినది కొద్ది క్షణాలైనా, మరిచిపోలేని ఆమె రూపాన్ని గుండెల్లో నింపేసుకున్నాను. పసిమి మేనిఛాయ, గుండ్రటి మొహం, ఫాలభాగం మీద దోసగింజంత బొట్టు, కాంతివంతమైన విశాలనేత్రాలు, వాటికి విల్లుల్లాంటి కనుబొమ్మలు కాపలా! సింహాచలం సంపెంగను పోలిన నాసిక... ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది. పల్చని ఎర్రని పెదాల మధ్య స్వచ్ఛమైన పలువరుస తళుక్కుమంటోంది. సన్నని నడుము మీద స్వేచ్ఛగా ప్రవహిస్తున్న కృష్ణవేణీ తరంగ పాయలను త్రివేణిగా బంధించి అల్లుకుంది. చందనపు రంగు పరికిణీ, దానిపై ఆకుపచ్చ ఓణీ జాకెట్టు, ఆమె మేనికి అందంగా అమిరాయి. వెరసి ముగ్ధమనోహర రూపం నా గుండెల్లో ప్రతిష్ఠించబడింది. పగలూరేయీ ఆమె ధ్యాసే, ఆమె ధ్యానమే... ఆరుబయట మంచం మీద పడుకుని ఆకాశంకేసి చూస్తే, చుక్కల్లో ఆమె మోము కనిపించి మాయమయ్యేది. అలా ఆమెను పిచ్చిగా ఆరాధించడం మొదలుపెట్టాను.

నా అందమైన ఆలోచనలను భగ్నం చేస్తూ... “ఇంటినుండి పెద్దసారు ఫోన్ సర్” అంటూ పి.యే. నెమ్మదిగా అన్నాడు.

విధిలేక కదిలాను.

★★★

కారులో వెడుతూ మళ్ళీ ఆమె జ్ఞాపకాల వలలో చిక్కుకున్నాను..

ఆరోజు శ్రీరామనవమి! ఊరి మధ్య రాములవారి గుళ్ళో కళ్యాణం జరుగుతోంది. ఆడవాళ్ళు, మగవాళ్ళు విడివిడిగా కూర్చుని సీతారాముల కళ్యాణం చూస్తున్నారు. నా గుండె వేగం ఒక్కసారిగా పెరిగింది.

ఆమె... ఆమె... ఇక్కడే ఎక్కడో ఉందని మనస్సు చెప్తోంది. వెంటనే కళ్లకు పని చెప్పాను. ఆడవాళ్ళ మధ్యలో ముకుళిత హస్తాలతో భక్తిగా దేవుడికి దణ్ణం పెట్టుకుంటూ కనిపించింది. సీతారాముల తలంబ్రాల ఘట్టం వచ్చింది. మధ్యలో వెళ్ళి ఆమెతో మాట్లాడితే, పక్కవాళ్ళ భక్తి పారవశ్యానికి భంగ కలుగుతుందని, ఓపిగ్గా ఉన్నాను. తలంబ్రాలు పూర్తి అయ్యాయి. రాముడే వరం ఇచ్చినట్లుగా కుర్రమేళాన్ని పానకం ప్రసాదం పంచిపెట్టమని పురమాయించారు. వెంటనే గ్లాసులు, పానకం బకెట్ పుచ్చుకుని ఆడజనం మధ్యలోకి దూకాను.

ఆమెకు పానకం గ్లాసు ఇస్తూ, “బావున్నారా?” అడిగాను నవ్వుతూ.

ఎవరా? అని తలెత్తి చూసింది. కళ్ళల్లో భయం కనిపించింది. ఆమె పక్కన ఒక నడివయసామె ఉంది. తన అమ్మ కాబోలు!

సీతారాముల కళ్యాణం పూర్తి అయ్యింది. ప్రసాదాలు పంచిపెడుతున్నారు. దొరికిన అవకాశం వదులుకోలేక, ఆమె దగ్గరకు చేరాను. నా పేరు చెప్పాను. చాలా సేపు బ్రతిమాలాకా, తనపేరు నోటితో చెప్పకుండా, వేదికమీద ఉన్న రాములోరి భార్యను చూపించింది. “సీతా? జానకా?” అడిగాను. తల అడ్డంగా ఊపింది. నేను కనుక్కోవడానికి ప్రయత్నిస్తుండగా, అక్కడనుండి వెళ్లిపోయింది.

మళ్ళీ ఒకరోజు మధ్యాహ్నం కాలవగట్టు దగ్గర చేతిలో క్యారేజీతో బల్లకట్టు మీద కనిపించింది. సైకిలు కాలవొడ్డున ఉన్న కొబ్బరిచెట్టు దగ్గర పడేసి, బల్లకట్టు ఎక్కాను. కాలవ దాటాకా, “ఎవరైనా చూస్తే బావుండదు. వెళ్లిపొండి” భయపడుతూ అటూ ఇటూ చూస్తూ చెప్పింది.

“ఏం ఫర్లేదు. ఈ టైమ్‌లో ఈ పక్కలకు ఎవరూ రారు వైదేహీ!” అన్నాను.

“పేరు తెలుసుకున్నారా మొత్తానికి?” నవ్వుతూ అంది.

వైదేహి తండ్రి ఈ వూళ్ళో ఎవరిదో పొలం కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడని చెప్పింది. హఠాత్తుగా మాటలు ఆపేసి, “పొలం దగ్గరకు వచ్చేసాము. మా నాన్న చూస్తే చంపేస్తారు” అంది.

ఆమె మాటలు పట్టించుకోకుండా, ధైర్యం చేసి చెయ్యి పట్టుకుని “ఒక్క నిముషం ఆగు!” అర్థించాను.

చెయ్యి విడిపించుకుని గబగబా ముందుకు నడిచింది. నిరాశగా వెనుదిరిగాను.

క్రమేపీ పరిచయం బాగా పెరిగింది. రాములవారి గుడి దగ్గర, ఊరిచివరి మర్రిచెట్టు దగ్గర, బల్లకట్టు మీద, ఎక్కడ వీలైతే అక్కడ కలిసేవాళ్ళం.

కొన్నిరోజులు గడిచాకా, ఒకరోజు నేను కాలేజీకి వెళ్ళే అడ్డదారిలో కలిసాం. ఈసారి నేను మాట్లాడడం మొదలు పెట్టేలోపే,

విచిత్రంగా తానే మొదలుపెట్టి, చాలా సేపు గలగలా మాట్లాడింది. తర్వాత కాస్త గ్యాప్ ఇచ్చి "నన్ను ప్రేమిస్తున్నావు కదు శ్రీనూ!" హఠాత్తుగా అడిగింది.

"అవును ఐ లవ్ యు వైదేహీ!" అన్నాను స్టైల్‌గా. ఆమె స్పందన కోసం వేచి చూసాను.

నేను బిత్తరపోయేటట్టు, ఆమె మరో ప్రశ్న నా మీద సంధించింది. "అయితే మనం పెళ్ళిచేసుకుందామా?" అంటూ చెయ్యి పట్టుకుంది.

ఆమె అడిగిన తీరులో స్థిరనిశ్చయం కనబడింది. ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి. గొంతులో తడి ఆరిపోయింది. "ఏం... టి... ఏం..టీ.. అంటున్నావు?" అన్నాను కంగారుగా.

"పెళ్ళి చేసుకుందామా అన్నాను" గొంతు పెంచింది.

"పెళ్ళా... పెళ్ళా... ఇప్పుడా?" బుర్ర గోక్కున్నాను.

"ప్రేమ తర్వాత పెళ్ళేగా చేసుకునేది... ధైర్యం లేదా?" సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

ఏం మాట్లాడాలో తెలియక, "నేను... నేను.. ఇప్పుడే... పెళ్ళి చేసుకోవాలనుకోవడం లేదు వైదేహీ!" నాలుగు ముక్కలు గబగబా అనేసి సైకిలెక్కి వెనక్కి తిరిగి చూడకుండా పెడల్ గట్టిగా తొక్కాను.

"పిరికాడు!" అన్న మాటలో వెక్కిరింత, వెనువెంటనే ఆమె నవ్వు వినబడ్డాయి.

ఎప్పటినుంచో ఉగ్గపెట్టుకున్న తుఫాన్ ఆ రోజే విరుచుకు పడినట్టుగా, మా ఇంటి పరిస్థితి చిన్నాభిన్నం అయిపోయింది. అప్పులిచ్చిన వాళ్ళు కోర్టులో కేసులు వేయడంతో, నాన్న భయపడి మాకున్న ఇల్లు, పొలం, అమ్మ వంటి మీద బంగారం అమ్మేసి అప్పులన్నీ తీర్చేసాడు. అక్కడ ఉండలేక ఊరు వదిలిపెట్టేసాం. చివరిగా వైదేహిని కలిసి ఒక మాట చెప్పాలని అనుకున్నాను. కానీ అవకాశం రాలేదు. అత్యంత విలువైనదేదో పోగొట్టుకున్నాననే బాధ పెల్లుబుకుతుండగా మహానగరంలో అడుగుపెట్టాను.

బొంబాయి డాక్‌యార్డ్‌లో నేనూ నాన్నతో పాటు పనిలో చేరాను. నెమ్మది నెమ్మదిగా నిలదొక్కుకొని, కొత్తకొత్త వ్యాపారాలు మొదలుపెట్టాం. కొబ్బరికాయ వ్యాపారమే గొప్ప బిజినెస్ అనుకునే మాలాంటి నూతిలో కప్పలకి, సంపాదించాలంటే ఎన్నో ఉన్నాయి అని ముంబై చెప్పింది. ఈ రోజు మా కంపెనీకి దేశమంతా బ్రాంచీలు ఉన్నాయి. క్షణం తీరుబడి లేని జీవితం. డబ్బు సంపాదనలో పడిపోయాను. మా ఊరిని మర్చిపోయినా, వైదేహిని మాత్రం మర్చిపోలేదు. తనని చూడాలని ఉన్నా, కాలచక్ర ఇరుసులో ఇరుక్కుపోయి కలవలేకపోయాను. ఇప్పుడైనా తనను కలవకపోతే, ఈ మనసుకి స్వాంతన లేదు, జీవితానికి అర్థం లేదు.

★★★

ఊరు చాలా మారిపోయింది. కాలవ దగ్గర బల్లకట్టు లేదు. కాలవని రోడ్డు మింగేసింది. రోడ్డు పక్కన కారుని ఆపమని చెప్పి, వైదేహి జ్ఞాపకాలు మోసుకెడుతూ, తన అడ్రెస్ కనుక్కుని, ఒక ఇంటిముందు నిలబడ్డాను. "ఏమండీ!" అంటూ పిలిచాను.

ఎన్నో ఏళ్ళ తర్వాత నా వైదేహిని చూడబోతున్నాను. గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఎలా వుందో ? క్షణాలు గంటల్లా గడిచాయి.

అంతలో కళ్ళజోడు సర్దుకుంటూ, పమిటచెంగు సరిచేసుకుంటూ, "ఎవరూ?" అంటూ వచ్చి అరుగు మీద నిలబడింది. ఆమెను చూడగానే నోటమాట రాక, చూస్తూ అలాగే ఉండిపోయాను. ఎంత మారిపోయింది వైదేహి? అసలు వైదేహేనా ఈమె? ఆ అందం అంతా ఏమైపోయింది? కాలం ఎవరినైనా నిర్దాక్షిణ్యంగా లోబర్చుకుంటుంది కదా? శిథిలశిల్పంలా కనబడింది.

"ఎవరండీ మీరు? ఎవరు కావాలి మీకు?" గట్టిగా అడిగింది.

తేరుకుని, "నన్ను గుర్తుపట్టలేదా వైదేహీ? నేనూ..." అంటూ కాలవగట్టు, బల్లగట్టు, రాములవారి గుడి, శ్రీరామనవమి.. అని మొదలుపెట్టగానే, ఆమె కళ్ళల్లో వెలుగు!

"మీరు... నువ్వు... శ్రీను కదూ? ఎంత మారిపోయావూ!" లోపలికి ఆహ్వానించింది.

ఇంట్లో ఎవరూ ఉన్నట్టు లేరు. మంచినీళ్ళిచ్చింది.

"ఇన్నేళ్ళ తర్వాత నేను జ్ఞాపకం వచ్చానా?" ఆశ్చర్యపడుతూ అడిగింది.

వెంటనే, "పుట్టినరోజు శుభాకాంక్షలు వైదేహీ!" అంటూ, గంధంచెక్కతో తయారుచేసిన సీతారాముల బొమ్మ, ప్రతి సంవత్సరం వైదేహికి శుభాకాంక్షలు చెప్తూ వ్రాసి దాచుకున్న గ్రీటింగ్ కార్డ్స్ పొత్తి ఆమె చేతిలో పెట్టాను.

ఆమె నోటమాట రాక చాలా సేపు మౌనంగా వాటికేసి, నాకేసీ చూస్తూ ఉండిపోయింది.

తర్వాత నెమ్మదిగా తేరుకుని, "ఇంకా నా పుట్టినరోజు గుర్తుపెట్టుకున్నావా శ్రీను?" అన్నది. ఆమె కంట్లో కన్నీటిపొర. చీరచెంగుతో కళ్ళు తుడుచుకుని, నెమ్మదిగా మాట్లాడడం మొదలుపెట్టింది. ఇద్దరి మధ్యలో ఎన్నోమాటలు... చివరికి నా మనసులో ఉన్నది చెప్పేలోపు తనే అందుకుని, "ఆ రోజు పెళ్ళిచేసుకోమని ఎందుకు అడిగానో తెలుసా? నా అందం చూసి ఎందరో నా వెనకాల పడేవారు. 'నిజంగా వాళ్ళంతా నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నారా, లేక మరో ఉద్దేశ్యంతో వస్తున్నారా' అని పరీక్షించడానికి పెళ్ళిమాట ఎత్తే దాన్ని! ఆ మాట వినగానే అందరూ పారిపోయేవారు" అంటూ నవ్వింది.

"మొదట్లో నీ మీద కూడా సదభిప్రాయం ఉండేది కాదు. క్రమేపి, నీ ప్రవర్తన చూసి చిన్నగా నమ్మకం మొదలైంది. కానీ నువ్వు కూడా అందరి మగాళ్ళలాగే, పెళ్ళి అనగానే పారిపోయావు. ఆడపిల్ల మనస్సు చాలా సున్నితం శ్రీను! మాకూ ఎన్నో ఆశలు ఉంటాయి. 'తప్పకుండా పెళ్ళి చేసుకుందాం వైదేహీ, కాస్త టైమ్ కావాలి!' అని చెప్పి ఉంటే, నీ కోసం ఎంత కాలమైన వేచి ఉండేదాన్ని! కానీ ఆ చిన్న భరోసా నువ్వు ఇవ్వలేకపోయావు! మీ మగాళ్ళంతా ఇంతే కదా అనుకున్నాను. మా నాన్న ఇక్కడి సంబంధమే చూసి, పెళ్ళి చేసేసాడు" నిట్టూర్చింది.

"అప్పుడు ఏది ప్రేమో, ఏది ఆకర్షణో తేడా తెలిసే వయస్సు కాదు. నువ్వు అందంగా ఉన్నావు. నిన్ను కలవాలి, నీతో మాట్లాడాలి, నీతో తిరగాలి... ఇంతే తెలుసు! అందమైన అమ్మాయి ఇష్టపడుతోందని తెలియగానే, ఎవరెస్టు శిఖరం

ఎక్కినంత సంబరంగా ఉంటుంది తప్ప, బాధ్యత అనగానే భయం వేస్తుంది. అందుకనే హఠాత్తుగా పెళ్ళి చేసుకుందామా అని నువ్వు అడిగినప్పుడు కంగారొచ్చింది. మెదడు మొద్దుబారిపోయింది. ఏం మాట్లాడాలో తెలియలేదు. ఎందుకంటే ఒక షర్ట్ కొనుక్కోవాలన్నా, సినిమాకి వెళ్ళాలన్నా, చివరికి చాక్లెట్ కొనుక్కోవాలన్నా అమ్మానాన్నల మీదే ఆధారపడే వయస్సు. ఒక పక్క ఇంటి పరిస్థితులు కూడా బావుండలేదు. అందుకే ఏం మాట్లాడలేక, నీకు దూరమైపోయాను తప్ప, నేను పిరికివాడిని కాను! ముంబైలో ఎన్నో కష్టాలు చవిచూసిన పరిస్థితుల్లో కూడా... నిన్ను తలుచుకోని క్షణం లేదు. తర్వాత అర్థం అయ్యింది, నాది వ్యామోహం కాదని! అందుకే ఇంతకాలమైనా మనం మొదట కలుసుకున్న నీ పుట్టినరోజునాడే నిన్ను కలవడానికి వచ్చాను!" ఆరాధనగా చూస్తూ చెప్పాను.

"భలే! నా జీవితాంతం గుర్తుపెట్టుకునేలా ఇదో స్వీట్ మెమరీ నాకు ఈ రోజు!" అంటూ పకపకా నవ్వి, వాతావరణం తేలిక చేసింది. "కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం." వంటింట్లోకి వెళ్లింది.

'నా హృదయమంతా ఆక్రమించిన నీ స్థానంలో మరొకర్ని ఊహించుకోలేక, పెళ్ళి అనే ఆలోచన మనసులోకి చొరబడనీయకుండా ఇలాగే ఉండిపోయాను వైదేహీ!' అని చెప్పి ఆమె గుండెల్లో అలజడి లేపడం ఇష్టం లేక, మౌనంగా ఉండిపోయాను.

ఇంతలో ఆమె చేతిలో మొబైల్ మ్రోగింది.

"వచ్చేస్తున్నారా? వచ్చేటప్పుడు శ్రీనుగాడిని స్కూల్ నుండి తీసుకు వచ్చేయండి. రిక్షా అతను ఈ పూట రాడుట" ఫోన్ ఆఫ్ చేసి, "మా వారు వస్తున్నారు, పరిచయం చేస్తాను" అంది.

కాఫీ సిప్ చేస్తూ అతని రాక కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

# యువత కే!

పూడిపెద్ది శేషు శర్మ
✆ +1 (404) 664-0808

*"ఇది యువత కేఫ్ మేడం! కేవలం 18 నుండి 35 సంవత్సరాల వయస్సు వాళ్ళకే ఈ రెస్టారెంట్‌లో భోజనంతో పాటూ, చక్కటి జీవనవిధానం నేర్పిస్తారు. ఈ సెంటర్ యువతీ యువకుల సంక్షేమం కోసం ఆనందరావు సార్ మొదలుబెట్టేరు. ఇందులో చేరాలంటే, మెంబర్‌షిప్ తీసుకోవాలి, కొన్ని నియమాలను పాటించాలి."*

సావిత్రి, ఆనందరావు గుమ్మం దాటి బయటకు వెళ్ళేరో లేదో... "వంటవాడా? నీకు పిచ్చి పట్టిందా" లోపల రగులుతున్న ఆందోళనని ఆపుకోలేక అరిచింది గాయత్రి.

కూతురు అమృత... ఆనందరావుని పెళ్ళిచేసుకోవడం సుతారమూ ఇష్టంలేదు గాయత్రికి, రామారావుకి! రామారావు తలపట్టుకు కూర్చున్నాడు తన వాలుకుర్చీలో. సావిత్రి మాటలు అతని చెవుల్లో మళ్ళీమళ్ళీ రింగవుతున్నాయి.

"మా అబ్బాయి తండ్రి లాగే కష్టజీవి! వంటవాడైనా, మా ఆయన బాగా శ్రమపడ్డారు మా కోసం. పైసాపైసా దాచి, బీచ్ ఒడ్డున ఇప్పుడు మేము ఉంటున్న స్థలాన్ని ఎప్పుడో కొన్నారు. పెద్ద జాగావే! నలుగురికీ ఉపయోగపడేలా దాన్ని వాడమని మరీమరీ చెప్పి చనిపోయేరు ఆయన. వెర్రినాన్న, మావాడికి అప్పుడు పద్దెనిమిది సంవత్సరాలే! వాళ్ళ నాన్న వాడికి ఆదర్శం. ఆయనలాగే నలుగురికి వండడం వాడికి ఇష్టం. చదువుకోరా అంటే, నాన్నలాగే అందరికీ సాయం చేస్తానని వెళ్ళి, ఉస్మానియా యూనివెర్సిటీలో క్యులినరీ సైన్సెస్ చదువుకున్నాడు. వ్యాపార సంబంధమైన విషయాలు కూడా బాగానే నేర్చుకున్నాడు."

గాయత్రి ముఖం మాడిపోవడం గమనించింది సావిత్రి. రామారావుగారి చూపు ఎటో ఉంది.

"మొదట్లో నేనూ ఇష్టపడలేదు. కాని వాడి ఆలోచనా విధానాన్ని, తన చదువును సమాజానికి పనికొచ్చే విధంగా వాడు మలుచుకున్న తీరును చూసి, హర్షించకుండా ఉండలేకపోయేను. చక్కగా జీవితాన్ని తీర్చిదిద్దుకున్నాడు. పదిమందికి సాయం చేస్తాడు. హాయిగా బతుకుతున్నాడు. బాగానే సంపాదించుకుంటున్నాడు. ఎటువంటి దురలవాట్లు లేవు. ఉదయాన్నే లేస్తాడు. సంధ్యావందనం, ధ్యానం అన్నీ చేసుకుంటాడు. రోజంతా కష్టపడి పని చేస్తాడు."

వాళ్ళేమైనా మాట్లాడతారేమోనని ఒక్క క్షణం ఆగింది సావిత్రి. కాని ఆమెకు మౌనమే ఎదురైంది.

"ఈరోజుల్లో పౌరోహిత్యం చేసుకునే అబ్బాయిలకి ఎంత సంపాదన ఉన్నా, ఎవ్వరూ పిల్లని ఇవ్వడానికి ముందుకు రావటంలేదు. కారణం... వారి వృత్తికి లోకంలో అంత గుర్తింపు లేదు. అలాగే మావాడిని కూడా చాలామంది అమ్మాయిలు

ఇష్టపడలేదు. అమృతకి వాడు నచ్చేడు. మావాడు కూడా మొదట్లో కాస్త సంకోచించేడు. ఎంతైనా చదువుకున్న పిల్ల కదా, తారతమ్యతల వల్ల గొడవలు వస్తాయేమోనని! కాని వాడికి కూడా నమ్మకం కుదిరినట్టుంది. ఒకరోజు నాతో సాధకబాధకాలన్నీ, చక్కగా చర్చించి, నా మద్దతు ఉందంటేనే, మీ అమ్మాయితో సరేనన్నాడు. నాకు ముసుగులో గుద్దులాట ఇష్టంలేదు. అందుకే మిమ్మల్ని కలుద్దామని వెంటనే వచ్చాం!" అంది సావిత్రి.

అంతా వింటూ, నిండుకుండలా కూర్చున్నాడు ఆనందరావు.




కూతురు ఎంచి ఎంచి, ఓ బావర్చిని పెళ్ళి చేసుకోవాలని ఎందుకు అనుకుంటుందో, గాయత్రికి అర్థం కావటం లేదు. "పిల్లవాడు చక్కగా వున్నాడు. చూడగానే ఆకర్షించుకునే రూపు, తీరు. చక్కటి తెలుగులో ఎంతో మర్యాదగా మాట్లాడేడు. చాలా గౌరవంగా బతుకుతున్నాడు. తల్లిని బాగా చూసుకుంటున్నాడు." అనుకున్నాడు రామారావు.

"నువ్వేమో డాక్టరువి. నీకు, వాడికి నక్కకి, నాగలోకానికి ఉన్నంత భేదమే... నీకంటే, పదేళ్ళు పెద్ద కూడా! మన కులం కూడా కాదు. ఏమి చూసుకొని వాడి వలలో పడ్డావే తల్లీ?" విరుచుకుపడింది గాయత్రి.

అమృత విజయనగరం మహరాజా మెడికల్ కాలేజీలో చదువు పూర్తి చేసింది. తల్లిదండ్రులు ఎంత ఒత్తిడి పెట్టినా, స్పెషలిస్ట్ అవడానికి ఇష్టపడలేదు. ఒక జనరల్ డాక్టర్ గానే ఉండి, ప్రజలకు ధార్మికంగా, మానవీయమైన వైద్యం చేయాలని ఆమె తపన! తను అనుకున్నట్టే, విశాఖపట్టణంలో క్లినిక్ పెట్టుకుని, తనకు నచ్చినట్టుగా, అతి సాధారణ జీవితం గడుపుతోంది.

అతి పిన్నవయస్సులోనే స్థూలకాయులు ఎంతమందో? ఆరోగ్యకరమైన ఆహారం, క్రమశిక్షణ లేక ఎన్ని కష్టాలకు గురి అవుతున్నారో ఈనాటి యువత. వారిని దారిలో ఎలా పెట్టాలి.. అని బాధపడుతూ ఉంటుంది. మానసికంగా ఎదగలేక,

డిప్రెషన్, ఏంగ్జైటీలతో కుస్తీపడుతూ, బతుకుతున్న యువతీ యువకులకు సమయానుచితంగా సహాయం అందించాలని తన ధ్యేయం! ఈనాటి యువతను బాధిస్తున్న మానసిక, శారీరక రుగ్మతలని అరికట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

తను ఎంచుకున్న మార్గంలో ఎదగాలంటే, సహకరించే మంచివ్యక్తి తోడుగా దొరకాలి. కార్పొరేట్ మెడిసిన్ అనే బలీయ వ్యవస్థలో పడి కొట్టుమిట్టాడుతున్న వైద్య యువకులతో తనకు కుదరదు అనుకుంది.

ఏ సంబంధం వచ్చినా తిరగకొట్టి పంపించేస్తోంది. లక్షలకు లక్షలు కట్టి డాక్టర్ని చేసేరు కూతుర్ని. కాని తాబేలు నడకలా సాగుతోంది ఆమె ఆర్థికవ్యవస్థ. ఆ పిల్లకు అది అర్థం కాదు. ఒక్కగా నొక్క కూతురు. కూతురి తీరు నచ్చకపోయినా, ఎలాగో సర్దుకుపోయేరు రామారావు, గాయత్రి! ఇప్పుడు ఈ సంకటం ఒకటి వచ్చి పడిందని వాపోయేరు.

"ఏంటమ్మా, నువ్వు చుట్టుపక్కల ప్రపంచాన్ని గమనిస్తున్నావా! హైవే మీద వాహనాలలా ఉన్నాయి అందరి బతుకులు. ఈ యువతరం డాక్టర్లు లక్షలు, కోట్లు అప్పుచేసి, సూపెర్ స్పెషలిస్టులైపోయి, ఎంత ఆదాయం రాబట్టుకోవాలి అనే అలోచనలోనే ఉంటున్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌కి బలైపోతున్నారు. నేను వాళ్ళని తప్పు పట్టటంలేదు. మరి చదువుకోసం చేసిన అప్పులు తీర్చాలి, సమాజంలో గొప్పపేరు, స్టేటస్ సంపాదించాలి, పిల్లల్ని లక్షలు కట్టి, గొప్ప స్కూల్స్‌కి పంపాలి కదా! అటువంటి జీవితం ఒక ఊబి అనిపిస్తుంది నాకు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని తీసుకో... పగలూ, రాత్రి పనిచేసి, సమయానికి సరియైన భోజనం లేక, నానా గడ్డి తిని, కిందా మీదా పడుతున్నారు. ఈ మధ్య ఆత్మహత్యలు ఎలా పెరిగిపోతున్నాయో! నేను నిదానంగా ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చేను. మీరిద్దరూ కాస్త శాంతంగా అంతా పరిశీలించి చూడండి. మీకే అర్థం అవుతుంది. మీ కూతురు అవివేకి కాదు. నన్ను హాయిగా బతకమంటారా? లేదా, బాగా డబ్బు సంపాదించమంటారా?" తల్లిదండ్రులని నిలదీసి అడిగింది అమృత.

"నీకు ఆదర్శం పిచ్చి ఎక్కువయింది. నీ మొండితనానికి మేమేం చేయగలం?" అంటూ, విసురుగా తన గదిలోనికి వెళ్ళిపోయింది గాయత్రి. రామారావు కుర్చీలోంచి కదలలేదు.

★★★

ఆరోజు ఆదివారం! వుడా పార్క్ దగ్గర "యువత కే' అని బోర్డ్ ఉన్న బిల్డింగ్‌లో అడుగుబెట్టేరు గాయత్రి, రామారావు. ఎదురుగా గోడమీద "యువత కే' అని హెడ్డింగ్ ఉండి, దాని కింద 'యువత కేఫ్–యువత కేర్: భోజనంతో బాటు జీవనం' అని వ్రాసి ఉంది.

ఎదురుగా రూములో చక్కగా, కుదురుగా ఉన్న ఒక అమ్మాయి, గెస్టుల పేర్లు జాబితాలో వ్రాసుకుంటోంది. కుడిపక్కగా ఉన్న గదిలో ఒక కుర్రవాడు, వచ్చినవారి బరువు తూచి, బ్లడ్ ప్రెషర్ తీస్తున్నాడు. అదే గదిలో ఒక మూలగా ఒకమ్మాయి క్లినిక్ డాక్టర్‌తో మాట్లాడుతోంది. ఎడమపక్క గదిలో ఒక ఇరవైమంది అమ్మాయిలు, అబ్బాయిలు ధ్యానంలో నిమగ్నమై ఉన్నారు. మంచి వేణువాద్యం చల్లగా, హాయిగా కొండగాలి తిరిగినట్టుగా వినిపిస్తోంది.

గాయత్రిని, రామారావుని చూసి ముందు రిజిస్టర్ టేబిల్ దగ్గర కూర్చున్న అమ్మాయి చిరునవ్వుతో అక్కడి విషయాలన్నీ చెప్పింది.

"ఇది యువత కేఫ్ మేడం! కేవలం 18 నుండి 35 సంవత్సరాల వయస్సు వాళ్ళకే ఈ రెస్టారెంట్‌లో భోజనంతో పాటూ, చక్కటి జీవనవిధానం నేర్పిస్తారు. ఈ సెంటర్ యువతీ యువకుల సంక్షేమం కోసం ఆనందరావు సార్ మొదలుబెట్టేరు. ఇందులో చేరాలంటే, మెంబర్‌షిప్ తీసుకోవాలి, కొన్ని నియమాలను పాటించాలి." అంటూ, పక్కన ఉన్న ఒక సొరుగులోంచి తీసి, ఒక బ్రోచర్ని వాళ్ళకి ఇచ్చింది. దగ్గరలో ఉన్న బల్ల మీద కూర్చొని, బ్రోచర్ జాగ్రత్తగా చదివేరు దంపతులిద్దరూ.

"యువత కేఫ్ & యువత కేర్"

(భోజనంతో బాటు జీవనం)

ఇది కేవలం రెస్టారెంట్ మాత్రమే కాదు. ఇక్కడ మీకు పుష్టికరమైన భోజనంతో పాటు, సంజీవని వంటి సౌకర్యాలు కూడా దొరుకుతాయి. మా సంస్థలో చేరండి. మీ అరోగ్యం పెంపొందించుకోండి. మంచి జీవితం నడపండి.

ఇందులో సభ్యులు కావడానికి తెలియాల్సిన వివరాలు:

వయస్సు: 18 సం నుండి – 35 సం వరకు

అడ్మిషన్: 1000 రూపాయలు (ఒక్కసారి మాత్రమే)

నెలవారీ సెంటర్ ఫీజు : 500 రూపాయలు

నెలవారీ భోజనం ఫీజు: 15,000 రూపాయలు ( 60–62 మీల్స్)

ప్రతినెలా కేవలం 60 మందికి మాత్రమే సభ్యత్వం దొరుకుతుంది. (మిగతా వారిని వెయిటింగ్ లిస్ట్‌లో పెడతాము.)

యువత కేఫ్ :

మధ్యాహ్న భోజనం: 11:30 – 1:00 వరకు.

సభ్యులందరూ, చేతులు కడుక్కొని, గ్లాసు నీళ్ళు తాగి, ధ్యానమందిరంలో 10 నిముషాలు ధ్యానం చేసి, అప్పుడు భోజనశాలకి వెళ్ళాలి. భోజనసమయంలో మాట్లాడవద్దు. ధ్యాస తింటున్న పదార్థాల మీద ఉండాలి. భోజనమైన తరువాత, ఒక గ్లాసు నీళ్ళు తాగి, అప్పుడు, 15 నిమిషములు వెనకాల ఉన్న గార్డెన్లో నడవాలి. నడుస్తున్నప్పుడు, నవ్వుకుంటూ, మీ సహసభ్యులతో మాట్లాడుకోండి.

సాయంత్ర భోజనం: 7:00 – 8:30 మధ్య

భోజనానికి ముందు, గ్లాసుడు నీళ్ళు తాగాలి. 10 నిముషాలు ధ్యానం చేయాలి. భోజనం తరువాత గ్లాసుడు నీళ్ళు తాగాలి. 20 నిముషాలు బయట గార్డెన్‌లో నడవాలి.

★ప్రతి రోజూ, అప్పటికప్పుడే వండిన తాజాకూరలతో ఆరోగ్యకరమైన భోజనం దొరుకుతుంది.

అందరికీ వడ్డించే భోజన పదార్థాలు ఒకటే.

యువత కేర్ :

ప్రతి ఆదివారం ఉదయం 11:00 – 12:00 వరకు 15 సభ్యుల బ్లెడ్ ప్రెషర్, బరువు చెక్ చేస్తాము. మీకు ఏమైనా సందేహాలు ఉన్నా, సలహాలు కావాలన్నా, డాక్టర్ ఆదర్శ్‌ని సంప్రదించవచ్చు. ప్రతి సభ్యునికి, నెలకోసారి, బ్లెడ్‌ప్రెషర్, బరువు చెకప్ ఉంటుంది.

మానసిక విషయాలలో సంప్రదించడానికి, వైద్యనిపుణుల వివరాలు ఇవ్వబడును.

సంకోచించకండి, సలహాలు పొందండి, చక్కని జీవితం సాగించండి.

కె. ఆనందరావు, BCA (Bachelor of Catering Technology and Culinary Arts)

ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

యువత కేఫ్ & యువత కేర్

వుడా కాలనీ, విశాఖపట్నం – 53009

బ్రోచర్ చదివి ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు గాయత్రి, రామారావు.

"ఈ కుర్రాడిలో ఎంచడానికి ఏమీలేదు" అన్నాడు రామారావు.

లేచి తిరిగి వెళ్ళడానికి బయలుదేరేరు.

"సార్‌ని కలుస్తారా? కిచెన్‌లో ఉన్నారు. ఈటివీ వాళ్ళు ఇంటర్వ్యూ చేసి ఫిల్మ్ తీస్తున్నారు. అయిపోవచ్చింది. సారంటే అందరికీ ప్రాణం. మీకు చాలా నచ్చుతారు!" ఆ రిసెప్షనిస్ట్ అడిగింది.

అవసరం లేదంటూ, వారిద్దరూ అక్కడ నుండి బయలుదేరేరు.

★★★

అమృత, ఆనందరావుల వివాహం, ఋషికొండ వేంకటేశ్వరస్వామి ఆలయప్రాంగణంలో, ఆర్భాటం లేకుండా, కేవలం దగ్గర బంధువులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా జరిగింది. అందరికీ చక్కటి విందు ఏర్పాటు చేసేడు పెళ్ళికొడుకు.

పెళ్ళయిన తరువాత అమృత ఆదివారాలు, యువత కేర్ క్లినిక్‌లో కౌన్సెలింగ్ చేయడం మొదలు పెట్టింది.

ఆమె జీవితం హాయిగా ఉందని గాయత్రి, రామారావు తృప్తి పడ్డారు.

★★★

లాప్‌టాప్ మూసి, "ఎలా ఉంది నా కథ? ముగింపు బాగుందా అని ఆలోచిస్తున్నా" సునీతని అడిగింది.

నీరజ, "ఎప్పుడూ కలలలోనే నివసించే అమ్మాయిలా ఉంది. నాలాంటి అమ్మాయిలా ప్రాక్టికల్ ఫ్లేవరుతో లేదు డాక్టరమ్మా. ఇది మీ సొంత డబ్బా, ఆత్మకథ అని చెప్పనక్కర్లేదు. మీ స్వగతం అమృత గళంలో తెలిసిపోతోంది. ఇంతకీ హైదరాబాద్ వెళ్తున్నావేంటి?" అంది సునీత.

"ఎందుకూ?" నీరజకి అర్థం కాలేదు.

"ఉస్మానియా యూనివర్సిటీ క్యులినరీ కాలేజీలో వేటకి" పక పక నవ్వింది.

"చిట్టితల్లీ, ఆనందరావులాంటి వాళ్ళు కథలకి మాత్రమే పరిమితం. నిజంగా ఉన్నా మనకి తారసపడరు" అంది సునీత.

"నువ్వు నిరాశావాదివి. టూ బాడ్! ఒక్కక్షణం ఆగు... అప్పుడే ఐదవుతోంది. ఈపాటికి వచ్చేసే ఉంటాడు. అతను చాలా పంక్చ్యువల్!" నీరజ అంటూండగా, డోర్‌బెల్ మోగింది.

"సునీతా, ఇతను మనోహర్. ఈయన ద్వారకానగర్‌లో 'బోడీ అండ్ మైండ్ యూత్ క్లబ్' నడుపుతున్నాడు. అది ఒక రిమార్కబుల్ కమ్యూనిటీ ప్రోజక్ట్. దానిద్వారా యువతలో చైతన్యాన్ని కలిగిస్తున్నాడు. వాళ్ళ జీవితాలే మార్చేస్తున్నాడు."

మౌనంగా చిరునవ్వుతో చేతులు జోడించాడు మనోహర్.

కాస్త పొట్టిగా, చామనఛాయగా ఉన్న అతని ముఖంలో వేయిసూర్యుల వర్చస్సు.

"ఏమిటి సంగతి?" అని నీరజ వైపు చూసింది సునీత.

# అహంకారం

పైడిమర్రి రామకృష్ణ
✆ 9247564699

కథామంజరి బాలకథ

*ఎలుగుబంటికి నమస్కరించి, "నా మిత్రుడు మొసలికి చాలా అనారోగ్యంగా ఉంది" అంది.*
*ఎలుగుబంటి గర్వంగా "మొసలిని స్వయంగా నా దగ్గరకు రమ్మని చెప్పు" అంది.*
*కోతి "మొసలి కదల్లేదు, దయచేసి నువ్వే రా" అని ప్రార్థించింది.*
*కానీ ఎలుగుబంటి అహంకారంతో రాలేదు.*

అనగనగా ఒక వాగు ఒడ్డున ఒక పెద్ద మర్రిచెట్టు ఉండేది. ఆ చెట్టుపైన ఒక చురుకైన కోతి నివసించేది. ఆ చెట్టు క్రింద వాగులో ఒక మొసలి జీవించేది. వీరి మధ్య రోజురోజుకూ స్నేహం బలపడింది.

ప్రతీ ఉదయం కోతి చెట్టు దిగి మొసలితో ముచ్చట్లు ఆడేది. మొసలి కూడా వాగులో నుండి తల బయట పెట్టి ఆనందంగా నవ్వేది. వీరు కలిసి కబుర్లు చెప్పుకుంటూ, పళ్ళు తింటూ కాలం గడిపేవారు.

ఒకరోజు మొసలి చాలా నీరసంగా కనిపించింది.

దాన్ని గమనించిన కోతి ఆందోళనతో, "మిత్రమా, నీకు ఏమైందీ?" అని అడిగింది.

మొసలి నిస్సహాయంగా "నిన్న రాత్రినుంచీ బలహీనంగా ఉన్నాను" అంది.

కోతి వెంటనే చెట్టు మీదికి ఎగిరి, రెండు జామపళ్ళు తెచ్చి ఇచ్చింది. కానీ మొసలి నీరసం పోలేదు. అది గమనించిన కోతి ఒక ఆలోచన చేసింది.

అడవిలో ఉన్న ఎలుగుబంటి మంచివైద్యానికి ప్రసిద్ధి. అది మంచి చికిత్స చేసేదని అడవిజీవులు చెప్పుకునేవి.

కోతి వెంటనే అక్కడికి పరుగెత్తింది.

ఎలుగుబంటికి నమస్కరించి, "నా మిత్రుడు మొసలికి చాలా అనారోగ్యంగా ఉంది" అంది.

ఎలుగుబంటి గర్వంగా "మొసలిని స్వయంగా నా దగ్గరకు రమ్మని చెప్పు" అంది.



కోతి “మొసలి కదల్లేదు, దయచేసి నువ్వే రా” అని ప్రార్థించింది. కానీ ఎలుగుబంటి అహంకారంతో రాలేదు.

నిరాశతో కోతి తిరిగి వాగు వద్దకు వెళ్లి, స్నేహితుడికి అది చెప్పింది.

మొసలి కొద్దిసేపు ఆలోచించి, “సరే, మనమే ఎలాగైనా నడిచి వెళ్దాం” అంది.

మొసలి శక్తినంతా కూడగట్టుకొని, నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ, మూలుగుతూ ఎలుగుబంటి గుహ వద్దకు కోతి వెంట చేరింది. మొసలి రాకతో ఎలుగుబంటి ఆశ్చర్యపోయింది. దానికి తగిన వైద్యం చేసింది.

కొద్దిరోజులకే మొసలి ఆరోగ్యంగా అయిపోయింది. కోతి ఆనందపడింది,

ఒకరోజు వాగు దగ్గర నీటి కోసం, ఎలుగుబంటి తన చిన్నపిల్లతో వచ్చింది. ఆ పిల్ల, వాగులో నీరు తాగుతూ జారి పడిపోయింది.

ఎలుగుబంటి భయపడుతూ, “నా బిడ్డను కాపాడండి!” అని కేక వేసింది.

అది విన్న మొసలి ఎలాంటి ఆలోచన లేకుండా నీటిలోకి దూకింది. అది, తన బలమైన తోకతో పిల్లను పైకి తీసుకువచ్చింది.

ఎలుగుబంటి కృతజ్ఞతతో మొసలిని ఆలింగనం చేసుకుంది.

“నువ్వు నా బిడ్డకు ప్రాణం పోసావు” అంది.

ఆ రోజు నుంచి ఎలుగుబంటి తన అహంకారాన్ని వదిలేసుకుంది. ఎలుగుబంటి మంచిగా మారినందుకు కోతి సంతోషించింది.

# సరైన ఎంపిక

కథామంజరి బాలకథ

## వడ్డేపల్లి వెంకటేశ్

*"రాజా... ఎవరిని పంపాలి అనేది అక్కడ ఉండే పని పైన ఆధారపడి వుంటుంది. ఇలాంటి పనులకు వేగంగా, చురుకుగా వెళ్ళేవాళ్ళు అయితే పని త్వరగా జరుగుతుంది. ఎంపిక సరిగా లేకపోతే, మనం అనుకున్న పని త్వరగా కాదు.*

ఓ అడవికి బుద్ధిసేనుడు అనే సింహం రాజుగా ఉండేది. పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్న చందాన... పేరులో ఉన్న బుద్ధి, సింహానికి అసలు లేదు. తెలివితక్కువ నిర్ణయాలతో అడవిలోని జంతువులను ఇబ్బంది పెట్టేది.

బుద్ధిసేనుడు చేసిన మొదటి తప్పు, మంత్రిగా తాబేలును పెట్టుకోవడమే. అది చెప్పే నిర్ణయాన్నే అమలు చేసేవాడు బుద్ధిసేనుడు.

ఒకరోజు బుద్ధిసేనుడి కొడుకైన కేసరి ఆడుకుంటూ తప్పిపోయాడు. కంగారుపడ్డ బుద్ధిసేనుడు, తాబేలు దగ్గరకు వచ్చి కొడుకును వెతికిపెట్టడంలో సలహా అడిగాడు.

తాబేలు తడుముకోకుండా, "మహారాజా! మీరేం కంగారు పడకండి. సాయంత్రంలోగా నేను వెతికిపెట్టిస్తా" అన్నది.

వెతకడానికి ఓ ఏనుగుని, ఓ దుప్పిని, అలాగే తన కొడుకైన లఘుపాదికను పంపించింది.

పాపం, ఏనుగు భారీకాయంతో నెమ్మదిగా నడుస్తూ, ఆయాసపడుతూ అడవంతా కలియతిరిగింది.

దుప్పి వేగంగా కదిలినా, దాని కొమ్ములు చెట్లకు చిక్కుకుని ముందుకు వెళ్ళడం సాధ్యం కాలేదు.

ఇక తాబేలు సంగతి సరే సరి... పది అడుగుల దూరం కూడా వేయలేక చతికిలపడింది.

సాయంత్రమైనా జాడ దొరకలేదు వాటికి.

దిగాలు పడ్డాడు బుద్ధిసేనుడు.

ఇంతలో ఓ కాకి రివ్వున ఎగురుతూ వచ్చి సింహం దగ్గర వాలింది.

“రాజా! మీరు తాబేలును నమ్మి తప్పు చేశారు. ఇలాగైతే మీ అబ్బాయి ఎప్పటికీ దొరకరు. నన్ను నమ్మి నాకు వెతికే బాధ్యత అప్పగిస్తే గంటలో వెతికి పెడతా!” అన్నది కాకి.

సరేనంది సింహం.

కాకి వెంటనే తన తోటికాకులకు, ఇతర పక్షులకు, కోతులకు బాధ్యత అప్పగించింది. కొన్ని నిమిషాల్లోనే కోతులనుండి కేసరి జాడ దొరికిందంటూ వర్తమానం వచ్చింది.



కానీ కేసరి ఒక లోయలో పడి, సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఒక కోతి చెప్పింది. వెంటనే అప్రమత్తమైన బుద్ధిసేనుడు తన బలగంతో ఆ ప్రాంతానికి వెళ్ళి, కేసరిని రక్షించాడు.

కాకి తెలివికి ఆశ్చర్యపోయాడు బుద్ధిసేనుడు.

“మంత్రికి సాధ్యం కాని పని, నీకెలా సాధ్యం అయ్యింది?” అని అడిగాడు.

“రాజా! ఎవరిని పంపాలనేది అక్కడ ఉండే పని పైన ఆధారపడి వుంటుంది. ఇలాంటి పనులకు వేగంగా, చురుకుగా వెళ్ళేవాళ్ళు అయితే పని త్వరగా జరుగుతుంది. ఎంపిక సరిగా లేకపోతే, మనం అనుకున్న పని త్వరగా కాదు. బరువైన

వస్తువులను మోయడానికి ఏనుగును పంపాలి. చెట్లులేని ప్రాంతాల్లో వేగంగా వెళ్ళడానికి దుప్పులను పంపాలి. అలాగే నీటిలో ఎవరి జాడైనా తెలుసుకోవడానికి తాబేలును పంపాలి. ప్రతీ జంతువు, ఒక్కో శరీరధర్మాన్ని కలిగి ఉంటుంది. వాటి ధర్మాన్ని తెలుసుకుని, పని అప్పచెప్పడమే తెలివైన పని!" అన్నది కాకి.

కాకి తెలివి ఆశ్చర్యపోయాడు బుద్ధిసేనుడు.

తాబేలును నమ్మి ఇన్నాళ్ళూ అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నందుకు బుద్ధిసేనుడు చింతించాడు.

మరుక్షణమే తాబేలును మంత్రి పదవినుండి తొలగించి, కాకిని మంత్రిగా ఎంపిక చేశాడు. తాబేలు తెలివి తక్కువ నిర్ణయాలతో ఇన్నాళ్ళూ ఇబ్బందులు పడ్డ జంతువులన్నీ సంతోషించాయి.

# చెమ్మ

డా. ఎ.యం. అయోధ్యారెడ్డి
✆ 9399962117

**విశిష్ట అతిథి కథ**

*ఆ వ్యక్తి దురుసుతనం, ఆగ్రహం.. తండ్రిని ఇంకొంచెం దగ్గరగా జ్ఞాపకం చేసింది. అతని చేతిని వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. తండ్రి కోపాన్నీ, వ్యసనాలనీ, ఆయన చేసిన అప్పులనీ, తప్పులనీ అన్నిటినీ క్షమించెయ్యాలనుకున్నాడు. ఆ వెంబడే ఆయన్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి, ఒంటరిని చేసిన తన ఘోర తప్పిదాన్ని మన్నించమని వేడుకోవాలని కూడా భావించాడు.*

"రైట్ రైట్" గట్టిగా అరిచి విజిలేశాడు బాలరాజు. బస్సు భారంగా బయల్దేరింది.

స్పీడందుకునే టైములో "అన్నా.. ఓ అన్నా.. బస్సాపు" అని అరుస్తూ ఆడమనిషి పరిగెత్తుకొచ్చింది.

ఆమె వెనుకే రెండు భారీ సంచులు మోసుకొచ్చిన మగమనిషి ఆయాసంతో రొప్పుతున్నాడు.

కసుక్కున బ్రేకు తొక్కి ఆపాడు డ్రైవర్

'ఛూ.. దీనయ్య! ఈ బస్సు డ్రైవరంత బాడుకావ్ నౌకరి ఇంకోటి లేదు' తిట్టుకున్నాడు.

ఆడమనిషి బస్సెక్కింది. మగాయన సంచుల్ని లోపలపెట్టాడు.

"అంత పెద్ద బస్తాలు బస్సు లోపల కుదరదమ్మా... ప్యాసింజర్లకు ఇబ్బంది"

"కుదరదంటే ఎట్లా? వీటిని బయట పారెయ్యమంటావా ఏందీ?" ఆమె గయ్యిమంది.

"పెద్ద లగేజీలు బస్సు టాప్ మీద వేసుకోవాలి!" గట్టిగా అనలేక గొణిగాడు బాలరాజు.

బాలరాజుది ఇదే ప్రైవేటు బస్సులో ఆరేళ్లుగా కండక్టరుగిరి చేస్తున్నాడు. కానీ వందేళ్లయినట్టు భావిస్తాడు. ఎందుకంటే రోజు అదే ప్రయాణం. ఎంతోకాలంగా రిపేర్లు తప్ప, రీప్లేస్మెంట్లు లేని పర్మిట్ బస్సు! అభివృద్ధికి నోచుకోని దూర ప్రాంతం. కంకర తేలిన కచ్చా రోడ్లు. ప్రతి ట్రిప్పూ నరకయానమే!

ఆ రోజు సోమవారం. రద్దీ చాలా ఎక్కువుంది. బస్సులో ఒకవంతు కూర్చొంటే, మూడొంతులు నిలబడ్డారు. గడచిన రెండు రోజులుగా కురిసిన వానలకు రోడ్డంతా బురద గుంటలు! ముసురు ఇంకా పడుతూనే ఉంది. బస్సుపైన చినుకుల శబ్దం లోపలికి వినిపిస్తోంది.

అతుక్కుని నిలబడ్డ జనంలోంచి దారి చేసుకుంటూ బాలరాజు టిక్కెట్లు కొడుతున్నాడు. అంత రష్‌లో టిక్కెట్లివ్వడం చాలా యాతన. పూర్తయ్యేసరికి అరగంట పట్టింది. అలసిపోయాడు. ముందుకు చూస్తే కండక్టరు సీటు ఎవరో కబ్జా చేశారు. సీట్లోంచి లేవమంటే గొడవ. చేసేది లేక.. అందరితో పాటు నిలబడ్డాడు.

కొండ మీంచి దొర్లిన రాయిలా.. ఎగిరెగిరి పడుతూ పోతోంది బస్సు. బాలరాజుకి మొదటి ట్రిప్పు నుంచే విసుగు మొదలవుతుంది.

ఏం చేద్దామని ఊరొదిలి వొచ్చాడు? ఎంత ఆరాటంతో వొచ్చాడు? ఏదో సాధించాలని, ఎత్తుకు ఎదగాలనుకున్నాడు. పల్లె ఇవ్వలేనిది పట్నం ఇస్తుందని ఆశపడ్డాడు. కానీ ఇప్పుడెక్కడున్నాడు?

జల్లెడతో ఇసుక తిప్పినట్టు పెద్ద కుదుపుతో నిలిచిపోయింది బస్సు. ఒకరిమీదొకరు పడ్డారు.



"కండ్లు మూసుకోని నడుపుతున్నవా డ్రైవరూ?" ఎవరో అరిచారు.

"ఏంది సామీ, ఇట్లా మాటి మాటికి బస్సు ఆగితే.. ఈ రోజు ఇంటికి చేరుకునేదున్నదా లేదా?"

"డొక్కు బస్సు... డొక్కు రోడ్డు. దిక్కులేక ఎక్కినం.. థూ.."

డ్రైవరు ఎంత తొక్కినా ఇంజను లాగలేదు. వెనుక చక్రం బురదలో దిగబడ్డది.

"అందరూ దిగండి.. బస్సు తొయ్యాలె" గట్టిగా అన్నాడు.

చేసేదేం లేక.. అంతా బస్సు దిగి వెనుక నుంచి తొయ్యటం మొదలుపెట్టారు. మొత్తానికి బురదలోంచి చక్రం పైకి లేచి బస్సు తిరిగి బయల్దేరింది.

బాలరాజు కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు. ఎటు చూసినా పచ్చటి వరి పొలాలు. మొక్కజొన్న చేన్లు. కదిలిపోతున్న చెట్లలాగే, అతని ఆలోచనలు వెనక్కి పరుగులు తీశాయి.

నాన్న గుర్తొచ్చాడు. ఆరేళ్లుగా తాను చూడని నాన్న.. ఎలా ఉన్నాడో తెలియని నాన్న!

"పట్నం వద్దురా కొడుకా..! అక్కడ నువ్వనుకున్నంత బాగా ఏమీ ఉండదు. ఎదురుదెబ్బలు తింటవు. మీ అన్నయ్య ఇట్లానే చేశాడు. నామీదున్న కోపంతో ఇల్లు వొదిలి పోయాడు. ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో తెలియదు. ఇప్పుడు నువ్వు కూడా వెళ్లిపోతే, ఒంటరి ముసలోన్ని నేనెట్లరా బతికేది? నువ్వే ఆలోచించు?" ఎంతో నచ్చజెప్పాడు.. బీడీ తాగుతూ, మందు మత్తులో కూడా కొడుకు క్షేమం కోరుతూ! తను వినలేదు. ఆయనతో వాదించి గొడవ పెట్టుకొని వచ్చేశాడు.

పట్నంలో కొలువులకు కొదవేం ఉండదని నమ్మాడు. కానీ నమ్మకం నీరుగారడానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

ముందు పొట్ట నింపుకోవడమే గగనమైంది. గత్యంతరం లేక గుళ్ళలో ప్రసాదాలు, అన్నదానాలతో కొంతవరకు ఆకలి చల్లార్చుకున్నాడు. దొరికిన చిన్నచిన్న పనులన్నీ చేశాడు. హోటళ్లలో సర్వరుగా, లారీల్లో క్లీనరుగా, కొంతకాలం సులభ్ కాంప్లెక్సులో చేశాడు. రోజంతా ఒకేచోట కూర్చొని మూత్రానికి ఇంత.. రెండుకు పోతే ఇంత అని చిల్లర వసూలు చేయడం, వాటికి లెక్కలు రాయడం... విసిగిపోయాడు!

ఏదో ఊరు రావడంతో డ్రైవర్ బస్సు ఆపాడు.

కొత్తగా ఎక్కిన ప్రయాణీకులెవరో అడిగి, వాళ్ళకు టిక్కెట్లు కొడుతుంటే.. బాలరాజుకు విసుగు మరో మెట్టు ఎక్కింది.

"టికెట్.. టికెట్.. ఇంకా టికెట్ తీసుకోనివాళ్లు ఎవరన్నా ఉన్నారా?" అడుగుతుంటే అతని చూపులు ఎడమవైపు రెండో సీట్లో కూర్చునున్న ఇద్దరు అమ్మాయిల మీద పడ్డాయి.

అందంగా ఉన్నారు. ఖరీదైన డ్రస్సుల్లో మెరిసిపోతున్నారు. ఇంత ఫ్యాషన్ పోరీలు ఈ డొక్కు బస్సు ఎందుకు ఎక్కినట్టు? వాళ్ళకు చాలా సమీపంలో నిలబడి ఏదో ప్రయోజనం లేని సంతృప్తి ఫీలయ్యాడు. అందమైన అమ్మాయిలకు ముందున్న

సీట్లో ఒక నల్లటి యువతి... వడలిపోయిన ముఖం. పొడిబారిన చర్మం. బక్కపల్చని శరీరం. పనులవల్లో, లేక కష్టాలవల్లో బాగా అలసినట్టుంది. కట్టుబొట్టు చూస్తే గిరిజన మహిళ అనిపిస్తుంది. అందగత్తెలు ఇద్దరూ చిన్నగ మాట్లాడుకుంటున్నారు.

"సెలవులకు ఊరొచ్చి తప్పుచేశామే. ఏ గోవాకో పోవాల్సింది!"

"అవునే.. ఈ గ్రామాల బతుకులు ఎప్పుడు బాగుపడతాయో అర్థం కాదు!"

"ఆ నల్లటి స్త్రీని చూడు, ఏదో అడవి నుంచి పారిపోయి వచ్చినట్టుంది!"

"అబ్బా... ఎంత నలుపో! నన్ను గనుక దేవుడు అట్లా వికారంగా పుట్టించి వుంటే, ఆ దిగులుతో ఎప్పుడో చచ్చి వుండేదాన్ని!"

వింటున్న బాలరాజుకు ఒళ్ళు మండింది. ఇంత పొగరేమిటి వీళ్ళకు అనిపించింది.

ఇంతలో ఏదో స్టాపులో బస్సు ఆగింది. చంకలో పిల్లవాడు, చేతిలో పెద్ద సంచితో నడివయసు స్త్రీ ఒకామె అవస్థపడుతూ ఎక్కింది. ఆమె నిండు గర్భిణి. వెనుక నుంచి ఎవరో అన్నారు.. "కడుపుతో ఉన్న మనిషి.. ఇంత రద్దీ వున్న బస్సెక్కడం ఎందుకు? మరో బస్సులో రావొచ్చుగదా!"

బాలరాజుకు ఆ మాట నిజమే అనిపించింది. తనేం చేయగలడు? ఎక్కేవాళ్లను ఆపడం కుదరదు కదా.

గర్భిణీ స్త్రీ తమకు దగ్గరగా వొచ్చి నిల్చోవడం అందగత్తెలకు నచ్చలేదు. ఆమె కట్టిన చీర మురికిగా వుంది. చంకలో పిల్లోడి ఒంటిమీద బట్టల్లేవు. చూస్తుంటే ఏదో జబ్బుపడి, ఇప్పుడిప్పుడే కోలుకున్నట్టు కనిపిస్తోంది. బస్సు ఎగిరినప్పుడల్లా, నిల్చునున్న ఆమె అవస్థ దయనీయంగా ఉంది. సీట్లలో ఉన్నవాళ్ళు నీ ఖర్మ అన్నట్టు చూస్తున్నారు.

ఆ స్థితిలో నల్లటామె చటుక్కున తన సీటులోంచి లేచింది. "ఓ అక్కా, నేను నిలుచుంటా, నువ్వొచ్చి కూర్చో ఇక్కడ!" అని పిలిచి కూర్చోబెట్టింది.

బాలరాజు తల తిప్పి ఒకమారు బస్సు అంతా పరిశీలనగా చూశాడు. ఎప్పట్లాగే ఏ కొత్తదనమూ లేదు. అదే మనుషులు, అదే తీరు. తనదీ అదే డ్యూటీ... అదే బతుకు.

రాక్షసుడెవరో అడ్డుకున్నట్టు మళ్లా ఆగింది బస్సు. ఈసారి ఇంజన్ ట్రబుల్.

"అందరూ దిగి తొయ్యండి" డ్రైవరు నోట అదేమాట. జనం శాపనార్థాలు పెడుతూ దిగారు. అట్లా వంద గజాలు తోశాక స్టార్టయింది.

"ఎక్కండి...ఎక్కండి" అలవాటుగా అరిచాడు బాలరాజు.

దారి పొడవునా ఇట్లా ఎన్నిసార్లు జరుగుతుందో ఎవరికీ తెలియదు.

"లత్కోరు బస్సు.. దిక్కులేక ఎక్కినం. దయ్యాలు తిరిగే యాళకు గానీ ఇల్లు చేరం!"

"అవును... నిజమే. నడిరాత్రి పన్నెండు గ్యారంటీ!"

"చూస్తుంటే అట్లనే ఉంది. ఏంచేస్తాం... ఈ రూట్లో ఉన్నది ఒక్కటే బస్సు!"

"ఇక్కడ దిగేటోళ్ళు ఇంకెవరైనా ఉన్నరా?" కండక్టర్ అరిచాడు. ఎవరూ లేకపోవడం చూసి "రైట్ రైట్ పోనీయ్" అన్నాడు.

డ్రైవరు బస్సు పోనిచ్చాడు.

బాలరాజుకు చాలాసార్లు డ్రైవరును చూస్తే ఆశ్చర్యమేస్తుంటుంది. అతనికి అంత ఓపిక ఎట్లా వస్తుందా అని అనుకుంటాడు. డ్రైవరుకు అరవైఅయిదు దాటి వుంటయి. ముప్పయేళ్ళుగా ఇదే నౌకరీ! తన పాతకాలం కళ్లద్దాల్లోంచి, డేగలా ముందుకు చూస్తూ స్టీరింగ్ తిప్పుతాడు. వాస్తవంగా ఆ వయసులో డ్రైవింగ్ చేయకూడదు. వృద్ధునిగా అంత కష్టపడాల్సిన అవసరం ఏమిటో తెలియదు. కానీ డ్రైవింగే అతన్ని జీవంతో ఉంచుతున్నదేమో కూడా తెలియదు.

డ్రైవరు వైపే ఆసక్తిగా చూస్తున్న బాలరాజుకి ఇల్లు గుర్తొచ్చింది. చనిపోయిన అమ్మ, ఉదాసీనంగా మారిన నాన్న, ఇంట్లోంచి పారిపోయిన అన్నయ్య, వాళ్ళతో ఆనందంగా గడిపిన రోజులు.. మదిలో మెదిలినవి.

తల్లి క్యాన్సరుతో పోవడం, ఆమెను విపరీతంగా ప్రేమించిన తండ్రి హఠాత్తుగా ఒంటరయ్యాడు. పని చేయడం మానేసి.. తాగుడు, బీడీలకు దాసుడయ్యాడు. ఎప్పుడూ మత్తులోనే ఉండేవాడు. అమ్మ వైద్యానికి ఇల్లు గుల్లయింది. తర్వాత తన వ్యసనాలకి ఊరు నిండా అప్పులు చేశాడు. భార్యను పోగొట్టుకున్న వేదన కోపంగా మారి, అదంతా కొడుకుల మీద చూపించాడు. అన్నయ్య దాదాపు తిరగబడి ఇంట్లోంచి వెళ్ళిపోయాడు.

అన్నదమ్ములు ఇద్దరికి పెద్దగా చదువులూ, డిగ్రీలేమీ లేవు. తనైన ఇంటరు గట్టెక్కిండు. అన్నకు అది కూడా లేదు. అతడు మస్కట్ పోయాడని ఊర్లో చెప్పుకున్నారు. అన్నయ్య స్నేహితులు కూడా అదే అన్నారు. తను కూడా ఏదైనా మంచి ఉద్యోగంలో చేరి, డబ్బులు సంపాదించాలి అనిపించింది. డబ్బుంటే నాన్న, తనూ బాగా బతుకొచ్చనుకున్నాడు. పల్లెలో ఉంటే, అది సాధ్యం కాదని.. పట్నం వలస పోవాలనుకున్నాడు. తండ్రికి తోడుగా ఉండాల్సింది పోయి, ఆయన మాటల్ని లెక్కచెయ్యక రైలెక్కేశాడు.

నాన్న ఇప్పుడెలా ఉన్నాడో? ఒంటరిగా వదిలేసి నిర్దాక్షిణ్యంగా వచ్చేశాడు. ఇన్నేళ్లలో కనీసం ఒక్కసారి కూడా వెనుదిరిగి చూడలేదు. ఎంతకాలమైంది..? ఆరోగ్యం ఎలా ఉందో? తను ఇల్లు వొదిలే నాటికే ఆయన ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. ఊర్లో అప్పులవాళ్ళ బాధ పడలేక, ఉన్న కొంపను వాళ్ళ స్వాధీనం చేసి, ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్టు కొద్దిరోజుల క్రితం పాత మిత్రుడొకడు కనబడి చెప్పాడు. అప్పట్నించి ప్రతిక్షణం మనసుని ముల్లుతో గుచ్చుతున్న క్షోభ. మనసు నిలకడ లేదు. ఆయన ఇప్పుడెక్కడున్నాడో, అనారోగ్యం వల్ల అసలు బతికున్నాడో లేదో తెలియదు.

ఇక్కడ పట్నంలో ఉరుకులు పరుగుల జనప్రవాహంలో నీటిచుక్కలాంటిది తన ఉనికైనా.. ఉద్యోగమైనా! ప్రయాణికులకు తనదో అస్తిత్వం లేని ఆకారం. తను మనిషి నుంచి మరో మనిషికి కదులుతూ టిక్కెట్లు తీసుకునే ఒక యంత్రం. బస్సు దిగిపోతే ఎవరూ గుర్తుపెట్టుకోరు. తనిప్పుడు నలభైకి దగ్గర్లో ఉన్నాడు. ఎవరూలేని ఒంటరి. ఇంకా పెళ్ళికాలేదు. అవుతుందన్న నమ్మకం లేదు.

బస్సు కంకర రోడ్డును దాటి డాంబర్ రోడ్డు ఎక్కింది. మునుపటి కంటే కొంచెం వేగం అందుకుంది. వానలు వరదలకు సింగిల్ రోడ్డు కుంచించుకుని మరింత తగ్గింది. ఎదురుగా వచ్చే వాహనాలకు జాగ్రత్తగా సైడిస్తూ, పరీక్ష రాస్తున్న విద్యార్థిలా నడుపుతున్నాడు డ్రైవరు.

“ఓ డ్రైవరన్నా.. బస్సు డాంబరు రోడ్డెక్కినా ఇంకా ఎడ్లబండి తీరేనా? ఇట్లయితే ఎప్పుడు చేరుతాం? తొక్కు తొక్కు... స్పీడు పెంచు” వెనుక నుంచి ఒక మందుబాబు గట్టిగా అరుపు.

‘ఈ ట్రిప్పు చాలా లేటైంది. ఐదుకల్లా పట్నంలో ఉండాల్సింది’ అనుకున్నాడు బాలరాజు.

బస్సులోకి ఒక యువజంట ఎక్కింది. వాళ్లు కొత్త దంపతులో, ప్రేమికులో చెప్పటం కష్టం. కూర్చొనే చోటులేక నిల్చున్నారు. ఒకరినొకరు హత్తుకున్నట్టు నిలబడి చిన్నగా ఊసులాడుతున్నారు. వాళ్ళ ఆనందం ఎందుకో తెలియదు గాని.. బాలరాజుకు ఇబ్బంది అనిపించింది. పాతరోజుల్ని తలుచుకున్నాడు. ప్రస్తుత తన స్థితిని, రెక్కలు కత్తిరించబడిన బతుకులో.. యువకుడిగానే వృద్ధుడైన వైనాన్ని గుర్తు చేశారు. వాళ్ళను అసూయతో చూస్తూ నిట్టూర్చాడు.

డ్రైవరుని రిక్వెస్టు చేసి, బస్సు ఆపుకొని వాళ్ళిద్దరూ ఓ సినిమా థియేటరు ముందు దిగిపోయారు. థియేటర్లో నెల క్రితం రిలీజైన సినిమా ఆడుతోంది. జనమెవరూ ఉండరు. ప్రేమికులకు చక్కటి మజిలీ. ఒక మూల కూర్చొని, సినిమా మీద ధ్యాస లేకుండా వాళ్ళేం చేస్తారో బాలరాజు సిగ్గు లేకుండా ఊహించుకున్నాడు. అంతటితో ఆగక, ఆ యువకుని స్థానంలో తనను మార్పిడి చేసుకొని కొద్ది సేపు ఆనందంలో తేలిపోయాడు. ఆ అమ్మాయి గారాబంగా తన భుజాలపైకి వాలిపోయి, మత్తు గొలిపేలా గుసగుసలాడుతుంది. తను మైమరిచి పట్టరాని మోహంతో ఆమె బుగ్గ మీదా పెదాలపైనా ముద్దులు పెట్టుకుంటాడు.

బాలరాజు నెగెటివ్ సెన్స్.. అసలా యువజంట ప్రేమికులే కారని అనుమానించింది. ఒకవేళ వాళ్ళు భార్యాభర్తలై ఉంటే.. అందరూ చూసేలా పైకి ప్రేమ నటిస్తున్నారని తలపోసింది. ఏకాంతంలో ఉన్నప్పుడు వాళ్లు పిల్లుల మాదిరో, కుక్కల మాదిరో పోట్లాడుకుంటారని, ఎంతమాత్రం అన్యోన్యంగా ఉండబోరని ఊహించుకున్నాడు. అంతటితో అతడి ఇగో సంతృప్తి చెందింది!

బస్సు మళ్ళీ నిలిచిపోయింది.

“ఇంజను ఆపితే తిరిగి స్టార్ట్ కాదని తెలిసి కూడా ఎందుకు ఆఫ్ చేశావయ్యా?” ఒక విద్యార్థి డ్రైవరు మీద విసుక్కున్నాడు.

“ముందు రైల్వే లెవల్ క్రాసింగ్ ఉంది. రైలు పోయేదాక ఆగాలి. ఇక్కడ సిగ్నల్ సిస్టమ్ లేదు. మనమే జాగ్రత్తగా ఉండాలి!”

“ఏహే... ఏమీ కాదు పోనీయ్! అవన్నీ పట్టించుకుంటే ఎట్లా.. బస్సును స్పీడుగా పోనీ!”

“కుదరదు, అది ప్రమాదం. రైలొచ్చిందంటే అందరం పోతాం. నేను నా డ్యూటీ చేస్తున్నా!” డ్రైవరు సర్ది చెప్పాడు.

ఏదో ఉద్యమంలో కొందరు నిరసనకారులు ఇక్కడి సిగ్నలింగ్ వ్యవస్థను ధ్వంసం చేశారు. దాన్ని ఇప్పటికి ఇంకా పునరుద్ధరించలేదు. గత కొద్ది రోజులుగా డ్రైవర్లు ఎవరైనా అక్కడ తమ కళ్లు, చెవుల మీదే ఆధారపడాల్సి వస్తోంది.

ఎవరైనా వెళ్లి రైలు వచ్చేదీ, రానిదీ చూసొచ్చి చెప్పాలి. కనుచూపు మేరలో రైలు లేదంటే అప్పుడు వాహనం ముందుకెళుతుంది. లేదంటే రైలు క్రాసింగ్ దాటి పోయాకే బస్సు కదిలేది! బాలరాజు చూసొచ్చి పోనివ్వమని చెప్పాడు. బస్సు కదిలింది.

ముందుసీట్లో ఒకావిడ అప్పుడే ఏదో ప్రమాదం జరుగబోతున్నట్టు ఆందోళనగా చూస్తోంది.

సెల్‌ఫోన్లో మాట్లాడుతున్న ఒక విద్యార్థికి, కంగారులో దగ్గుతెర వచ్చింది.

ఇదేం పట్టించుకోని ఇద్దరు యువకులు.. పాకిస్థాన్‌తో నిన్న జరిగిన క్రికెట్ మ్యాచులో ఇండియా ఓడిపోవడంపై చర్చించుకుంటున్నారు.

బస్సులో అన్నిరకాల వాళ్ళున్నారు. వారాంతం ఇంటికొచ్చి తిరిగివెళ్ళే ఉద్యోగులూ, విద్యార్థులున్నారు. రోజువారీ చిన్నచిన్న వ్యాపారులున్నారు. రియలెస్టేట్ దందా చేసేవాళ్ళూ, ఇతర పైరవికార్లు ఉన్నారు. వెనకాల కొందరు తాగుబోతులు కూడ ఉన్నారు.

బస్సు క్రాసింగ్ దాటిపోయాక, హఠాత్తుగా ఒకవ్యక్తి తూలుతూ రోడ్డు నడుమకొచ్చి, ఆపమని చేతులూపాడు.

సడెన్ బ్రేకు వేసి ఆపుతూ, డ్రైవరు బూతుల పురాణం విప్పాడు. ఆ వ్యక్తి తాపీగా వచ్చి సొంత కారో, విమానమో అన్నంత దర్జాగా ఎక్కాడు. అతనితో పాటే మద్యం వాసన గుప్పుమంది. లోపలికి చూసి తనకు సీటు లేనందుకు చిరాకుపడ్డాడు. కిక్కిరిసిన జనాన్ని ఇంగ్లీషు మాటల్లో తిట్టాడు. తను కూర్చునేందుకు సీటు లేకపోవడం కండక్టరుదే తప్పు అన్నట్టు బాలరాజుపై విసుక్కున్నాడు.

బ్యాలెన్స్ నిలుపుకుంటూ, నిలబడేందుకు తంటాలు పడ్డాడు. బక్కపల్చగా, ఒంట్లో కండలేక అస్థిపంజరానికి ఒక మెట్టు పైనున్నాడు. తడిసిన కొబ్బరి పీచులా చిందరవందరైన తెల్లటి జుట్టు. మాసిన గడ్డం. పంటచేలో దిష్టిబొమ్మకు తొడిగినట్టు బాగా లూజైన బట్టలు, పైన అడ్డదిడ్డంగా వేసుకున్న ఎర్రరంగు స్వెటర్!

అతనికి టికెట్ తీసుకోవాలనే సంగతే మర్చిపోయి ఆశ్చర్యంగా చూస్తున్నాడు బాలరాజు.

పట్టరాని సంబరం కలిగింది. ఎవరితను? ఇది నిజమేనా? ఈ వయసులో, ఈ బట్టల్లో నాన్న అచ్చం ఇట్లానే ఉంటాడనిపించింది. సాక్షాత్తూ తండ్రే బస్సు ఎక్కినట్టు భావించాడు. ఎంతోకాలం తర్వాత తండ్రిని చూశానన్న ఆనందంతో మైమరిచాడు. ఆ వృద్ధుని దగ్గరగా వెళ్ళాడు. కండక్టర్ తన వద్దకు రావడం చూసి, ముఖం చిట్లిస్తూ "నేను టిక్కెట్ తీసుకోను. ఇంత అవస్థ పడుతూ నిలబడ్డాను. దీనికి టికెట్ ఎందుకు కొనాలి... నేను కొనను!" బొంగురు గొంతుతో తడబడుతూ అన్నాడు. అతని మాటల వెంటే మద్యం, సిగరెట్ కంపు కలగలిసి దూసుకొచ్చింది.

'లేదు, తను భ్రమ పడటంలేదు. ఈయన మా నాన్నే! ఆ ముఖం, బక్కపల్చటి దేహం, ఎర్రబడ్డ కళ్ళు, ఇప్పుడు మరింత లోపలికి పోయాయి. ఒకప్పుడు కష్టం చేసి... అమ్మ చనిపోయాక వ్యసనాలకు సహకరించిన ముడతలు పడ్డ చేతులు'

చాలారోజులుగా అస్పష్టమైన తండ్రి ముఖం బాలరాజుకు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఆవ్యక్తి లోతైన చూపుల వెనుక అమ్మ ముఖాన్ని, అన్నయ్య ముఖాన్ని కూడా చూడగలిగాడు. చిన్న పెంకుటిల్లు. వాకిట్లో రావిచెట్టు. దాని మీద ఎప్పుడూ

అరుస్తుండే కాకులు. పక్కనే బోరుపంపు. దాని ఆర్తనాదాల నడుమ బిందె నిండుతున్న నీళ్ల చప్పుడు. చుట్టూ గాలికి ఊయలలూగుతూ సంగీతం పలికే వరిపొలాలు. కోట గోడలు కట్టినట్టు చెరకు తోటలు. సేద్యం పనులు చేస్తూ కూలీలు పాడుకునే పాటలు.. మెల్లగా తనకు స్పష్టమయ్యాయి.

బాలరాజులో ఉద్వేగం కట్టలు తెంచుకుంది. ఆ వృద్ధునికి అతి దగ్గరగా వెళ్ళి ఆనుకొని నిలబడ్డాడు.

అతని ఆంతరంగం 'నాన్నా.. ఎలా ఉన్నావు నాన్నా' అని తండ్రిని పలుకరిస్తోంది. కళ్లలోంచి నీళ్లు ఉబికి వస్తున్నాయి. కన్నీటి తెరల్లోంచి ఒకమారు బస్సులో ప్రయాణికుల్ని చూసి సంతోషంగా నవ్వాడు.

అప్పటి వరకూ ఎంతో చిరాకు పుట్టించిన బస్సు, దాని టాప్ మీద చిటపటరాలే చినుకుల చప్పుడు, మాటి మాటికి మొరాయించే ఇంజను మొండితనం, లోపల ప్రయాణికుల బిగ్గరగా మాటలు, అరుపులు, పిల్లల ఏడుపులు ఇప్పుడు బాలరాజుకు శ్రావణానందం కలిగిస్తూ గొప్ప అనుభూతుల్ని నింపుతున్నాయి.

స్పీడుబ్రేకర్ అడ్డుపడి పెద్దగా కుదుపు!

బస్సులో నించున్నవారు ఒకరిపైన ఒకరు పడ్డారు. బాలరాజు ఊహల్లో దృశ్యాలు ఒక్కసారిగా అదృశ్యమైపోయాయి. తండ్రిగా భావించిన ఆ వృద్ధుడ్ని పడిపోకుండా పట్టుకున్నాడు.

అతడు బాలరాజుని విసురుగా తోసేశాడు. "ఏయ్... అలా మీద పడకు, కండక్టరువి.. ఆ మాత్రం నించోలేవా?' అన్నాడు.

ఆ వ్యక్తి దురుసుతనం, ఆగ్రహం.. తండ్రిని ఇంకొంచెం దగ్గరగా జ్ఞాపకం చేసింది. అతని చేతిని వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. తండ్రి కోపాన్నీ, వ్యసనాలనీ, ఆయన చేసిన అప్పులనీ, తప్పులనీ అన్నిటినీ క్షమించెయ్యాలనుకున్నాడు. ఆ వెంబడే ఆయన్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి, ఒంటరిని చేసిన తన ఘోర తప్పిదాన్ని మన్నించమని వేడుకోవాలని కూడా భావించాడు.

బాలరాజు చేతిని విడిపించుకొని, ఆ వృద్ధుడు డ్రైవరును కేకేసి ఓచోట బస్సు ఆపించుకొని దిగిపోయాడు. వెళ్లిపోతున్న అతని వైపే చూస్తూ గుండె గొంతుకలో కదులుతుంటే "నాన్నా" అని పిలిచాడు. మాట పెదాలు దాటలేదు. బదులుగా దుఃఖం పొర్లుకొచ్చింది. కళ్లలోంచి నీళ్ళు కారుతున్నాయి. అతడు నిలబడ్డ చోట పడివున్న బ్యాగు కనిపించింది. అందుకొని జిప్ తెరిచాడు. ఏవో మందు గోళీలు, రెండు సిగరెట్ డబ్బాలు, సగం ఖాళీ చేసిన మద్యం బాటిల్, దాంతో పాటు డాక్టరు రాసిన ప్రిస్క్రిప్షన్లు కనిపించాయి.

బాలరాజుకి కళ్ళెదుట మళ్లీ తండ్రి సాక్షాత్కరించాడు.

బ్యాగులోని మద్యం, సిగరెట్ ప్యాకెట్లు నాన్న వ్యసనాల గుర్తులైతే.. మరి మెడిసన్స్ ఎందుకు? ఆ మందులు ఊపిరితిత్తులు పాడైనవాళ్ళు వాడేవి అయివుంటాయని తెలియక పోయినా ఊహించుకున్నాడు.

ఆ వృద్ధుడు బస్సులో ఉన్నంత సేపు ఆయాసపడటం గుర్తొచ్చింది. చీప్ లిక్కర్లు తాగి, బీడీలు కాల్చి లివరుని, ఊపిరితిత్తుల్ని పాడుచేసుకున్న నాన్న రూపం నడిచిపోతున్నట్టు అనిపించింది.

డ్రైవరుతో ఆగమని చెప్పకుండానే బస్సులోంచి దూకేసి వేగంగా వెనక్కి పరిగెత్తాడు. మందులు పోగొట్టుకున్న అతని అవసరం గురించి కంగారుపడుతూ చుట్టుపక్కల వెతికాడు. ఎక్కడా అతడు కనిపించలేదు. నిరాశతో తిరిగొచ్చి బస్సు ఎక్కాడు. దుఃఖంతో తన కళ్ళు వర్షించడం ఆవేదనలో బాలరాజు గ్రహించలేదు.

అమ్మ చనిపోయాక తండ్రి అనుభవించిన బాధ తన బాధ కంటే ఎన్నో రెట్లు తీవ్రమైందనిపించింది. తను పట్నవాసంలో తప్పిపోతే, నాన్న ఒంటరి ఆవేదనలో తప్పిపోయాడు. పట్నంలో తన వయసిప్పుడు ఏడేళ్ళు. మరో ఏడేళ్ళు గడిచిపోయాక కూడా సాధించింది ఏమీ ఉండకపోవచ్చు. కానీ పోగొట్టుకున్న తండ్రి కోసం, ఆయన ఉనికి కోసం, ప్రేమకోసం తన మనసు ప్రతిక్షణం ఆరాటపడుతూనే ఉంటది. అమ్మని ఆట పట్టించిన రోజులు, నాన్నతో దోబూచులాడిన వేళలూ, నేడు అందుకోలేని అనుభూతులుగా మిగిలిపోవచ్చు!

కానీ బాలరాజూ... నీ ఆశ మాత్రం సజీవం! ఎప్పటికైనా మీ నాయన నిన్ను కలుసుకొని ఆప్యాయంగా అక్కున చేర్చుకోవచ్చునేమో!

# డాక్టర్స్ డైలమా

## కీ. శే. వి. వి. బి. రామారావు

**కథా మార్గదర్శి కథ**

*మనిషి హఠాత్తుగా పడిపోయి చెమటలు పట్టినంత మాత్రాన గుండెపోటనే అనుకోనవసరము లేదు. చాలామంది.. ముందు కీడే ఎంచుతారు. కానీ 'లేబిరింథ్'కీ శరీరం 'ఈక్విలిబ్రియమ్'కీ సంబంధం ఉంది. చెవిలో వ్యాధివల్ల గులిమి పేరుకుపోయి, తల తిరుగుడూ, పడిపోవడం జరగొచ్చు. భయం వల్ల శరీరం చెమటలు పట్టవచ్చు. కరుణ నా స్టూడెంట్. ఇంకాస్త తీరికగా ఆలోచిస్తే అతను తెలుసుకోలేకపోడు. ఏం చేస్తాం, బిజీ ప్రాక్టీస్!"*

"ఈ పెట్టె తవరిదేనా బాబూ?" 'హెయిలీ' నవల 'ఫైనల్ డయాగ్నోసిస్' లో నుండి తల పైకెత్తి చూశాను. ఖాదీపంచ, సిల్క్ చొక్కా, పైన కండువా, వేళ్ళకు పొళ్ళ ఉంగరాలూ, నల్లటి రిస్టుకి గోల్డ్ ప్లేటెడ్ గడియారం.. మోతుబరి రైతులా ఉన్నాడు. లాయర్ దగ్గరకు కేసులు తీసుకువచ్చే టౌట్ జ్ఞాపకం వచ్చాడు అతన్ని చూడగానే!

"అవును. కూర్చుంటారా?" పెట్టె పక్కకు తీశాను.

మరో కాసేపటికి ఎందుకు కూర్చోమన్నానా అని విచారించక తప్పలేదు.

"తమదే ఊరు బాబూ?"

"విశాఖపట్నం."

"డాక్టరుగారింటికి వచ్చినట్టున్నారు?"

ఇతను కరుణ ఇంట్లో నన్ను చూసాడన్నమాట.

రైల్లో ఇలా ప్రారంభించి, పుట్టుపూర్వోత్తరాలు అడిగే వారంటే.. మొదట్లో నాకంత చిరాకు ఉండేది కాదు! కుశల ప్రశ్నల స్థాయి దాటి.. కుటుంబం గురించీ, తల్లిదండ్రుల గురించీ, అలా అలా చివరకు ఆపరేషన్ చేయించుకున్నారా అని అడుగుతారు కొందరు! ఇందులో తప్పు లేదనే అనుకున్నా, ఒక్కోసారి, ముఖ్యంగా ఇలాంటి పుస్తకంలో లీనమై చదువుతున్నప్పుడు, ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టమైన పనే!



"ఊఁ" అని పుస్తకంలో మునిగి పోవాలనుకున్నాను.

పేజీ తిప్పుతుంటే అదే అదుననుకున్నట్టున్నాడు, సిల్కులాల్చీ వ్యక్తి మరో ప్రశ్న..

"మీరు కాపురం విశాఖపట్నమేనా?"

"ఆఁ."

"డాక్టర్‌గారు మీకు బంధువా?"

"ఆఁ."

"కరుణాకర్రావుగారు మీకు బంధువులా?"

"అంతకంటే ఎక్కువే."

"కలిసి చదువుకున్నారు కాబోలు?" వాక్యం చివర ప్రశ్నార్థకం వినిపించింది.

"ఆఁ."

"అంటే తమరూ విశాఖపట్నంలోనే చదివారన్నమాట?"

"ఆఁ."

పుస్తకం చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది. సాఫుగా సిమెంటు రోడ్డుమీద కొత్త కారులా సాగిపోతుంది కథనం. పుస్తకం చదువుతూనే సిగరెట్ తీసి, నోట్లో పెట్టుకున్నాను.

“ఇదిగో బాబూ అగ్గిపెట్టె” పుల్ల కొట్టి అందించాడు- - - నేను అగ్గిపెట్టే కోసం తడుముకోవడం గమనించిన సిల్కులాల్చీ!

“థాంక్యూ.”

“అయితే బాబూ, తమరూ డాక్టర్ గారేనా?”

“ఆఁ, అయినా..” అతనికెలా చెప్పాలో తెలియక తికమక పడుతుంటే మళ్ళీ ప్రారంభించేశాడు.

“బాబ్బాబు, ఒకసారి నామాట విందురూ! ఒకరికి ఇద్దరినడిగితే మరీ మంచిది. ఏమిటో బాబూ, ఉండీ ఉండీ చుట్టూ ప్రపంచం తిరిగిపోతున్నట్టు అనిపిస్తుంది. జబ్బేమిటో తెలియదు. దబ్బున పడిపోతాను. ఒళ్ళంతా చెమటలు. కరుణబాబు.. ‘పెద్ద జబ్బేమీ లేదు, పదిరోజుల్లో బాగుచేస్తానన్నారు.’ అయినా మా ఇంటిది ఊరుకోలేదు. వైజాగ్ వెళ్ళి చూపించుకోమంది. కరుణబాబు దగ్గరకు వస్తే, పెద్ద డాక్టరుగారి పేరు రాసిచ్చారు. మీరూ ఉన్నారు కదా బాబూ.. అప్పుడు అక్కడే!”

నేను ఊరు వదలడమంటూ పడితే, రాత్రి నిద్రపోయే వరకూ నేనూ, కరుణా కలిసే ఉండడం చిన్నప్పటి నుండీ అలవాటు! ఆస్పత్రిలో వాడి కుర్చీకెదురుగా కుర్చీ వేసుకొని, గంటల కొద్దీ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగుల్ని చూస్తూ వాడు వేస్తున్న ప్రశ్నలూ, నా కోసం చేస్తున్న కామెంటరీ.. వినడం నాకు చాలా సరదా. నేనక్కడ కూర్చొని ఉండగా వచ్చాడేమో.. నాకు మాత్రం జ్ఞాపకం లేదు.

నాకూ ప్రశ్న వేయాలనిపించింది.

“అసలు మీకు ఒంట్లో ఇబ్బంది ఏమిటి?” పుస్తకం మూసేశాను.

“అలా అడిగారు బాబూ, సంతోషం. అసలు డాక్టర్లకు తీరిక దొరకదు. ఎప్పుడూ ఏదో గొడవా, పరుగులూ. ఓ రోగిని పరీక్షిస్తూనే, మరొకరికి ఏ మందు ఎలా వాడాలో చెప్తూ, మరొక పేషెంటు నోట్లో థర్మామీటరు గుచ్చేస్తూ ఉంటారు.”

నవలలోకే పోదామనుకున్నా... అయినా, సిల్కులాల్చీ నన్ను పుస్తకం తీయనివ్వలేదు.

“బాబ్బాబు, పుస్తకం తియ్యకండి! ఈవేళ నేనీ పెట్టెలో ఎక్కడం నా అదృష్టం. ఇంతసేపు మీతో మాట్లాడగలగడం మీ మంచితనం. పెట్టె చూడగానే అనుకున్నాను. పేరు చూశాక అనుమానం నివృత్తి అయిపోయింది. అయితే బాబూ, వైజాగులో బాగు చేస్తారంటారా?”

“అసలు మీకేమైంది?”

“ఉండుండి దబ్బున పడిపోతాను. చెమటలు, కాళ్ళూ చేతులూ చల్లగా అయిపోతాయి.”

“మరి కరుణ పరీక్ష చేయలేదా?”

"చేశారు బాబూ, పెద్ద జబ్బేమీ లేదన్నారు. నాకు అనుమానం తీరక టౌను వెళ్ళి, ఫోటో కూడా తియ్యించుకున్నాను. అన్ని తనిఖీలూ చేశారు. ఏభై తీసుకున్నారు. జబ్బు కనిపించలేదన్నారు."

ఇదేదో వింత కేసులా ఉంది అనుకోని, మళ్ళీ అడిగాను. "మరి తనికీ చేయించుకోమని ఎవరు చెప్పారు?"

"నేనే చెయ్యించుకున్నాను.. కరుణబాబుతో చెప్పకుండా! చెయ్యించుకున్న తరవాత చెప్పాను. పెద్ద డాక్టరు పేరు చెప్పమని అడిగాను. వైజాగు మరేదో పని మీద వెళ్తున్నానని అబద్దం కూడా ఆడాను. ఏ కళనున్నారో, మాటాడకుండా చీటీ మీద పేరు రాసిచ్చారు."

కాగితం తీసి చూపించాడు. డాక్టర్ సూర్యనారాయణ అని రాసి ఉంది. ఆయన ఎడ్రసూ ఉంది.

కరుణ కేవలం పేరు మాత్రమే ఎందుకు రాశాడు చెప్మా అని ఆలోచించాను. నిజంగా కరుణకి వ్యాధి నిర్ణయం విషయంలో అనుమానం వస్తే, ఉత్తరం రాసి ఇచ్చును కదా! పేరొక్కటే ఎందుకిచ్చాడు?

"బాబూ వీరిని మీకు తెలుసా?" మడిచి జేబులో పెట్టుకున్న కాగితం వేపు చూపిస్తూ అడిగాడు.

"తెలియకేం, తెలుసు. చేతికి రబ్బరు గొట్టంలాంటిది కట్టి, తిత్తి నొక్కి, మీటరు చూసారా?"

"బ్లడ్‌ప్రెషర్ నార్మల్గా ఉందని చెప్పారు."

సిల్కులాల్చీని అండర్ ఎస్టిమేట్ చేశానని నాలిక కరుచుకున్నాను.

బ్లడ్‌ప్రెషర్ నార్మల్‌గా ఉంటే ఎందుకు పడిపోతున్నాడు? చటుక్కున ఓ ఆలోచన తట్టింది.

"ఏదీ ఆ చీటీ?"

తీసిచ్చాడు. జేబులో బాల్‌పాయింట్ పెన్ తీసి, ఆ వెనుకనే నాలుగు మాటలు రాసి ఇచ్చాను.

"ఇది తీసుకెళ్లి ఆ సూర్యనారాయణగారికి ఇవ్వండి."

"తెలియక అడుగుతాను బాబూ, ఆయన మీలాగా చనువుగా మాట్లాడతారా?"

"మాట్లాడకేం, బాగా మాట్లాడతారు."

"అదికాదు బాబూ నా ఉద్దేశ్యం, ఫీజు...?"

"కరుణ చెప్పలేదా?"

"నేను అడగడానికి మొహమాట పడ్డాను."

"సరే ఆయననే అడుగు, తనికీ చేయించుకున్నాక."

"అలా కాదు బాబూ, ముందే ఒక వంద కాయితం పెట్టేస్తే మంచిదని విన్నాను."

అన్ని ఆరాలూ తీసే బయలుదేరాడన్న మాట. ''సరే నీ ఇష్టం.''

''బాబూ మీరు కూడా ఓ మాటు దయచేసి...''

''అబ్బే మరేం అవసరం లేదు. అన్నీ ఆయనే చూసుకుంటారు. మరేం పరవాలేదు.''

రైలు విజయనగరంలో ఆగగానే ఆయన దిగి వెళ్ళాడు. కాఫీ కోసం అనుకున్నాను. మళ్ళీ రాలేదు.

నాకు పుస్తకంలోకి మనసు వెళ్ళలేదు. కరుణ స్పెషలిస్టు దగ్గరకి ఇతన్ని ఎందుకు పంపుతున్నట్టు? బహుశా వైజాగ్ వెళ్ళి, చూపించుకొని, ఆర్భాటం చేస్తే కాని ఈ సిల్కులాల్చీకి నమ్మకం కుదరదేమో? వంద రూపాయలిస్తే ఒకలాగా, వాళ్ళ ఊళ్ళో చిన్న డాక్టర్ మరొకలాగా.. వ్యాధి నిర్ణయం చేస్తారని అతని అనుమానమేమో? అందుకే కరుణ స్పెషలిస్ట్ పేరు రాసిచ్చి ఉంటాడు.

కాదు, మరి నా డయాగ్నోసిస్ కరక్ట్ అవునో కాదో? నేను చేసిన సూచనకు ఆయన ఎలా రియాక్ట్ అయ్యాడో తెలుసుకోవాలనిపించింది.

శనివారం కోసం ఆగాను.

★★★

క్లబ్బులో సూర్యనారాయణగారు టెన్నిస్‌కు వచ్చినా, శనివారం కొంతసేపు మా టేబుల్ దగ్గర రమ్మీ ఆడడం అలవాటు. అతని కంపెనీ కోసం శనివారాలు ఫైవ్ ఎండ్ టెన్ మానేసి ప్రత్యేకంగా వన్ ఎండ్ టూ వేస్తుంటాం. అంతకంటే ఎక్కువ స్టేక్ ఆడడం అతని ప్రిన్సిపుల్స్‌కి విరుద్ధం. రోజూ కంటే పదినిమిషాల ముందే టేబుల్ వద్దకు వెళ్ళాను. అతను వేళకు సరిగా వచ్చారు. అప్పటికే కొంతమంది ఆడుతున్నారు.

ఆ టేబుల్ దగ్గర.. ''హలో డాక్టర్ మూర్తీ, యూ ఆర్ ఎర్లీ టుడే'' పలకరిస్తూ వచ్చారు.

''ఈవెనింగ్ డాక్టర్'' అన్నాను.

''డాక్టర్‌గారు వచ్చారు, రండి, కట్ ఫర్ సీట్స్'' అన్నారు టెక్నికాలిటీస్ పాటించే లాయర్ సుదర్శనంగారు.

షఫ్లింగ్ సూర్యనారాయణగారికి వచ్చింది. చేతి వరస నాకొచ్చింది. ముక్కలు చకచకా పంచేసి ''గుడ్‌లక్ డాక్టర్'' అన్నారు.

ఆయన నన్ను 'డాక్టర్' అన్నప్పుడల్లా ఎత్తిపొడుపులా ఫీలయ్యేవాడ్ని. డాక్టర్ అంటే వైద్యుడే కానీ, ప్రతీ పీహెచ్డీ డాక్టరేనా అన్న ధ్వని ఆయన పిలుపులో ధ్వనించినట్టు అనిపించేది నాకు.

మూడు రౌండ్లు తిరిగినా.. నా పేక బతకలేదు. సూర్యనారాయణగారు డిక్ చేశారు. పచ్చి ఏసీ ఇచ్చేశాను.

మరో రెండాటలు ఏసీ ఇచ్చేశాక సూర్యనారాయణగారు అడిగారు. ''వెల్ యంగ్ మాన్, వాటీజ్ ఆన్ యువర్ మైండ్?''

ముప్పయ్యేళ్ళ వృత్తి నిర్వహణలో సంతరించుకున్న తార్కిక శక్తితో అన్యమనస్కంగా ఆడుతున్నానని గ్రహించారు.

నవ్వేసి ఊరుకున్నాను. వరసగా రెండాటలు ఫస్ట్ డ్రాప్ చేశాను. తరవాత ఆట నాకు డీల్ షో పడింది.

“గుడ్ షాట్!” నేనేదో పెద్దపులిని ఒక్క తూటాతో కూల్చేసినట్టూ.. లేకపోతే అవతల ప్లేయర్ చిత్తయిపోయేటట్టూ, ఓవర్హెడ్ షాట్ కొట్టినట్టూ నన్ను శ్లాఘించారు ఆయన.

“ఈ రౌండుతో లేచిపోదాం” అన్నాను.

“ఓ యెస్, సరదా లేకపోతే ఆట దగ్గర కూర్చో కూడదు.” ఓ సుభాషితం పారేశారు సూర్యనారాయణగారు.

ఎనిమిదౌతుండగా లేచాం.

నా స్కూటర్ తీసుకొని, సూర్యనారాయణగారు కారు స్టార్ట్ చేయబోతుండగా “డాక్టర్‌గారూ” అని పిలిచాను.

“వాట్ యంగ్ మాన్?” కారులో చిన్న దీపం వెలిగించారు ఆయన.

“మీ దగ్గరకు మొన్నటి నుండీ వద్దామనే అనుకుంటున్నాను. శనివారం కోసం చాలా కష్టంతో ఆగాను.”

“నా దగ్గర మొహమాటం ఎందుకోయ్? వాటీజ్ ద మేటర్?”

“పార్వతీపురం నుండి మొన్న మంగళవారం..”

“ఔనౌను, కరుణ పేషెంటట.. ఒకతను వచ్చాడు. బొత్తిగా బద్ధకస్తులైపోతున్నారోయ్ జనరల్ ప్రాక్టీషనర్స్! కాస్త ఓపికగా చూస్తే సరిపోయే కేసు కూడా స్పెషలిస్టుకి రిఫర్ చేసేస్తున్నారు. అంత బిజీ అయిపోయి..”

ఆయనను ఆపి, ఆ సిల్కులాల్చీ విశాఖపట్నం రావడానికి కారణం కరుణ కాదని చెప్పాలనుకొని, ఆయనను ఆపే మార్గం కోసం వెదికాను. ”ఆ చీటీ వెనకాల.. “

“అదీ చూశాను. రైల్లో ఎవరో మరో డాక్టర్.. కరుణ స్నేహితుడేనట.. అతనికి చూపించాడట ఆ కాయితం. అతనెవరో రియల్లీ క్లెవర్ ఫెలో. కామన్సెన్స్ ఉపయోగించి, అతను చెప్పిన లక్షణాలను బట్టి పరీక్ష చేయకుండానే హార్ట్ డీసీజ్ ఎలిమినేట్ చేశాడు. అతను ఇంతకీ ఆరోగ్యంగానే కనబడుతున్నాడు. టెస్టులన్నీ చేయించుకున్నట్టు చెప్పనే చెప్పాడు. నాలుగు మాటలు వెనక రాశాడు. ‘వాక్స్ ఇన్ ద లేబిరింత్’ అని. నే చూసినదీ దానికోసమే.. చదువుకున్నవాడివని చెప్తున్నాను. మనిషి హఠాత్తుగా పడిపోయి చెమటలు పట్టినంత మాత్రాన గుండెపోటనే అనుకోనవసరము లేదు. చాలామంది.. ముందు కీడే ఎంచుతారు. కానీ ‘లేబిరింథ్’కీ శరీరం ‘ఈక్విలిబ్రియమ్’కీ సంబంధం ఉంది. చెవిలో వ్యాధివల్ల గులిమి పేరుకుపోయి, తల తిరుగుడూ, పడిపోవడం జరగొచ్చు. భయం వల్ల శరీరం చెమటలు పట్టవచ్చు. కరుణ నా స్టూడెంట్. ఇంకాస్త తీరికగా ఆలోచిస్తే అతను తెలుసుకోలేకపోడు. ఏం చేస్తాం, బిజీ ప్రాక్టీస్!”

నిజంగా చిక్కులో పడ్డాను. ‘కాయితం మీద రాసినది నేనని చెప్పుకోవడమా, వద్దా? చెబితే కరుణ మీద ఆయన ఇంప్రెషన్ ఇంకా పోతుంది. మెడిసిన్‌లో డిగ్రీ లేని నేను.. అలా వ్రాయడానికి చొరవ తీసుకున్నందుకు నా మీద ఆయన విరుచుకుపడితే? పోనీ, కరుణ ఎక్జామిన్ చేసి, అదే నిర్ణయానికి వచ్చి ఉంటాడనీ, అతని మాట ఆ సిల్కులాల్చీ ఆసామీ వినలేదనీ ఉన్నమాట

చెపితే? ఇదంతా విన్నాక పేషెంట్ లో కాన్ఫిడెన్స్ ఇన్స్పైర్ చేసి, వారికి ఊరట కలిగించడం తమ బాధ్యత అన్న విషయం డాక్టర్లు పూర్తిగా విస్మరిస్తున్నారనీ ఆయన లెక్చరందుకుంటే?'

కొంచెం ధైర్యం తెచ్చుకున్నాను.

"అది సరే డాక్టర్, చీటీ వెనకాల సూచన ఎవరు రాసినా, కరుణ మాత్రం మాటవరసగా నాకో మాట చెప్పాడు. పేషెంట్లకు స్పెషలిస్ట్ మీద ఉన్న నమ్మకం.. మరోలా అనుకోకండి, వారికిచ్చే పెద్దమొత్తం ఫీజువల్ల కావచ్చు.., మామూలు డాక్టర్ల మీద ఉండదు. ఈ రకమైన పిచ్చికి, చిన్నపామైనా పెద్ద కర్రతో కొట్టాలనే మనస్తత్వం కూడా కారణం కావచ్చు. ఏది ఏమైనా కరుణ మీతో చెప్పమన్నాడు (ఘోరమైన అబద్ధం ఆడేశాను).. 'తను ఇచ్చే మందు మీద నమ్మకం లేక, స్పెషలిస్ట్ పిచ్చి ఉన్న పేషెంట్ కు కాస్త డబ్బు వదిలిద్దామని మీ పేరు రాశానని.' ఇంక, ఫీజు మొత్తం కాస్త ఎక్కువ చెయ్యడానికి ఓ విధంగా నేనూ దోహదం చేశాననుకోండి."

మళ్ళీ తమాయించుకున్నాను. అసలు విషయం ఆయన గ్రహించలేరనుకున్నాను. ఇగ్నిషన్ కీ తిప్పుతూ అడిగారు "అయితే వెనక రాసింది నువ్వన్న మాట. భేష్! డాక్టర్లు కాస్త 'హార్స్ సెన్స్' ఉపయోగిస్తూ ఉండాలని గుర్తు చేశావు. కానీ, నీకు.."

ఆయన అడగబోయే ప్రశ్న నాకు అర్థమైపోయింది.

సిగ్గుతో మొహం వేడెక్కుతుండగా అన్నాను "పుస్తకాలు.." వాక్యం పూర్తి చెయ్యకుండానే స్కూటర్ స్టార్ట్ చేశాను.

మరి కరుణాకు ఉత్తరం రాయడమా, మానడమా? రాస్తే ఏమని రాయాలి? నా డయాగ్నోసిస్ రైటయ్యిందని రాస్తే సూర్యనారాయణగారు వాడ్ని అకారణంగా మందలించారనీ రాయాలి కదా?

నేను చదువుకోడానికి అవకాశం లేకపోయిన చదువును తీరిగ్గా చదువుకుంటున్నానని సూర్యనారాయణగారికి తెలియజేయకుండా మాత్రం ఉండలేకపోయాను.

*(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక.. 07.05. 1975 నుంచి పునర్ముద్రణ)*

ఎటువంటి లాభాపేక్ష లేకుండా,
తెలుగు కథ ప్రాచుర్యమే ధ్యేయంగా
నడుపబడుచున్న పత్రిక .. మన
**కథామంజరి.**
సాధారణంగా ఏ పత్రికనైనా,
చందా చెల్లింపు ద్వారానే పొందగలం.
కాని కథామంజరి విషయంలో
చందా అనేది ఐచ్ఛికం మాత్రమే.
చందా చెల్లించినా, లేకున్నా..
అందరూ అందుకునే పత్రిక ఒకటే!
తెలుగు కథను
చదవండి .. చదివించండి!

వార్షిక చందా రూ.200/-

ఉచిత సంచిక కోసం